ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

14-10-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 253 పేజీలు: 10+4 వెల: 6.50




జోయల్ మోకిర్ ఫిలిప్ అఘియాన్ పీటర్ హోవిట్

## ముగ్గురు ఆర్థికవేత్తలకు నోబెల్ 2లో

# దేశ ప్రగతిలో ఎపి కీలకం



సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి జ్ఞాపికను అందజేస్తున్న సిఎం చంద్రబాబు

### అంతర్జాతీయ పెట్టుబడులకోసం నిర్వహిస్తున్న విశాఖ సమ్మిట్‌కు రండి: ప్రధాని మోడీని ఆహ్వానించిన సిఎం చంద్రబాబు

### సదస్సుకు రానున్న 29 మంది వాణిజ్య మంత్రులు, 80 మంది గ్లోబల్ సిఇఒలు, 40 దేశాల ప్రతినిధులు, 13 మంది కేంద్ర మంత్రులు

### సిఆర్‌డిఎ భవనం ప్రారంభం 2లో

**విజయవాడ,అక్టోబరు13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోడీని సిఎం చంద్రబాబు నాయుడు సోమవారం సాయంత్రం ఢిల్లీలో కలిసారు. విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీల్లో జరగనున్న కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ప్రధానిని ఆహ్వానిస్తూ అధికారికంగా ఆహ్వానం అందజేశారు. దేశ ప్రగతిలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించేందుకు సన్నద్ధమవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. దేశ ఆర్థిక, సాంకేతిక అభివృద్ధిలో ఎపి అగ్రగామిగా నిలవాలని, దానికోసం అంతర్జాతీయ పెట్టుబడులు ఆకర్షించడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. ఈ క్రమంలో పిఎం నరేంద్ర మోడీని కలుసుకుని విశాఖపట్నంలో జరగనున్న సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు ముఖ్య >>2

# కల్తీ మద్యంలో జోగి రమేష్ పాత్ర!

### ములకలచెరువు కేసులోని నిందితుడు జనార్దన్ రావు ఆరోపణ



జోగి రమేష్

### ఆరోపణ పూర్తి నిరాధారం: రమేష్

**విజయవాడ, అక్టోబరు 13,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో ములకల చెరువులో బయటపడిన నకిలీ మద్యం కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏ1 నిందితుడుగా ఉన్న అద్దెపల్లి జనార్దన్ రావు తాజాగా సంచలనం సృష్టించారు. వైఎస్సార్సీ నేత జోగి రమేష్ చేసిన కుట్ర వల్లనే ఇదంతా జరిగిందని ఆయన ఓ వీడియోలో ఆరోపించారు. జోగి రమేష్ ఇచ్చిన రూ.3కోట్లుఆఫర్‌కు ఆశ >>2



జనార్దన్ రావు

### కల్తీ మద్యం కేసులో మరొకరి అరెస్టు 2లో

# ఇక తుపాకులు పేలవు..



### గాజాలో యుద్ధం ముగిసింది 2లో

పాక్, అఫ్ఘాన్ ఉద్రిక్తతలూ తగ్గిస్తా

యుద్ధాలు ఆపడంలో నిపుణుడిని..

ఇజ్రాయెల్ పార్లమెంటులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్

# అమరావతిలో స్పోర్ట్స్ సిటీ

### అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు: హోంమంత్రి అనిత

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ సిటీని నిర్మిస్తున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ లాంటి క్రీడా కార్యక్రమాలు పోలీస్ శాఖలోని క్రీడా సామర్థ్యాన్ని, శిక్షణను, పరస్పర సహకారాన్ని ప్రతిబింబించేందుకు గొప్ప వేదికగా నిలుస్తాయన్నారు. రెండవ ఆల్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025-26 పోటీలు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం 6వ బెటాలియన్, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ క్రీడా ప్రాంగణం. మంగళగిరిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణశాఖ మంత్రి వంగలపూడి అనిత, విశిష్ట అతిథిగా రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పాల్గొన్నారు. ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సీపీవోల నుంచి వచ్చిన 32 టీమ్ లు మార్చ్ ఫాస్ట్ చేసి ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం హోం మంత్రి అనిత, డిజిపి హరీష్ కుమార్ గుప్తా పోటీలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ జాతీయస్థాయి క్రీడా సమ్మేళనంలో వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, యోగా అంశాల్లో పురు >>2

# కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వండి

### హోంశాఖ ముఖ్యకార్యదర్శికి హైకోర్టు ఆదేశం

**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఒక ట్రాన్స్‌జెండర్‌కు ఎస్ఐ ఉద్యోగ కల్పన విషయంలో పోలీసు ఉన్నత ఉద్యోగుల తీరును ఎపి హైకోర్టు తప్పుపట్టింది. గతంలోఒక ట్రాన్స్ జెండర్‌కు ఎస్ఐ ఉద్యోగ కల్పన విషయంలో జారీ చేసిన ఆదేశాల అమలు గురించి వివరణ ఇచ్చేందుకు ఈ నెల 27న జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్‌కు హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు జస్టిస్‌బట్టు దేవానంద్, >>2






కర్నూలులో ప్రధాని పర్యటన ఏర్పాట్లు సోమవారం పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, బిసి జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కిలారు రాజేష్, సత్యనారాయణరాజు, దామర్ల సత్య, బివి వెంకట రాముడు తదితరులు

# ప్రధాని పర్యటనకు పకడ్బందీ భద్రత

## డ్రోన్ల ఎగురవేతపై నిషేధం: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** ఈ నెల 16వ తేదీన కర్నూలులో జరిగే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనను దృష్టిలో ఉంచుకుని 7,500 మంది పోలీసులతో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం కర్నూలు పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని యూబిఆర్ కన్వెన్షన్ హాల్‌లో బందోబస్తు విధుల్లో పాల్గొననున్న అడిషనల్ ఎస్పీ నుండి ఎస్సై స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రధాని పర్యటన ప్రాంతాల్లో 200 సిసి కెమెరాలతో నిఘా, డిజిపి కంట్రోల్ రూమ్ నుండి మానిటరింగ్, మరియు ఎయిర్‌పోర్టు, సభా ప్రదేశం, పార్కింగ్ ప్రాంతాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని చెప్పారు. బహిరంగ సభ ప్రాంతానికి ఏడు మంది ఎస్పీ స్థాయి అధికారులను కేటాయించామని, అధికారులు సెక్టార్ ఇంచార్జ్‌ల సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఫోటోలు, వీడియోలు తీయరాదని బందోబస్తు సిబ్బందికి హెచ్చరిక జారీచేశారు. డ్రోన్ల వినియోగం పూర్తిగా నిషేధించబడిందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల నుండి సుమారు 7,000 బస్సుల్లో ప్రజలు బహిరంగ సభకు రానున్నారు. ఇందులో 3,000 ఆర్టీసీ బస్సులు, 4,000ప్రైవేట్ బస్సులు ఉన్నాయనితెలిపారు. భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తున్నామని, ప్రజలు, అధికారులు అందరూ సహకరించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు.

# కల్తీ మద్యంలో జోగి రమేష్ పాత్ర!

>> పడే ఇదంతా చేశానని జనార్ధన్‌రావు చెబుతున్నాడు. వైఎస్సార్సీ హయాం లోనే పెద్ద ఎత్తున నకిలీ మద్యం వ్యాపారం చేశామని జనార్ధన్ రావు తెలిపారు. పోలీసులు పట్టుకుంటే బెయిల్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే వైఎస్సార్సీ ఓడిపోయిన తర్వాత నిఘా ఎక్కువకావడంతో నకిలీ మద్యం తయారీ ఆపేశామ న్నారు. ఏప్రిల్‌లో జోగి రమేష్ మద్యం తయారీ ప్రారంభించా లని సూచించారని పోలీసులకు చెప్పారు. ఒక వేళ దొరికితే.. ప్రభుత్వంపై బురదచల్లవచ్చని.. తంబళ్లపల్లెనుంచే ప్రారంభిం చాలని సూచించారన్నారు. దొరికితే అన్ని విధాలుగా అండగా ఉంటాననిచెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆయన చెప్పారు. అద్దెపల్లి నర్సింగరావు స్టేట్‌మెంట్ సంచలనం సృష్టి స్తోంది. ఈ క్రమంలో ఎన్టీఆర్‌జిల్లా ఇబ్రహింపట్టణం సమీ పంలో జనార్ధన్‌రావు కాల్‌లిస్టు ఆధారంగా పలువురిని విచారి స్తున్నట్లు సమాచారం!

**పక్కా వ్యూహంతో బాబు కుట్ర: జోగి రమేష్**

మద్యం కేసులో డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా తనను ఇరికించాలని సిఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి జోగి రమేష్ ఆరోపించారు. అద్దేపల్లి జనార్ధన్‌తో ఆ కుట్రలో భాగంగానే అభియోగాలు చేయిస్తున్నారన్నారు. ఈ మేరకు రమేష్ ఒక ప్రకటన విడుదల చేసారు. నకిలీ మద్యం కేసులో పీకలలోతుకు ఇరుక్కుపోయారన్నారు. ఈ విషయం నుంచి ప్రజల దృష్టి మరలించడానికి నానా పాట్లు పడుతున్నారన్నారు. నకిలీ మద్యం విషయంలో ప్రజలు ఇప్పటికే ఒక అవగాహనతో ఉన్నారన్నారు, లిక్కరు మంచిదా, నారావారి మార్కు మద్యమా అని ప్రశ్నిస్తున్నారన్నారు.

# కల్తీ మద్యం కేసులో మరొకరి అరెస్టు

**విజయవాడ, అక్టోబరు 13, ప్రభాతవార్త ప్రతినిధి:** కల్తీ మద్యం కేసులో దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో మరో అరెస్టు చోటుచేసుకుంది. పోలీసులు చైతన్యబాబు (ఎ22) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. చైతన్యబాబు పెద్దతిప్ప సముద్రం మండలంలోని ఆంధ్రా వైన్స్‌లో పని చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. తంబళ్లపల్లె కోర్టులో చైతన్యను ఎక్సైజ్ పోలీసులు హాజరుపరిచారు. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్ధన్‌రావు సహా 13 మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ తాజా అరెస్టుతో కేసులో మొత్తం 14 మంది నిందితులు అయ్యారు.

**ప్రభుత్వం లక్ష్యం అసలైన నెట్ వర్క్‌ను బట్టబయలు చేయడం:**

నకిలీ మద్యం కేసు రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడేలా అక్రమంగా మద్యం తయారీ, సరఫరా జరిగిందనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎవరినీ వదలకుండా, వాస్తవాలు వెలికి తీయాలని స్పష్టం చేసింది. మద్యం తయారీలో పాల్గొన్న సరఫరాదారులు, ఆర్థిక మద్దతుదారులు వంటి వారందరినీ గుర్తించాలన్నది సిట్ ప్రధాన లక్ష ్యంగా ఉంది.

# ముగ్గురు ఆర్థికవేత్తలకు నోబెల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ఆర్థిక శాస్త్రంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్ పురస్కారం లభించింది. జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియాన్, పీటర్ హోవిట్‌లను 2025 సంవత్సరానికి గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ప్రకటించింది. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వృద్ధిని ఎలా నడిపిస్తాయో వివరించినందుకు గాను వారికి ఈ గౌరవం దక్కింది. నిరంతర వృద్ధికి కొత్త సాంకేతికత ఎలా దోహదం చేయగలదో వారు వివరించారని పేర్కొంది. గత రెండు శతాబ్దాల్లో చరిత్రలో మొదటసారి ప్రపంచవ్యాప్తంగా నిరంతర వృద్ధి నమోదైనట్లు స్వీడిష్ అకాడమీ తెలిపింది. పెద్దసంఖ్యలో ప్రజలు పేదరికం నుంచి బయటపడమే కాకుండా ప్రపంచ శ్రేయస్సుకు పునాది వేసినట్లు పేర్కొంది.

నూతన ఆవిష్కరణలు ప్రపంచ పురోగతికి ఎలా దోహదం చేస్తాయో జోయల్ మోకిర్, ఫిలిప్, పీటర్ వివరించినట్లు స్వీడిష్ అకాడమీ తెలిపింది. మోకిర్, హోవిట్‌లు అమెరికాకు, అఘియన్ బ్రిటన్‌కు చెందిన ఆర్థిక నిపుణులు. గత రెండు శతాబ్దాలుగా ప్రపంచం చూస్తున్న నిరంతర ఆర్థిక ప్రగతి వెనుక ఉన్న కీలక సూత్రాలను ఈ ముగ్గురు తమ పరిశోధనల ద్వారా వెలుగులోకి తెచ్చారు. మానవ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కొనసాగుతున్న ఈ వృద్ధి, కోట్లమందిని పేదరికం నుంచి బయటపడేసి నేటి మన సంపదకు పునాది వేసింది. ఈ ప్రగతికి వెనుక ఆవిష్కరణల పాత్రను అర్థమయ్యేలా చెప్పడమే వీరి పరిశోధనల సారాంశం. ఫిలిప్ అగియాన్, పీటర్ హోవిట్ కలిసి 'సృజనాత్మక విధ్వంసం' అనే సిద్ధాంతాన్ని రూపొందించారు. మార్కెట్‌లోకి ఒక కొత్త, మెరుగైన టెక్నాలజీ లేదా ఉత్పత్తి వచ్చినప్పుడు, పాత టెక్నాలజీపై ఆధారపడిన కంపెనీలు దెబ్బతింటాయని వీరు వివరించారు. ఈ ప్రక్రియ ఒకేసారి సృజనాత్మకంగా, అదే సమయంలో విధ్వంసకరంగా ఉంటుందని తెలిపారు. కొత్త ఆవిష్కరణ సమాజాన్ని ముందుకు తీసుకెళితే, పాత పద్ధతులు కనుమరుగవడం వల్ల జరిగే నష్టాన్ని 'విధ్వంసం'గా పేర్కొన్నారు. "ఆర్థిక వృద్ధిని తేలికగా తీసుకోలేమని ఈ విజేతల పరిశోధన స్పష్టం చేస్తోంది. మనం తిరిగి స్తబ్దతలోకి జారిపోకుండా ఉండాలంటే, సృజనాత్మక విధ్వంసానికి ఆధారమైన వ్యవస్థలను కాపాడుకోవాలి" అని ఎకనామిక్ సైన్సెస్ ప్రైజ్ కమిటీ ఛైర్మన్ జాన్ హాస్లర్ తెలిపారు.

# దేశ ప్రగతిలో ఎపి కీలకం

>> అతిథిగా ఆహ్వానించారు. సోమవారం జరిగిన ఈ సమావేశంలో సిఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్‌శేఖర్, అలాగే టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. మోడీతో భేటీకి ముందు ముఖ్యమంత్రి సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ, వాణిజ్య శాఖ, సిఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ సిఐఐ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులను తీసుకురావడమే కాకుండా, ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెంచుకోవాలి. ఈ వేదిక సరికొత్త ఆలోచనలకు, ఇన్నోవేషన్ భాగస్వామ్యానికి దారితీయాలి" అని అన్నారు. ఈ సదస్సు టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్ నావిగేటింగ్ ది జియోఎకనామిక్ ఆర్డర్ అనే థీమ్‌తో జరగనుంది. మొత్తం 13 సెషన్లు జరుగుతాయి. ఇందులో 29 మంది వాణిజ్య మంత్రులు, 80 మంది గ్లోబల్ సిఇఒలు, 40 దేశాల ప్రతినిధులు, 13 మంది కేంద్ర మంత్రులు పాల్గొనే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అమెరికా, యూరప్, మధ్యప్రాచ్యం, ఆసియా, పశ్చిమాసియా దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఈ సమ్మిట్ నవ్యాంధ్రప్రదేశ్‌లో నాలుగోసారి జరుగుతోంది. గతంలో 2016, 2017, 2018 సంవత్సరాల్లో విశాఖపట్నం ఈ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చింది. ఇప్పుడు నాలుగోసారి అదే నగరంలో జరిగే ఈ సదస్సు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారి తీస్తోంది. చంద్రబాబు అధికారులకు సూచిస్తూ, విశాఖను సుందరంగా తీర్చిదిద్దాలి, విదేశీ అతిథులకు అత్యుత్తమ ఆతిథ్యం ఇవ్వాలి. ఈ సదస్సు ద్వారా ఎపి పెట్టుబడుల గమ్యస్థానంగా నిలవాలి" అని ఆదేశించారు. గ్రీన్ ఎనర్జీ, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఇన్నోవేషన్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా మారుతోందని చంద్రబాబు పేర్కొన్నారు. "గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, వంటి గ్లోబల్ టెక్ దిగ్గజ సంస్థలు రాష్ట్రంపై దృష్టి సారిస్తున్నాయి. త్వరలోనే ఎపి కృత్రిమ మేధస్సు, ఇన్నోవేషన్ హబ్‌గా మారుతుంది" అని అన్నారు. సదస్సు ఏర్పాట్లకు సమయం తక్కువగా ఉండటంతో అధికారులు వేగంగా సన్నాహాలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, సిఐఐ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఎపిని గ్లోబల్ ఎకానమిక్ మ్యాప్‌లో ముందుండే రాష్ట్రంగా మార్చాలన్నదే మా లక్ష ్యం. టెక్నాలజీ, విశ్వాసం, వాణిజ్య భాగస్వామ్యం ఈ సదస్సు ప్రధాన సూత్రాలు అవుతాయి" అని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ సదస్సు రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శిగా, పెట్టుబడుల ప్రవాహానికి వేదికగా నిలుస్తుందని ఆయన నమ్మకంగా చెప్పారు. ఈ బేటీలో భాగంగా ప్రధాని మోడీని సిఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున దుశ్శాలువాతో సత్కరించి., వెంకటేశ్వరస్వామి ప్రతిమను జ్ఞాపికగా అందజేసారు.

# కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వండి

>> జస్టిస్ ఎ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశించింది. 2018 నవంబర్‌లో జారీ చేసిన ఎస్‌ఐ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో ట్రాన్స్ జెండర్లకు రిజర్వేషన్ కల్పన కాలమ్ లేదు. దీనిపై ట్రాన్స్ జెండర్ గంగాభవానీ 2019లో పిటిషన్ వేశారు. అప్లికేషన్‌లో స్త్రీ, పురుష కాలమ్స్ మాత్రమే ఉంటే, స్త్రీగా ఐచ్ఛికం తీసుకుని అప్లికేషన్ పెడితే రాతపరీక్షలో 35 శాతం మార్కులు సాధించినప్పటికీ తనను అనర్హురాలిగా ప్రకటించారనితెలిపారు. గంగా భవానీ పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టేయడంతో డివిజన్ బెంచ్ వద్ద 2022లో అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై గతేడాది బెంచ్ విచారించి, గంగాభవానీకి ఉద్యోగ కల్పనపైచర్యలు తీసుకోవాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు గంగా భవానీకి ఉద్యోగ వ్యవహారంపై హోంశాఖ ముఖ్య కార్యదర్శి నివేదిక ఇవ్వకపోవడంతో హైకోర్టు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అదనపు ఎజి సాంబశివ ప్రతాప్ వాదిస్తూ, కుమార్ విశ్వజిత్ సెలవులో ఉన్నారని చెప్పారు. ఇన్‌ఛార్జి ముఖ్య కార్యదర్శిగా హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కుమార్ కోర్టుకు హాజరయ్యారని చెప్పారు. తదుపరి విచారణకు హాజరుకావాలని విశ్వజిత్‌ను ఆదేశించిన హైకోర్టు విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

# ఏడు రోజులుగా మార్చురీలోనే పూరన్ కుమార్ మృతదేహం

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** హరియాణాలో ఆత్మహత్యకు పాల్పడిన జైళ్ల శాఖ ఐజి ఎపికి చెందిన పూరన్ కుమార్ మృతదేహం ఏడు రోజులుగా ఛండీఘడ్‌లోని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ హాస్పిటల్‌లోనే వుంది. తన భర్త ఆత్మహత్యకు కారణమైన మాజీ డిజిపి శతృజిత్ సింగ్ కపూర్, రోహతక్ ఎస్‌పి నరేంద్ర బిజ్రానియా సహా ఇతరులపై చర్యలు తీసుకునే వరకు ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం చేసేందుకు అంగీకరించబోయని పూరన్ కుమార్ సతీమణి, సీనియర్ ఐఎఎస్ అధికారిణి అమ్నీత్ కుమార్ స్పష్టం చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ఛండీఘడ్ పోలీసులు దీనిపై ఎటూ తేల్చుకోలేక పూరన్ కుమార్ మృతదేహాన్ని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ హాస్పిటల్‌లోనే భద్రపరిచారు. ఈ విషయంలో సర్కారు తదుపరి ఆదేశాల కోసం ఛండీఘడ్ పోలీసులు ఎదురు చూస్తున్నారు. ఈ నెల ఏడవ తేదీన తన సర్వీస్ రివాల్వర్‌తో ఛండీఘడ్‌లోని తన బావమరిది ఇంట్లో పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. పూరన్ కుమార్ ఆత్మహత్యపై స్పందించిన హరియాణా సర్కారు దీనిపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేసింది. అప్పట్లో డిజిపిగా వున్న శతృ జిత్ సింగ్ కపూర్‌ను, రోహతక్ ఎస్‌పి నరేంద్ర బిజ్రానియాలను తప్పించి ఇద్దరిని దీర్ఘకాలిక సెలవుపై పంపింది. పూరన్ కుమార్ సతీమణి చెబుతు న్నట్లుగా ఆయన ఆత్మహత్యకు కారకులైన అధికారులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం తప్పించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే సర్కారు చర్యలపై పూరన్ కుమార్ సతీమణి అమ్నీత్ కుమార్ సంతోషంగా లేరు. వీరిని సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు తెలంగాణ డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క సోమవారం నాడు ఛండీఘడ్ వెళ్లి పూరన్ కుమార్ సతీమణి అమ్నీత్ కుమార్‌ను పరామర్శిం చారు. అనంతరం ఆయన ఛండీఘడ్‌లోని పోస్టు గ్రాడ్యుయేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ హాస్పిటల్‌లో భద్రపరిచిన పూ ర న్ కుమార్ మృతదేహానికి నివాళులు అర్పించారు.

# సిఆర్‌డిఏ భవనం ప్రారంభం

**విజయవాడ, అక్టోబరు 13, ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని నిర్మాణానికి భూ సమీకరణ అనే కొత్త విధానాన్ని తెచ్చామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. సమీకరణ విధానాన్ని సక్సెస్ చేసిన చరిత్ర అమరావతి రైతులదేనన్నారు. ప్రపంచంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ విధానం లేదు.. మనమే ఈ విధానాన్ని తెచ్చాంసక్సెస్ చేశామన్నారు. రాజధాని అమరావతిలో సిఆర్‌డిఏ ప్రధాన కార్యాలయ భవనాన్ని సిఎం చంద్రబాబు సోమవారం ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. మొదట పూర్ణకుంభం, వేదాశీర్వచనాలతో ఆయనకు వేద పండితులు స్వాగతం పలికారు. భూములిచ్చిన రైతులను సిఎం ఆత్మీయంగా పలకరించారు. భవనాన్ని ప్రారంభించినసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని అన్నారు. రైతుల అవస్థలు చూశానని, రోడ్డెక్కి ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సిఆర్‌డిఏ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సిఎం మాట్లాడారు. అమరావతి పనుల రీస్టార్ట్‌తర్వాత మొదటిగా సిఆర్‌డిఏ బిల్డింగ్ ప్రారంభమైందన్నారు. ఇది నాకు సంతోషంగా ఉందన్నారు. అమరావతి మహిళా రైతులు రోడ్డెక్కి పోరాడారు. అనేక ఉద్యమాలు చేశారన్నారు. రైతుల ఉద్యమానికి మద్ధతుగా నేను కూడా జోలె పట్టాను... ఉద్యమానికి అండగా నిలిచానన్నారు. వారు పడిన కష్టాలు మరిచిపోవద్దు. మీరు చేసిన త్యాగాల ఫలితాలను మీరే అనుభవించాలన్నారు. నేను దానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాను. ఫేజ్1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారు. భూములిచ్చినందుకు గత పాలకులు మిమ్మల్ని నానా హింసలు పెట్టారు. రాజధాని ఎడారి అన్నారు వేశ్యల రాజధాని అన్నారుఎంతో అపహాస్యం చేశారు. మీకు రెట్టింపు గౌరవం దక్కేలా... రెట్టింపు ఫలాలు అనుభవించేలా మేము చేస్తాం. హైటెక్ సిటీ నిర్మాణం మొదలు పెట్టే నాటికి అక్కడ ఎకరం రూ. లక్ష ఉండేది ఇప్పుడు రూ.177 కోట్లకు చేరింది. అమరావతి ప్రాజెక్టు సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో నిర్మిస్తున్నాం... విమర్శలు చేసే వారంతా ఈ విషయాన్ని గమనించాలన్నారు. అమరావతి ఓ మునిసిపాలిటీగా మిగిలిపోకూడ దంటే అందుకు తగ్గ మౌలిక సదుపాయాలు అవసరమన్నారు. అమరావతి పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉంటుంది. రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలుసాధిస్తారు. అమరావతి అభివృద్ధికి ఆటంకాలు లేవన్నారు. అమరావతిని క్వాంటంవ్యాలీ చేస్తున్నాం. అమరావతి రైతుల అభివృద్ధికి అండగా ఉంటాం. ఒకసారి జరిగిన తప్పుకు రైతులు, నేను, రాష్ట్రం ఎంత నష్టపోయిందో అందరికీ తెలుసు. మళ్లీ అలాంటి తప్పులు జరగకూడదు. కూటమి ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి. పవన్ కల్యాణ్, బిజెపిలతో కలిసి ముందుకెళ్తున్నాం మీరంతా సహకరించాలి అన్నారు.



సోమవారం సిఆర్‌డిఏ భవనాన్ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు

## వారం - వర్జ్యం

14-10-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
అష్టమి ఉ.11.13
పునర్వసు ఉ.11.58
వర్జ్యం : రా.7.59-9.36
దు.ఉ.8.22-9.09,
2) రా.10.31-11.18
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** అనుకూల ఫలితాలు అధికంగా ఉండటం వలన చెప్పుకోదగిన ఇబ్బందులు ఉండవు.

**వృషభం:** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. సంబంధబాంధవ్యాలు మెరుగ్గా ఉంటాయి.

**మిథునం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు తొలుగుతాయి. ప్రయాణాలు.

**కర్కాటకం :** అనుకోని అవకాశులు లాభిస్తాయి. వాహనాలు, స్థలాలు కొనుగోలు.

**సింహం:** దూరపు బంధువులను కలుసుకొని ఉల్లాసంగా గడుపుతారు.

**కన్య :** సమస్యల నుండి బయటపడతారు. ఉద్యోగలకు బదిలీలు వుంటాయి.

**తుల :** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకోగలుగుతారు.

**వృశ్చికం:** కుటుంబ పురోభివృద్ధి, సంఘంలో గౌరవమర్యాదలు పెంపొందుతాయి.

**ధనుస్సు:** స్పెక్యులేషన్ లాభించదు. వృత్తి ఉద్యోగ వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి.

**మకరం:** కార్యాలయంలో సెలవు కోసం మీరు చేసే యత్నాలు ఫలవంతం కాకపోవచ్చు.

**కుంభం:** మధ్యవర్తిత్వాలు చేయకండి. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలుచేస్తారు.

**మీనం :** ఇతరుల సలహాలు అతిగా స్వీకరిస్తారు. కానీ మీ మనస్సుకు తోచిన పనులనే చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం ఇజ్రాయెల్ పార్లమెంటులో ట్రంప్‌కు జయజయధ్వానాలు చేస్తున్న ఎంపీలు

# ఇక తుపాకులు పేలవు..

## మారణహోమం అంటూ పలువురు ఎంపీల నిరసన

## ట్రంప్‌కు అత్యున్నత పురస్కారాలు అందించిన ఇజ్రాయెల్, ఈజిప్టు

## 20 మంది బందీలను విడుదల చేసిన హమాస్

## ఇజ్రాయెల్ జైళ్లనుంచి 2 వేల మంది ఖైదీల విడుదల

**టెల్‌అవీవ్, అక్టోబర్ 13:** ఇజ్రాయెల్ - హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో తాము విజయం సాధించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్న ఆయన ఆ దేశ చట్టసభలో మాట్లాడుతూ, "థ్యాంక్యూ వెరీమచ్ బేబీ, గొప్ప పని చేశావ్" అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ప్రశంసించారు. మధ్యప్రాచ్యంలో సరికొత్త చరిత్ర ఆరంభమవుతోందని, ఈ పవిత్ర భూమిలో శాంతి నెలకొనడంతో ఆకాశం నిర్మలంగా మారిందని అన్నారు. ఈ ప్రాంతంలో తుపాకులు మూగబోయాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న స్వర్ణయుగం ఇజ్రాయెల్‌లో ప్రారంభమైందని, బందీలు తిరిగి రావడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం విషయంలో తాము సమయం వృథా చేస్తున్నామని చాలామంది అభిప్రాయపడ్డారని, కానీ చివరకు విజయం సాధించామని ట్రంప్ అన్నారు. అమెరికా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బాధిత కుటుంబాలకు ఆయన భరోసా ఇచ్చారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక రాయబారిగా ఉన్న స్టీవ్ విట్కాఫ్, ఆయన సలహాదారు జేర్డ్ కుష్నర్ కీలక పాత్ర పోషించారని ట్రంప్ కొనియాడారు. ట్రంప్ ప్రసంగిస్తున్న సమయంలో కొందరు ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. "మారణహోమం" అంటూ నినాదాలు చేయడంతో వారిని సభ నుంచి బయటకు పంపించేశారు. ఈ నిరసనలపై సభాపతి ట్రంప్‌కు క్షమాపణ చెప్పారు.

**ఈ ప్రపంచానికి మరింత మంది ట్రంప్‌లు కావాలి**

ఇజ్రాయెల్ చట్టసభ సభ్యులు లేచి నిలబడి, చప్పట్లు కొడుతూ, ట్రంప్‌నకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ట్రంప్ లాంటి నేతలు ఈ ప్రపంచానికి మరింత మంది కావాలని కొనియాడారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో స్పీకర్ అమీర్ ఒహానా డొనాల్డ్ ట్రంప్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. "జెరూసలేంకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు స్వాగతం. తాము ఈ రోజు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ట్రంప్ కేవలం మరొక అమెరికా అధ్యక్షుడు కాదు. ఆయన యూదుల చరిత్రలోనే ఒక గొప్ప దిగ్గజం. ఆయన సైరస్ ది గ్రేట్‌తో సమానం. నేటి ప్రపంచానికి కావాల్సింది ధైర్యవంతులు, బలవంతులు, దృఢ నిశ్చయం ఉన్న నాయకులు. అలాంటి లక్షణాలు ఉన్న వ్యక్తే ట్రంప్. ఆయన లాంటి నేతలు మరింత మంది ఈ ప్రపంచానికి అవసరం" అని ఇజ్రాయెల్ పార్లమెంట్ స్పీకర్ అమీర్ ఒహానా అన్నారు. దీనిపై ట్రంప్ తనదైన రీతిలో స్పందించారు. "ఇది నాకు దక్కిన గౌరవం" అని అన్నారు.

**డెడ్లీ వార్నింగ్‌తో...**

సుదీర్ఘకాలంగా ఇజ్రాయెల్-హమాస్ మధ్య గాజా స్ట్రిప్‌లో యుద్ధంజరుగుతోంది. దీనిని ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 21 సూత్రాలతో ఒక శాంతి సూత్రాన్ని రూపొందించారు. దీనిని భారత్, చైనా, రష్యాల సహా పలు ముస్లిం దేశాలు సమర్థించాయి. శాంతి ఒప్పందంలో భాగంగా హమాస్, తన చెరలోని బందీలు విడుదలచేయాలని, ఇజ్రాయెల్‌లో ఉన్న 2వేలకుపైగా పాలస్తీనా ఖైదీలను విడుదల చేయా లని ట్రంప్ సూచించారు. అంతేకాదు నెతన్యాహూను ఈశాంతి ఒప్పందానికి అంగీకరించేలా చేశారు. మరో వైపు, హమాస్‌కుకూడా డెడ్లీవార్నింగ్ఇచ్చారు. ఒకవేళ ఈ ఒప్పందాన్నిఅంగీకరించకపోతే, హమాస్‌కు నరకం చూపిస్తానని దిమ్మదిరిగేలా బెదిరించారు. దీనితో హమాస్‌దిగివచ్చి, ఒప్పందానికి అంగీకారం తెలిపింది.

**ట్రంప్‌కు ఇజ్రాయెల్, ఈజిప్టు అత్యున్నత పౌర పురస్కారాలు**

గాజా శాంతి ఒప్పందం కుదిర్చి, బందీల విడుదలకు కృషి చేసినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇజ్రాయెల్, ఈజిప్టు దేశాలు అరుదైన గౌరవాన్ని అందించనున్నట్లు ప్రకటించాయి. ఇజ్రాయెల్ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన "ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఆనర్"ను అమెరికా అధ్యక్షుడికి ప్రదానం చేయనున్నట్లు మాస్కో అధ్యక్షుడు ఇస్సాక్ హెర్జోగ్ వెల్లడించారు. ఈజిప్టు 'ది ఆర్డర్ ఆఫ్ ది నైల్' అవార్డును ఇవ్వనున్నట్లు అధ్యక్ష కార్యాలయం పేర్కొంది. బందీల విడుదల, చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని సాధించడంలో చేసిన కృషికి గాను ఈ గౌరవాన్ని అందుకోవడానికి ట్రంప్ అర్హుడని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇస్సాక్ హెర్జోగ్ తెలిపారు. రానున్న నెలల్లో సమయం, వేదిక నిర్ణయించి ఇస్తామని పేర్కొన్నారు.

**బందీలను విడుదల చేసిన హమాస్**

మరోవైపు 20 మంది ఇజ్రాయెల్ బందీలను హమాస్ విడుదల చేసింది. తొలి విడతగా ఏడుగురిని విడుదల చేసిన కొద్దిసేపటికే మరో 13మంది విడుదల చేసింది. హమాస్ విముక్తి కల్పించిన వారిని రెడ్‌క్రాస్‌కు చెందిన బస్సుల్లో ఇజ్రాయెల్ సరిహద్దుల వరకు తీసుకెళ్తుండగా అక్కడి నుంచి హెలికాప్టర్లలో ఇజ్రాయెల్ సైన్యం తమ దేశానికి తీసుకెళ్లి చికిత్స అందిస్తోంది. రెండేళ్లుగా నరకయాతన అనుభవించిన తమ వారు విడుదల వడంతో కుటుంబసభ్యులు, శ్రేయాభిలాషుల్లో సంతోషం నెలకొంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా ఖైదీలను మొత్తం 2వేల మంది బందీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది.

# అమరావతిలో స్పోర్ట్స్ సిటీ

>> షుల మరియు మహిళల విభాగాల్లో పోటీలు జరుగుతాయి. వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్ యూ) గుంటూరులోను, యోగా పోటీలు వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) అమరావతిలో జరుగుతాయి. 32 జట్లకు చెందిన 1010 మంది క్రీడాకారులు ఈ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ లో పాల్గొంటున్నారు. ఈ పోటీలు సందర్భంగా హోం మంత్రి శ్రీమతి అనిత మాట్లాడుతూ. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం క్రీడలకు పెద్దపేట వేస్తుందన్నారు. అమరావతి కేంద్రంగా నిర్మిస్తున్న " స్పోర్ట్స్ సిటీ"కి ఈ పోటీలు స్ఫూర్తిగా నిలిచి, భవిష్యత్తుల్లో నిర్వహించబోయే జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వేదికగా నిలుస్తాయన్నారు. పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ లతో పాటు యోగాకు కూడా ఈ పోటీల్లో ప్రాధాన్యత ఇవ్వడం ఎంతో సంతోషకరమన్నారు. ఇటీవల విశాఖలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 3,20,000 మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి గిన్నీస్ వరల్డ్ రికార్డు నెలకొల్పిందన్నారు. యోగ మన సంస్కృతిలో, దైనందిన జీవితంలో భాగమైందన్నారు. శారీరక దృఢత్వానికి మరియు మానసిక స్థైర్యానికి ప్రతీకలుగా నిలిచే వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ మరియు యోగా వంటి క్రీడలు పోలీసు శాఖలో స్ఫూర్తిని నింపే అంశాలన్నారు.

# గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు!

**విజయవాడ, అక్టోబరు 13, ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ అడుగులు వేస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా సోమవారం జిఓ ఆర్‌టి నెంబరు 1859ని విడుదల చేసింది. ఉద్యోగుల ప్రమోషన్లు, వారి సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘాన్ని ఆదేశించింది. మంత్రివర్గ ఉపసంఘంలో సభ్యులుగా డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, పయ్యావుల కేశవ్, పి నారాయణ, సత్యకుమార్ యాదవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సంధ్యారాణి, గొట్టిపాటి రవికుమార్ ఉన్నారు. మంత్రుల కమిటీ తన బాధ్యతలను నిర్వహించేందుకు అవసరమైతే ఏ ఇతర శాఖనుంచైనా నిపుణుడి సహకారం తీసుకోవచ్చని జిఓలో పేర్కొంది. మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించడం పట్ల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఛైర్మన్ ఎమ్‌డి జానిపాషా, సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ, కన్వీనరు షేక్ అబ్దుల్ రజాక్ హర్షం వ్యక్తం చేశారు.

# వైద్య కళాశాలల్లో 300 ఎంబిబిఎస్ సీట్ల పెంపునకు కేంద్రం అనుమతి

**విజయవాడ, అక్టోబరు 13, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో అదనంగా వైద్య కళాశాల్లో 300ల ఎంబీబీఎస్ సీట్లు పెంపుకు కేంద్ర ప్రభుత్వం(జాతీయ మెడికల్ కౌన్సిల్) అనుమతినిచ్చింది. దేశంలో ఈ ఏడాది కొత్తగా 9,075 ఎంబీబీఎస్‌సీట్లుకు కేంద్రం అనుమతినిచ్చింది. ఈ క్రమంలో ఏపీ 300 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించింది. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలకు ఇప్పటికే 50 అదనపు సీట్లు. నంద్యాలలోని శాంతి రామ్ వైద్య కళాశాలకు అదనంగా 100 సీట్లు. తిరుపతిలో అన్నా గౌరీ కళాశాలకు 150 సీట్లు.. నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతులిచ్చింది.


రైతులు,ఇతరులతో చంద్రబాబు సమూహ ఛాయా చిత్రం

# అమరావతి రైతుల త్యాగాలు మరువను :సీఎం చంద్రబాబు

## - రైతులను సత్కరించిన ముఖ్యమంత్రి

**విజయవాడ,అక్టోబరు 13,పభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని సీఎం చంద్రబాబు అన్నారు. రైతుల అవస్థలు చూశానని...రోడ్డెక్కి ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సిఎం మాట్లాడారు. 'ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సీఆర్డీఏ భవనం ప్రారభమైంది.'ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సిఆర్డీఏ భవనం ప్రారంభమైంది. తొలిసారి ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన చరిత్ర అమరావతి రైతులది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ,ప్రైవేటు భవనాలు వస్తాయి.భూములిచ్చిన రైతులను ఆయన వేదికపై సత్కరించారు.వారితో సముహ ఛాయా చిత్రం దిగారు.ఇదొక అనుభూతే కాదు,మీ త్యాగాలను భవిష్యత్తు తరలాలకు తెలిపే మహోన్నత చరిత్ర పుటల్లో నిలిచే సాక్ష్యమని చంద్రబాబు వ్యాఖ్యానించారు.రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని కూడా లేని పరిస్థితి రాజధాని ఎక్కడో చెప్పకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చేసింది. రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడేలా...ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా నిర్మించాలని ఆనాడు నిర్ణయం తీసుకున్నాం. విజయవాడ-గుంటూరు మధ్యలో రాజధాని ఉంటే బాగుంటుందని నిర్ణయించాం.అప్పటికే ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ తయారు చేశాం.రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛంధంగా ముందుకొచ్చారు. ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో భూసమీకరణ జరిగింది. ఒక్క అమరావతిలోనే గతంలో హైటెక్ సిటీ నిర్మించినప్పుడు నా విజన్ చెబితే అవహేళన చేశారు. హైదరాబాద్‌లో 5వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాం. ఎయిర్‌పోర్టుకు భూమి ఇవ్వాలని ఆనాడు కోరితే రైతులు వెంటనే ఇచ్చారు. అక్కడ భూములు కొన్నవారు బ్రహ్మాండంగా బాగుపడ్డారు' అని చంద్రబాబు అన్నారు. రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గరికి చంద్రబాబు భాధ్యతలు అప్పగించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,మంత్రి నారాయణ, ఎంఎల్ఏ శ్రావణ్‌కుమార్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా ఈ ముగ్గురు నేతలతో చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. నేతలు సైతం తరచూ రైతులతో సమావేశాలు నిర్వహించాలని సిఎం ఆదేశించారు. అమరావతిలోని సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయ భవనం ప్రతిష్టాత్మకమైన నెట్ జీరో ఎనర్జీ(డిజైన్) ధృవపత్రం సాధించింది. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీ ఎస్) ప్రతినిథులు ఈ అవార్డును ఆదివారం ఏపీ సీఆర్‌డీఏ కమీషనర్ కన్నబాబుకు ప్రదానం చేశారు. అమరావతిలో ఈ తరహా గుర్తింపు పొందిన తొలి భవనంగా సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయం నిలవడం విశేషం. వార్షిక విద్యుత్ అవసరాలన్నింటినీ పునరుత్పాదక శక్తి వనరుల ద్వారా సమకూర్చుకునేలా ఈ భవ నాన్ని రూ పొం దిం చా రు. దీని కోసం 540 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ సిస్టంను అమర్చారు. మిగిలిన అవసరాల కోసం పునరుత్పాదక శక్తి వనరుల సమర్థ వినియోగం ద్వారా పూర్తి స్థాయిలో నెట్ జీరో ఎనర్జీ' సాధించింది. ఈ సందర్భంగా కమీషనర్ కె.కన్నబాబు మాట్లాడుతూ...ఈ గుర్తింపు పర్యావరణ

# తిరుమల సమాచారం

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.1.05కోట్ల విరాళం



**తిరుమల,అక్టోబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళా లందించి అవసరమైన వారికి సేవలందిం చేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న ఉచిత అన్నప్రసాదం ట్రస్ట్‌కు గుంటూరుకు చెందిన అభయహస్త ఫైనాన్స్ సర్వీసెస్ సిఎఫ్ఓ సింహాద్రి వెంకట శివప్రసాద్ 10,00,116 రూపాయలు విరాళాల డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. సోమవారం సాయంత్రం ఈ విరాళాలను టిటిడి బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, జంగా కృష్ణమూర్తితో కలసి దాత అందించారు. అలాగే టిటిడి ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన ఏడిఓ ఫౌండేషన్ ఎన్జీఓ సంస్థ 75లక్షల రూపాయలు డిడిని ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. టిటిడి బర్డ్ ట్రస్ట్‌కు బెంగుళూరుకు చెందిన ఎం. రాకేశ్‌రెడ్డి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిని కలసి 10లక్షలు రూపాయలు డిడి అందజేశారు. తిరుపతికి చెందిన బాలాజీ రైల్వేడివిజన్ సాధనసమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ ఎస్వీ విద్యాదానం ట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు చెక్కును అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. ఈ సందర్భంగా దాతల ఉదారతను టిటిడి అభినందించింది.

## 15 నుంచి హుబ్లీ - గుంతకల్లు మెమో పాసింజర్




**గుంతకల్లు రైల్వే , అక్టోబర్ 13, ప్రభాత వార్త:** ప్రస్తుతం హుబ్లీ గుంతకల్లు హుబ్లీ మధ్య తిరిగే పాసింజర్ రైలుకు ఈనెల 15 అత్యాధునిక యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెమో బోగీలతో నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. ప్రతి రోజూ నైరుతి రైల్వే హుబ్లీదక్షణ మధ్య రైల్వే గుంతకల్లు మధ్య తిరిగే నెంబర్ 56911/12 పాసింజర్ రైలుకు ఈనెల 15 నుంచి అత్యాధునిక యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన మెయిన్ లైన్ ఎలెక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (మెమో) బోగీలతో నడుపుతున్నట్లు తెలిపారు.

# గిరిజన విద్యార్థినిల మృతిపై ఎన్ హెచ్ ఆర్ సి కి ఫిర్యాదు

## అరకు ఎంపి ఆధ్వర్యంలో గిరిజన మాజీ ఎమ్మెల్యేలు

**కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా), అక్టోబర్ 13 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం కురుపాం కేంద్రంగా ఉన్న రెండు గిరిజన పాఠశాలల్లో పచ్చకామెర్ల వ్యాధితో ఇద్దరు మృతి చెంది వందల సంఖ్యలో వ్యాధితో గిరిజన విద్యార్థినిలు ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ మెరుగైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని కనుక వెంటనే చర్యలు తీసుకోవాలని ఢిల్లీలో ఎన్ హెచ్ ఆర్ సి ఛైర్మన్‌కి ఫిర్యాదు చేశారు. సోమవారం ఢిల్లీలో గల నేషనల్ హ్యూమన్ రైట్స్ ఛైర్మన్‌కు అరకు ఎంపీ తనుజారాణి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ గిరిజన మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఉప ముఖ్యమంత్రిలు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యం జిల్లా కురుపాం మండలంలో గల గురుకుల పాఠశాలలో కల్పన, అంజలి అనే గిరిజన విద్యార్థినిలు మృతి చెందారని, ఇప్పటికీ విశాఖ కేజిహెచ్, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనూ, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలోనూ చికిత్స పొందుతున్నారని అన్నారు. అంతేకాకుండా గురుకుల సమీపంలో గల ఏకలవ్య పాఠశాలలో కూడా సుమారు 30 మంది వరకు వ్యాధి సోకి ఆసుపత్రి పాలయ్యారని అన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన వైద్యం చేయించటంలో చర్యలు చేపట్టలేదని వారు ఫిర్యాదుల పేర్కొన్నారు. ముఖ్యంగా నీటి కాలుష్యం అవ్వడం, మలం నీరు కలవడం వలన వ్యాధి విద్యార్థులందరికీ వ్యాపిస్తుందని వారు పేర్కొన్నారు. చనిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులకు నష్టపరిహారమైనా చెల్లించలేదని వారు అన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఛైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. విద్యార్థినిలకు ఇలా జరగడం దురదృష్టకరమని విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని ఎన్ హెచ్ ఆర్ డి ఛైర్మన్ స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తనుజా రాణి, పుష్ప శ్రీవాణి, రాజన్నదొర, పార్వతీపురం మన్యం జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడు పరీక్ష రాజ్, అరకు పార్లమెంట్ పరిధిలో గల ఎమ్మెల్యేలు, మాజీ గిరిజన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## 'తుంబురుతీర్థం'లో నిరంతర పుణ్యస్నానాలెప్పుడో?

### - సకల పాపాలు తొలగిపోతాయని విశ్వాసం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** శేషాచలంకొండల్లో వెలసిన కలియుగవైకుంఠం తిరుమల పవిత్ర పుణ్యక్షేత్రంలో మూడున్నరకోట్ల పుణ్యతీర్థాల్లో తుంబురుతీర్థం పుణ్యస్నానాలకు సాధారణ రోజుల్లోనూ భక్తులను అనుమతించే విషయంపై చర్చ మొదలైంది. ఈ పుణ్యతీర్థం తిరుమల రిజర్వుఫారెస్ట్ పరిధిలో ఉండటంతో సాధారణ రోజుల్లో భక్తులను అనుమతించడంలేదు. సప్తగిరులపై ప్రకృతి సిద్దంగా వెలసిన తీర్థాలలో ఏడుతీర్థాలు అత్యంత పవిత్రమైనవిగా ధర్మ,జ్ఞాన, భక్తి,వైరాగ్య ముక్తి ప్రదాయాన్ని కలిగిస్తాయని ప్రగాఢ విశ్వాసం. శ్రీవారిపుష్కరిణి, రామకృష్ణ తీర్థం, ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార, తుంబురుతీర్థం,పాండవతీర్థం ఈ పుణ్యతీర్థాల్లో ఏడాదికోసారి మాత్రమే కొన్ని పుణ్యఘడియలు ప్రవేశిస్తాయి. ఈ సమయాల్లో ఆయా తీర్థాల్లో ముక్కోటి ఉత్సవాలు నిర్వహించి ,భక్తులు స్నానాలాచరించేలా టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తారు. తుంబురుతీర్థంలో స్నానమాచరిస్తే సకల పాపాలు తొలగి ముక్తికలుగుతుందని భక్తుల విశ్వాసం. ఇదే ప్రగాఢనమ్మకంతో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అటవీశాఖ అధికారులతో కలసి రెండునెలల ముందు తుంబురుతీర్థం పర్యటించారు. ఈ తీర్థంలో ఉన్న సదుపాయాలు, సాధారణ రోజుల్లోనూ భక్తులను అనుమతించి పుణ్యస్నానాలాచరించేలా చూస్తే ఎలా ఉంటుందనే కోణంలో ఆరా తీశారు. తుంబురుతీర్థ ముక్కోటి మార్చి,ఏప్రిల్ నెలల్లో పాల్గుణ పౌర్ణమి, చైత్ర పౌర్ణమి రోజుల్లోమాత్రమే అనుమతించడం వల్ల చాలామంది భక్తులు తుంబుతీర్థంను సందర్శించలేకపోతున్నారని తెలుసుకున్నారు. ఆ రెండుప్రత్యేక రోజుల్లో సుమారుగా 25వేల మంది వరకు భక్తులు ఈ తీర్థంలో పవిత్ర స్నానాలాచరిస్తారు. రిజర్వుఫారెస్ట్‌లో ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టిటిడి పెద్దఎత్తున ఏర్పాట్లుచేస్తుంది. నిరంతరాయంగా అన్నప్రసాదాలు, మజ్జిగ,తాగునీరు, వైద్యశిబిరాలు వంటివి సౌకర్యాలు కల్పిస్తారు. తీర్థానికి చేరుకునేందుకు సులభంగా అవసరమైన నిచ్చెనలు,తాగునీటి కొళాయిలు ఏర్పాటుచేస్తారు. దీర్ఘకాలిక వ్యాధులైన ఆస్తమా, స్థూలకాయం, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారిని తీర్థానికి అనుమతించరు. ఈ నేపధ్యంలో తిరుమలలో పాపవినాశనం జలాశయాంలో ప్రతిరోజూ భక్తులు స్నానమాచరించినట్లే తుంబురుతీర్థంకు అనుమతించే విషయంపై స్వయంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో టిటిడి అధికారులు, అటవీశాఖ నుండి ఎలాంటి సహకారం, అనుమతులు లభిస్తాయనేది కూడా చూడాల్సి ఉంది. తిరుమల శ్రీవారి ఆలయానికి ఉత్తరదిక్కున ఉన్న తుంబురుతీర్థంలో స్నానం చేయడం వల్ల పుణ్యం కలుగుతుందని విశ్వాసానికి టిటిడి సహకారం అందిస్తుందనే భక్తులు ఆశిస్తున్నారు.

## సమాచార పౌర సంబంధాల సంచాలకుడుగా కె.ఎస్. విశ్వనాథన్ బాధ్యతల స్వీకారం



**విజయవాడ,అక్టోబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర ప్రదేశ్ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులుగా కె.ఎస్. విశ్వనాథన్ బాధ్యతలు స్వీకరించారు.సోమవారం ఉదయం ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ లో గల సమాచార పౌర సంబంధాల శాఖ రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సమాచార శాఖ సంచాలకులుగా ఉన్న హిమాన్షు శుక్లా శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా నెల్లూరు కలెక్టర్ గా ప్రభుత్వం బదిలీ చేసిన అనంతరం ప్రఖర్ జైన్ కు సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ గా ఉన్న కె.ఎస్. విశ్వనాథన్ ను సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులుగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతం లో ఆయన అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్ గా, నరసాపురం సబ్ కలెక్టర్ గా, ప్రకాశం, విశాఖపట్టణం జిల్లాల జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథన్ కు సమాచార శాఖ ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శాఖ కార్యకలాపాలు, నిర్వర్తిస్తున్న విధులపై అధికారులతో నూతన సంచాలకులు

# అమరావతి షాపింగ్ ఫెస్టివల్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ



**విజయవాడ,అక్టోబరు13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ 2025 నేటి నుంచి 19వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ కలెక్టర్ కార్యాలయంలో వివిధ మోటారు వాహనాల షోరూముల యజమానులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. షాపింగ్ ఫెస్టివల్ కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. జీఎస్టీ సంస్కరణల ఫలాలు ఇటు వినియోగదారులకు అటు వ్యాపార, వాణిజ్య సంస్థలకు అందేలా ప్రత్యేక ప్రచారంతో అవగాహన కార్యక్రమాలతో పాటు వివిధ వినూత్న కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ లో స్టాళ్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. మోటార్ వాహనాలకు సంబంధించి తగ్గిన జీఎస్టీ వివరాలను స్టాళ్లలో ప్రదర్శించడంతోపాటు బ్రాండ్ ప్రమోటింగ్ చేసుకోవచ్చన్నారు.సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అలీ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ.. కార్లు, బైకులు, ఆటోలు తదితర వాహనాల షోరూంల యజమానులు, ప్రతినిధులతో కలిసి గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్ కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమష్టి భాగస్వామ్యంతో ఫెస్ట్ ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వాణిజ్యం, వినోదానికి వేదికగా నిలిచే షాపింగ్ ఫెస్టివల్‌లో వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, హస్తకళాకారులు.. ఇలా వివిధ వర్గాలవారు తమ స్టాళ్లను ఏర్పాటుచేసుకొని బ్రాండ్ ప్రమోటింగ్ చేసుకోవచ్చన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థలు జీఎస్టీ ప్రయోజనాలు కల్పించడంతో పాటు దీపావళి పండగ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు, రాయితీలు ప్రకటిస్తాయన్నారు. మెగా లక్కీ డ్రాలతో పాటు ఉత్తమ స్టాళ్లకు అవార్డులు కూడా అందించనున్నట్లు వెల్లడించారు. దాదాపు 100 స్టాళ్లతో ఏర్పాటుచేసే ఈ ఫెస్ట్‌లో జీఎస్టీ సంస్కరణల ఫలాలపై మేధోమథన చర్చలు, సమావేశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ భాగస్వాములై ఈ ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని, స్థానిక వ్యాపారులు, ప్రజలు ఫెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు...సూపర్ జీఎస్టీతో ప్రతి కుటుంబానికి రూ. 12 వేల వరకు ఆదా.. సూపర్ జీఎస్టీతో రాష్ట్ర ప్రజలకు దాదాపు రూ. 8 వేల కోట్లు, జిల్లా ప్రజలకు రూ. 250 కోట్లు రూ. 300 కోట్లు ఆదా అవుతుండగా ప్రతికుటుంబానికి నెలకు రూ. 6 వేలు నుంచి రూ. 12 వేల వరకు ఆదా అవుతుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉండగా జీఎస్టీ 2.0 సంస్కరణలతో అది 18 శాతానికి తగ్గిందన్నారు. సోలార్ వాటర్ హీటర్లు, కుట్టు మిషన్లు, వాకీటాకీలపై గతంలో 12 శాతం ఉన్న జీఎస్టీ నేడు 5 శాతానికి తగ్గిందని.. అదేవిధంగా సబ్బులు, టూత్‌పేస్టులు, వంటనూనెలు, డిటర్జెంటులు వంటి నిత్యావసర ఎఫ్ఎంసీజీ వస్తువులపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండగా అది 5 శాతానికి తగ్గిందని వివరించారు. బీమా, ఆరోగ్య పాలసీలపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండగా అది నేడు సున్నా శాతం అయిందన్నారు. హస్తకళల ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్‌పై 12 శాతం ఉన్న జీఎస్టీ అయిదు శాతానికి తగ్గిందని.. మిక్సీలు, కుక్కర్లు, గ్రైండర్లు, ఫ్యాన్లు వంటి వస్తువులపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉంటే అది అయిదు

## ఖరీఫ్‌లో 30లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కొనుగోలు లక్ష్యం

### : ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు

**సచివాలయం,అక్టోబర్ 13,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఈఏడాది ఖరీఫ్‌సీజన్‌లో భారత ప్రభుత్వం ద్వారా 30లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని భారత ఆహార సంస్థ రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ ఛైర్మన్,పార్లమెంట్ సభ్యులు,లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు.నగరంలోని పటమట యనమలకుదురు రోడ్డులోని భారత ఆహార సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో భారత ఆహార సంస్థ రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని ఛైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఛైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు పాత్రికేయులతో మాట్లాడుతూ రైతు పండించిన ప్రతిగింజను కొనుగోలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.గత ఏడాది ఖరీఫ్‌లో 15.92లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సంస్థ ద్వారా కొనుగోలు చేశామన్నారు.ఈ ఏడాది ఖరీఫ్‌లో 30లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతించినట్లు తెలిపారు.ఎఫ్‌సీఐ నుంచి పంజాబ్ రాష్ట్రం తర్వాత 14లక్షల టన్నుల బియ్యాన్ని 10శాతం బ్రోకెన్‌తో సేకరించడానికి అనుమతి ఉన్న రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు.రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిశాయని దాంతో పంట దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉందని,దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## చిరుతలొస్తున్నా పట్టించుకోవడం లేదు

**తిరుపతి,అక్టోబర్13ప్రభాతవార్తప్రతినిధి:** అలిపిరి అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న తిరుపతిలోని శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయం, వేదవిశ్వవిద్యాలయం, స్విమ్స్ ఆస్పత్రి ప్రాంగణాల్లో తరచూ చిరుతపులుల సంచారం ఎక్కువైంది. చీకటిపడితే చిరుతపులులు రెండు మూడు

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
"e" Procurement Tender Notice
No. 1/2025-26/SE(P)/EE-(PD-I)/DB/GVMC.10.10.2025
Number of works 02, Value of works Rs. 4.00 Crores
Tender Opening Dt. 13.10.2025, Closing Date. 28.10.2025
Note: Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o the EE(PD-I) Cell No. 9848308824 For Commissioner,GVMC

పంజాబ్ నేషనల్ బ్యాంక్ punjab national bank (భారత ప్రభుత్వరంగ సంస్థ)
అసెట్ రికవరీ మానిటరింగ్ బ్రాంచ్
డి.నెం.9-13-45/2/91, 5వ అంతస్తు, ఎమ్‌విఆర్ వినాయగర్ ట్రేడ్ సెంటర్, విఐపి రోడ్డు, విశాఖపట్నం-530003. ఇ-మెయిల్ : CS8333@pnb.co.in
ఉద్దేశించిన అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క రూల్ 8 (6)తో చదువబడే, సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(4) ప్రకారం నోటీసు)
వీరికి :
1. శ్రీమతి ననటోయిన కనక రత్నం, డోర్ నెం.1-781, శ్రీరామపురం, భీమవరం-534202, పశ్చిమ గోదావరి జిల్లా.
2. శ్రీ అబోతుల చిన్నరాజు, డోర్ నెం.20-2-24, పాతర్లవారి వీధి, భీమవరం-534202, పశ్చిమ గోదావరి జిల్లా.
3. శ్రీ దొంగా వీర వెంకట రావు, తండ్రి : కోటేశ్వరరావు, డి నెం.1-49, N.R.P.అగ్రహారం, పశ్చిమ గోదావరి జిల్లా-534199.
డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూర్డు ఆస్తుల అమ్మకం గురించి
సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువసంతకందారు/సర్కిల్ ఆఫీస్ విశాఖపట్నం - జారీ చేసిన 03.09.2021 నాటి నోటీసు మరియు తేది. 03.12.2021 న దిగువ తెలిపిన ఆస్తులను స్వాధీనం చేసుకునేటప్పుడు దిగువ సంతకందారు జారీ చేసిన తేది.03.12.2021 నాటి స్వాధీనత నోటీసును కూడా చూడుము.
శ్రీ అబోతుల చిన్నరాజు గారి పేరున ఉన్న ఆస్తి : ఆంధ్రప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం, పాతరాలపల్లి వారి వీధి, ఆర్ ఎస్ నెం. 415/1 నందు 75.13 చ॥గజాల ఖాళీ ఇంటి స్థలం. ఆస్తికి హద్దులు: తూర్పు: అబోతుల వెంకన్న యొక్క భూమి, దక్షిణం: రాచమడుగుల వెంకటేశ్వర్లు మరియు దేవకి బ్రహ్మారావు యొక్క ప్రహారీ గోడ, పడమర: అబోతుల నాగేశ్వరరావు యొక్క ఇల్లు మరియు స్థలం, ఉత్తరం: సిమెంట్ రోడ్డు.
దీనికి సంబంధించి, పైన పేర్కొన్న నోటీసులలో తెలిపిన విధంగా బకాయి రూ.35,64,551/- (అక్షరాల ముప్పై ఐదు లక్షల అరవై నాలుగు వేల ఐదు వందల యాభై ఒక్క రూపాయలు మాత్రమే) బకాయిలను తాజా వడ్డీ మరియు ఆస్తులను స్వాధీనం చేసుకునేటప్పుడు మరియు ఆ తర్వాత వాటిని సంరక్షించడానికి దిగువ సంతకందారు చేసిన ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజులలోపు చెల్లించి, దిగువ సంతకందారు నుండి పైన పేర్కొన్న ఆస్తులను విడిపించుకోమని ఇందుమూలముగా మిమ్మల్ని కోరుతున్నాము. ఒక వేళ మీరు పైన పేర్కొన్న మొత్తాలను నిర్ణీత సమయంలోపు చెల్లించకపోతే, బకాయిలను వసూలు చేయడానికి పైన పేర్కొన్న ఆస్తులను విక్రయించడానికి మరియు పైన పేర్కొన్న చట్టం మరియు నియమ నిబంధనల ప్రకారం తగినట్లుగా భావించే ఇతర చర్యలు తీసుకోవడానికి దిగువ సంతకందారు హక్కు కలిగి ఉన్నారు.
తేది : 09.10.2025
ప్రదేశం: విశాఖపట్నం
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్

పంజాబ్ నేషనల్ బ్యాంక్ punjab national bank (భారత ప్రభుత్వరంగ సంస్థ)
అసెట్ రికవరీ మానిటరింగ్ బ్రాంచ్
డి.నెం.9-13-45/2/91, 5వ అంతస్తు, ఎమ్‌విఆర్ వినాయగర్ ట్రేడ్ సెంటర్, విఐపి రోడ్డు, విశాఖపట్నం-530003. ఇ-మెయిల్ : CS8333@pnb.co.in
ఉద్దేశించిన అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క రూల్ 8 (6)తో చదువబడే, సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(4) ప్రకారం నోటీసు)
వీరికి :
1. శ్రీ వెంద్ర నరేష్ కుమార్, తండ్రి : వెంద్ర శ్రీరాములు, డోర్ నెం.4-192, NRP అగ్రహారం, ఉండి మండలం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534199.
2. శ్రీ వెంద్ర నరసింహ మూర్తి, తండ్రి : వెంకట నర్సయ్య, డోర్ నెం.4-192, NRP అగ్రహారం, ఉండి మండలం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534199.
3. శ్రీమతి వెంద్ర లక్ష్మి (హామీదారు), భర్త : శ్రీరాములు, డోర్ నెం.4-192, NRP అగ్రహారం, ఉండి మండలం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534199.
డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూర్డు ఆస్తుల అమ్మకం గురించి
సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువసంతకందారు/సర్కిల్ ఆఫీస్ విశాఖపట్నం - జారీ చేసిన 04.09.2021 నాటి నోటీసు మరియు తేది. 03.12.2021 న దిగువ తెలిపిన ఆస్తులను స్వాధీనం చేసుకునేటప్పుడు దిగువ సంతకందారు జారీ చేసిన తేది. 03.12.2021 నాటి స్వాధీనత నోటీసును కూడా చూడుము.
శ్రీ వెంద్ర నరసింహ మూర్తి గారి పేరున ఉన్న ఆస్తి : ఆంధ్రప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లా, ఉండి మండలం, NRP అగ్రహారం, ఆర్ ఎస్ నెం.147/1 నందు విస్తీర్ణం 76.50 సెంట్లులోని ఖాళీ స్థలం. ఆస్తి హద్దులు : తూర్పు : ఈ సర్వే నెంబరులోని మిగిలిన భూమి, దక్షిణం : యేలేశ్వరపు శ్రీ రామ మూర్తి గారి భూమి, పడమర : యేలేశ్వరపు శర్మ గారి భూమి, ఉత్తరం : నారాయణ కోడు కాల్వ గట్టు.
దీనికి సంబంధించి, పైన పేర్కొన్న నోటీసులలో తెలిపిన విధంగా బకాయి రూ.35,67,769.56 (అక్షరాల ముప్పై ఐదు లక్షల అరవై ఏడు వేల ఏడు వందల అరవై తొమ్మిది రూపాయల యాభై ఆరు పైసలు మాత్రమే) బకాయిలను తాజా వడ్డీ మరియు ఆస్తులను స్వాధీనం చేసుకునేటప్పుడు మరియు ఆ తర్వాత వాటిని సంరక్షించడానికి దిగువ సంతకందారు చేసిన ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజులలోపు చెల్లించి, దిగువ సంతకందారు నుండి పైన పేర్కొన్న ఆస్తులను విడిపించుకోమని ఇందుమూలముగా మిమ్మల్ని కోరుతున్నాము. ఒక వేళ మీరు పైన పేర్కొన్న మొత్తాలను నిర్ణీత సమయంలోపు చెల్లించకపోతే, బకాయిలను వసూలు చేయడానికి పైన పేర్కొన్న ఆస్తులను విక్రయించడానికి మరియు పైన పేర్కొన్న చట్టం మరియు నియమ నిబంధనల ప్రకారం తగినట్లుగా భావించే ఇతర చర్యలు తీసుకోవడానికి దిగువ సంతకందారు హక్కు కలిగి ఉన్నారు.
తేది : 09.10.2025
ప్రదేశం: విశాఖపట్నం
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్

# రాష్ట్రంలో ట్రాన్స్‌కోను మరింత బలోపేతం చేయడమే లక్ష్యం

## నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యం - జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్



**విజయవాడ, అక్టోబర్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం నాణ్యమైన, నమ్మకమైన, నిరంతర విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా కొనసాగించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపిట్రాన్స్‌కో) నిరంతర అభివృద్ధికి, సంస్థను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఏపిట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జి. సూర్య సాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. ఏపిట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సోమవారం స్థానిక విద్యుత్ సౌధలో బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం, ఆపరేషనల్ సామర్థ్యాన్ని పెంచడం, నాణ్యతా ప్రమాణాలను పాటించడం కోసం ఏపిట్రాన్స్‌కో అనేక ఉత్తమ పద్ధతులను అమలు చేస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది అందరి సమిష్టి కృషితో ఏపిట్రాన్స్‌కో దేశంలోనే అగ్రభాగాన నిలుస్తుందని, ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్‌లు తనపై విశ్వాసం ఉంచి ఈ బృహత్తర బాధ్యతలు తనకు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇంధన రంగ లక్ష్యాలను సాధించేందుకు పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఏపిట్రాన్స్‌కో అభివృద్ధికి ఉద్యోగులందరి సహకారం, టీమ్ వర్క్ ప్రధాన బలంగా ఉంటాయని ఆయన పేర్కొంటూ అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది అందరూ సమిష్టిగా, కొత్త ఉత్సాహంతో కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ రంగంలో సేవ చేయడం ఒక గొప్ప అవకాశం గా భావిస్తున్నానని, రాష్ట్ర అభివృద్ధి కి అనుగుణంగా విద్యుత్ ప్రసార, మౌలిక సదుపాయాల పురోగతికి కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా ఏపిట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏ కె వీ భాస్కర్ , జె వీ రావు , ఎన్ వీ రమణ మూర్తి , ఏ పీ ట్రాన్స్కో అడిషనల్ సెక్రటరీ పెద్ది రోజా, విద్యుత్ సంస్థల సీనియర్ అధికారులు, సిబ్బంది ప్రవీణ్ చంద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇక ప్రవీణ్ చంద్ 2019 బ్యాచ్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) అధికారి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆయన ఐఐటీ పాట్నా నుండి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బాచిలర్ డిగ్రీ పొందారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్ష 2018లో ఆల్ ఇండియా 64వ ర్యాంక్ సాధించి 27 ఏళ్ల వయసులో ఐఏఎస్‌గా చేరారు. తన సర్వీస్ లో అనేక కీలక పదవులను నిర్వర్తించారు అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనింగ్ లో), మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలో అండర్ సెక్రటరీ, విజయవాడ సబ్ కలెక్టర్, కడప మునిసిపల్ కమిషనర్, ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీసీఆర్‌డీఏ) అదనపు కమిషనర్‌గా పనిచేస్తూ ఏపీ ట్రాన్స్కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గా నియమితులయ్యారు.

నిరంతరం జీవిత క్రమంలో పాత విషయాలు మరిచి కొత్త విషయాలు గ్రహిస్తూ జీవించేవారికి మృత్యుభయం ఉండదు.

-రోజర్

# ఆరోగ్యశ్రీ సేవలకు అనారోగ్యం!

తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ లేదా ఆరోగ్యశ్రీ రోగుల సేవలకు ఆయా ఆరోగ్య సంస్థలు మొండికేస్తున్నాయి. ప్రభుత్వ ప్యాకేజీలకులోబడి తమకు గిట్టుబాటు కాకున్నా అన్ని ఆరోగ్యసేవలను సజావుగా చేస్తూ 'మేముసైతం' అనుకుంటున్న కార్పొరేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం నుంచి బకాయిలు అందడం లేదు. తమవద్దకు నేరుగా వచ్చే రోగులకు తాము నిర్దేశించుకున్న మేరకు ఫీజులు, వైద్యసేవలు వగైరా ఎంతైనా తీసుకోవచ్చు. దాని మీద ఎలాంటి అదుపు లేదు. కానీ ప్రభుత్వం కేటాయించిన ఉద్యోగులకు, జర్నలిస్టులకు దారిద్య్ర రేఖకుదిగువనున్న కుటుంబాల కోసం ప్రత్యేకించి ప్రభుత్వం అందచేస్తున్న ఏరకమైన కార్డులైనా ప్రభుత్వ నిర్దేశిత ప్యాకేజీ మాత్రమే బిల్లింగ్ చేయాలి. అంతకన్నా పైసా ఎక్కువ వసూలు చేయరాదు. ఆ బిల్లులు అందచేసిన తర్వాత ఎప్పటికో కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయదు. దాంతో కార్పొరేట్ ఆస్పత్రులు నడిపేందుకు నిధుల్లేవని డీలా పడిపోతున్నాయి. చివరాఖరుకు తాము పేదల వైద్యానికి దూరమని తేల్చి చెప్పేస్తున్నాయి. వైద్య సేవలకు ఆరోగ్య శ్రీ ఎన్టీఆర్ వైద్యసేవ అని ఏ పేరిట అందిస్తున్నా చికిత్సల బిల్లుల విషయంలో 800 కార్పొరేట్ ఆస్పత్రులు ఇప్పుడు సత్వర వైద్యానికి 'నో' చెబుతున్నాయి. ఒకసారి బకాయిపడితే అధికార వర్గం కొంత కాలం వ్యవహారాన్ని సాగతీయడం, ఆపైన ఎంతో కొంత చెల్లింపుల కోసం నిధులు విడుదల చేస్తుంటాయి. ఈ విధమైన తాత్సారంతో కార్పొరేట్ ఆస్పత్రులు అడకత్తెరలో పోకచెక్క చందాన ఆర్థిక వెసులుబాటు లేక నలిగిపోతున్నాయి. ఆయా కార్డుల మీద రోగులకందించే వైద్యసహాయానికి ఆస్పత్రుల వారుబిల్లు అందించిన 45 రోజుల్లోగా ప్రభుత్వం బిల్లు పేమెంట్ చేయాలన్న ఒప్పందం ఉన్నా దాని ప్రకారం నిధులు అందించడంలో వెనుకడుగు వేస్తున్నందున ఇలాంటి సమస్య పుడుతోంది. ప్రభుత్వనిర్దేశిత ధరలకే వైద్య చికిత్సలు అందివ్వడంలో కూడా కార్పొరేట్ ఆసుపత్రులకు వచ్చే ఆర్థిక లబ్ధి ఏమీ ఉండదు. అయినా కారుణ్య భావంతోనూ, ప్రభుత్వ పథకాలకు చేయూతనందించడం ద్వారా తమ ఆస్పత్రుల ప్రాభవాన్ని పెంచుకోవాలని కొన్ని ఆస్పత్రులు ముందుకొస్తున్నాయి. కాగా ప్రభుత్వం కోరినప్పుడు మిగిలిన ఆసుపత్రులు కూడా ప్రజాసేవలో భాగంగా ప్రభుత్వానికి కలిసిరావాల్సిందే. స్టాఫ్ జీతాలు, మందులు, చికిత్సా పరికరాల ధరలు బాగా పెరిగినందున వాటిని భరించడం కష్టంగా ఉందని కార్పొరేట్ ఆస్పత్రులు ఆవేదనవ్యక్తం చేస్తున్నాయి. ఆరోగ్య శ్రీ ఆసుపత్రులు మొండికేసి సేవలు నిలిపివేస్తున్నప్పుడల్లా కొన్ని నిధులు ప్రభుత్వం నుండి వస్తుంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదేపద్ధతి అమలవుతోంది. కనీసం ఆపరేషన్ ఖర్చులు కూడా రావడం లేదని ఆస్పత్రి యాజమాన్యాలు ఆందోళనపడుతున్నాయి. ప్రభుత్వ ఉచిత వైద్య సేవలుఆపి ప్రైవేట్ ఆస్పత్రులుగా నడుపుకుంటే ప్రభుత్వపర వైద్యసేవల అందుబాటుకు మరింత కష్టతరమవుతోంది. అయినా కార్పొరేట్ ఆస్పత్రులన్నీ తెగించి ప్రస్తుతం వైద్యసేవలను నిలిపివేశారు. తెలంగాణలో 477 ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ వైద్యం లభిస్తుంది. ఈమధ్యనే తెలంగాణలో 62ఆసుపత్రులు తాము తక్కువ ప్యాకేజీకికాదు. సకాలంలో బకాయిల్లేకుండా పూర్తిస్థాయిలో బిల్లులు సొమ్ము విడుదల చేయగలిగితేనే తాము వైద్యసేవల్ని కొనసాగిస్తామని అల్టిమేటం జారీ చేశాయి. దాంతో కొన్ని నిధులను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేయడంతో కాస్త ఉపశమనం కలిగింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులలో అనేక ప్రైవేట్, నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ ఔట్‌పేషంట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశాయి. కొన్ని ఆసుపత్రులు అత్యవసర కేసులను మాత్రమే చూస్తున్నాయి. ప్రభుత్వం నుంచి దాదాపు రూ. 1500 కోట్లకుపైగా బకాయిలుంటాయని లెక్క చెబుతున్నారు. ఒకవేళ ప్రభుత్వానికి పెట్టిన బిల్లుల మంజూరులో కూడా వ్యత్యాసాలున్నట్లు కొన్నిఆస్పత్రులు ఆరోపిస్తుంటాయి. రాష్ట్రమేదైనా ఆర్థిక సంబంధిత అంశాల్లోనే'ఆరోగ్యశ్రీ' చికిత్సలు ఆగిపోతున్నాయి. ప్రభుత్వం తక్షణం నిధుల బకాయిలు విడుదల చేయలేకపోతోంది. ప్రయివేటు ఆస్పత్రులు వైద్యసేవలకు ముందుకురాలేకపోతున్నాయి. ఈ సమస్యలు ఎప్పటికప్పుడు తాత్కాలిక పరిష్కారానికే పరిమితమవడంతో తరచు ఇలాంటి విరామం వస్తోంది. రోగులు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిల మొత్తంపై రెండు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. సెంట్రలైజెడ్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో రూ.674 కోట్ల మేరకు బకాయిలున్నట్లు చూపెడుతోంది. ఇవిగాక తాజాగా పేరుకున్న బకాయిలు 3వేల కోట్లకుపైగానే ఉన్నాయని తేల్చారు. ఒక నిర్దిష్టమైన పరిష్కారం లేకుంటే ఆరోగ్యశ్రీని నమ్ముకున్న రోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. ఆయా ప్రభుత్వాలు తమకు ఉన్న ఆర్థిక లోటుతోనో, బడ్జెట్‌లోటుతోనో ముడిపెట్టకుండా ఏటా బడ్జెట్‌లలో ఆరోగ్యశ్రీ, తదితర వైద్యసేవలకు ప్రత్యేక కేటాయింపు చేసి ఆదుకోవాల్సిన అవసరముంది. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ పథకం కింద పేద రోగులకు అందించే ఉచిత చికిత్ససేవలను గత 3 రోజులుగా ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులన్నిటా ఓపిడి సేవలు నిలిపివేయడం వల్ల గ్రామీణ రోగులు బాగా ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ పరిశీలనలో ఆసుపత్రులకు కేవలం రూ.2700కోట్ల బకాయిలే ఉన్నాయి. పెండింగ్ బకాయిలు కూడా ఇవ్వాల్సి ఉన్నందున ప్రభుత్వ ఆర్థిక భారాన్ని అత్యవసరంగా మోయగల పరిస్థితి లేదని ప్రభుత్వవర్గాల వివరణ. ప్రత్యామ్నాయం ఏర్పాట్లు లేకపోవడం అర్థాంతరంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం పేద రోగులకు అసౌకర్యం కలిగింది.

# బిసిలకు ఇంకా అరకొర 'సంక్షేమ'మేనా?

***తెలంగాణాలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎన్నికల సమయంలో బిసిని ప్రకటించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా అగ్రవర్ణాల వ్యక్తిని నియమించారు. బిసిల పట్ల కాంగ్రెస్‌ను మించి చులకనభావం బిజెపి పెద్దలకు ఉన్నట్లు ఈ పరిణామాలన్నీ స్పష్టంగా తేటతెల్లం చేస్తున్నాయి. యస్.సి, యస్.టి, అగ్రవర్ణాల పేదలు వారి జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నారు. కానీ జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలు మాత్రం ఇంకా కటిక పేదరికాన్ని అనుభవిస్తున్నారు. రాజ్యాంగ పరంగా ఫలాలు అందించినప్పుడే బిసిలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారు***



కెలసాని శివప్రసాద్

బిసి కులాల వారందరికీ చేతి వృత్తులే జీవనాధారం. కొద్ది కాలంగా చేతి వృత్తులు అంతరించి పోతూ ఉండడం, చేతివృత్తులలోకి వివిధ కార్పొరేట్ సంస్థలు ప్రవేశించడంతో బిసిల బ్రతుకులు అగమ్యగోచరంగా మారాయి. నానాటికీ దిగజారిపోతున్న బిసిల బ్రతుకులు గాడిన పెట్టవలసిన బాధ్యత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో పాటూ అన్ని రాజకీయ పార్టీలపై ఉందని కచ్చితంగా చెప్పవచ్చు. కానీ అందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు బిసిలను ఓటర్లుగానే చూస్తున్నాయనేది నిర్వివాద అంశం. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలు బిసిలను స్మరిస్తూ వారి ఓట్ల కొరకూ అనేక అసాధారణ హామీలు రాజకీయ పార్టీలు ఇస్తూ ఉన్నాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే అధికారంలోకి వచ్చిన రాజకీయపార్టీలు ఎన్నికల సమయంలో బిసిలకు తాము ఇచ్చిన హామీలు అటకెక్కించడం, వాటి సాధన కొరకు బిసిలు రోడ్డెక్కడం పరిపాటిగా మారింది. ఆకోవలోకి చెందిందే ప్రస్తుతం తెలంగాణా రాష్ట్రంలో చెలరేగిన బిసి రిజర్వేషన్ల దుమారం. 2023లో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అదిష్టానం స్పష్టమైన హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటివరకు బిసి రిజర్వేషన్ల పెంపు విషయంలో జరిగిన తంతు అంతాచాలా హాస్యాస్పదంగా, ఆశ్చర్యకరంగా కనిపిస్తూ ఉంది. వాస్తవంగా రాజ్యాంగ పరంగా షెడ్యూల్డ్ 9లో పొందుపరచినప్పుడే కుల రిజర్వేషన్లకు అధికారికంగా గుర్తింపు, రక్షణ, జీవం ఉంటాయనేది నిర్వివాద అంశం. అత్యున్నత న్యాయ స్థానాలలో ఇటీవలి కాలంలో వివిధ రాష్ట్రాల కులరిజర్వేషన్లపై వెలువడిన తీర్పులు అందుకు ఉదాహరణలుగా అనేకం కనిపిస్తూ ఉన్నాయి. యం.ఆర్. బాలాజీ, మైసూర్ స్టేట్ మధ్య 1962లో జరిగిన కేసులో మొట్టమొదటిగా రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తరువాత ఇంద్ర సాహ్నీ, యూనియన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన కేసులో కూడా 1992లో 9మంది సుప్రీం కోర్టు న్యాయమూర్తుల బృందం అదే విధమైన తీర్పును వెలువరించింది. అదే తీర్పులో 50శాతం పరిమితి సంపూర్ణమైనది కాదని, అసాధారణ పరిస్థితులలో రిజర్వేషన్లు పెంచుకోవచ్చని కూడా పొందుపరిచారు. అసాధారణ పరిస్థితులలో రిజర్వేషన్లు పెంచుకోవచ్చు అనే వ్యాఖ్యలు ప్రామాణికంగా తీసుకుని అనేకరాష్ట్రాలు తమ రాష్ట్రాలలో 50శాతం మించి రిజర్వేషన్లను పెంచుకున్నాయి. కానీ వాటికి న్యాయ స్థానాలలో చుక్కెదురు కావడం గమనార్హం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పట్లో అధికారంలో ఉన్న ఇదే కాంగ్రెస్ పార్టీ 2005లో ముస్లింలకు 5శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఆ అయిదు శాతం రిజర్వేషన్ల వలన రాష్ట్రంలో రిజర్వేషన్లు 50శాతం మించుతున్నాయని హైకోర్ట్ దానిని తిరస్కరించింది. అప్పటికే 46శాతం రిజర్వేషన్లు రాష్ట్రంలో మనుగడలో ఉన్నాయి. దాంతో 50శాతానికి కేవలం ఒకశాతం అధికంగా ఉన్నందువలన ఆ ఒక్క శాతం తగ్గించి4శాతం ముస్లీం రిజర్వేషన్లను అప్పటి ప్రభుత్వం అమలు చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం 2018లో మారాఠాలకు 16 శాతం రిజర్వేషన్లు కల్పించింది. ఆ రిజర్వేషన్లను మహారాష్ట్ర హై కోర్ట్ కొట్టివేసింది. సుప్రీం కోర్ట్ కూడా ఆ రిజర్వేషన్లను 2021లో తిరస్కరించింది. కానీ 1994లో పి.వి.నరసింహారావు ప్రభుత్వం భారత రాజ్యాంగంలోని షెడ్యూల్డ్ 9లో పొందుపరచడం వలన తమిళనాడు రాష్ట్రంలో కొనసాగిస్తున్న 69 శాతం రిజర్వేషన్లకు ఎటువంటి ఇబ్బందిలేకుండా పోయింది. అదేవిధంగా అధికరణ 15(5), 16(5)ప్రకారం 103 రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఇ.డబ్ల్యూ.యస్) 10శాతం రిజర్వేషన్లను 2022లో కేంద్ర




ప్రభుత్వం కల్పించింది. దాంతో ఈ రిజర్వేషన్ల మనుగడకు కూడా ఎటువంటి అడ్డంకులు కలగడం లేదు. తెలంగాణా రాష్ట్రప్రభుత్వంలోని అపార అనుభవం కలిగిన న్యాయవాదులకు, సుదీర్ఘపాలనా అనుభవంతోపాటూ విషయ పరిజ్ఞానం అన్నిరంగాలపై అత్యధికంగా ఉన్న బ్యూరోకాట్లకు, దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన పాలకులకు ఈ విషయాలన్నీ తెలియవు అంటే ఎవరైనా నమ్మగలరా? ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటూ యావత్తు భారతదేశంలో 55 శాతం పైగా ఉన్న వెనుకబడిన తరగతి జాతులు (బిసి) స్వతంత్ర భారత్ ఆవిర్భవించి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా ఇంకా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉండిపోవడంలో దోషులు ప్రాంతీయ, జాతీయ రాజకీయ పార్టీలే అయినా! ప్రధాన దోషులు మాత్రం ప్రధాన పార్టీలే అని కచ్చితంగా చెప్పవచ్చు. స్వాతంత్ర్యం లభించిన నాటి నుండి దాదాపు కాంగ్రెస్, బిజెపిలే కేంద్రంలో అధికారాన్ని అనుభవించాయి. ముఖ్యంగా స్వతంత్ర భారత్‌లో అత్యధిక కాలం కేంద్రాన్ని ఏలింది కాంగ్రెస్ పార్టీనే. కానీ కాంగ్రెస్ పార్టీ బిసిలకు చేసింది శూన్యమనే చెప్పాలి. జనతా పార్టీకి చెందిన మురార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్న సమయంలో దేశ వ్యాప్తంగా ఉన్న వెనుకబడిన తరగతి జాతుల(ఓబిసి)కు రాజ్యాంగం ద్వారా సామాజికంగా, ఆర్థికంగా న్యాయం చేయాలనే సదుద్దేశ్యంతో 1979 జనవరి 1న మండల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ మండల్ కమీషన్ తమ రిపోర్టును 1980 డిసెంబర్ 31న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఆ సమయంలో జనతా పార్టీ సెక్యులర్‌కు చెందిన చరణ్ సింగ్ దేశ ప్రధానిగా ఉన్నా మండల్ కమీషన్ రిపోర్ట్ పైఏమీ చర్యలు తీసుకోలేకపోయారు. సుమారు దశాబ్దం పాటూ ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల నాయకత్వాలలో కాంగ్రెస్స్ పార్టీ కేంద్రంలో అధికారం అనుభవించింది. ఆ సమయంలో వారిరువురూ మండల కమీషన్ రిపోర్ట్‌ను అటకెక్కించారనే చెప్పాలి. తరువాత నేషనల్ ఫ్రంట్‌కు చెందిన వి.పి.సింగ్‌ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే1990 ఆగస్టులో మండల్ కమీషన్‌ను ఆమోదించి దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించారు. సుప్రీం కోర్టు కూడా ఓబిసి రిజర్వేషన్లు సమర్థించి వాటిని అమలు చేయమని 1992 నవంబర్ 16న అప్పటి కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. 1993 నుంచి ఓబిసి రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి. కాంగ్రెస్స్ పార్టీ తారువాత దేశాన్ని ఎక్కువ కాలం పరిపాలించిన పార్టీ భారతీయ జనతా పార్టీ. దేశాన్ని ఎన్నో దశాబ్ధాలు, శతాబ్ధాల నుంచి పట్టి పీడిస్తున్న అనేక జటిల సమస్యలకు బిజెపి ప్రభుత్వం పరిష్కారం చూపింది. దేశంలో 15 శాతం ఉన్న అగ్రవర్ణాల వారికి 10 శాతం ఇడబ్ల్యూయస్ రిజర్వేషన్లు కల్పించింది. 15శాతం ఉన్న అగ్రవర్ణాల వారిలో ఇడబ్ల్యూయస్ రిజర్వేషన్లకు అర్హులైన పేదలు 8శాతం మించి ఉండరని అనేక గణాంకాలు తెలియచేస్తున్నాయి. అయినా బిజెపి ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు ఎందుకు కేటాయించిందో పాలకులకే తెలియాలి. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే మహిళా బిల్లును 2023లో బిజెపి ప్రభుత్వం సునాయాసంగా గట్టెక్కించింది. 50 శాతంఉన్న మహిళలకు చట్టసభల్లో 33.3శాతం రిజర్వేషన్లు కల్పించబడింది. ఈ మహిళా బిల్లులో యస్.సి, యస్.టిలకు రిజర్వేషన్లు కేటాయించి బిసిలను విస్మరించారు. అదేవిధంగా 55శాతం పైగాఉన్న బిసిలు తమకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించమని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ కేటాయించమని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించమని, ప్రభుత్వ ఉద్యోగాల ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించమని దశాబ్ధాల నుంచి ప్రభుత్వాలను కోరుతున్నారు. వీటిపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నామమాత్రంగా నైనా స్పందించిన దాఖలాలు లేవు. తెలంగాణాలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎన్నికల సమయంలో బిసిని ప్రకటించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా అగ్రవర్ణాల వ్యక్తిని నియమించారు. బిసిల పట్ల కాంగ్రెస్‌ను మించి చులకనభా వం బిజెపి పెద్దలకు ఉన్నట్లు ఈ పరిణామాలన్నీ స్పష్టంగా తేటతెల్లం చేస్తున్నాయి. యస్.సి, యస్.టి, అగ్రవర్ణాల పేదలు వారి జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నారు. కానీ జనాభాలో సగానికి పైగా ఉన్న బిసిలు మాత్రం ఇంకా కటిక పేదరికాన్ని అనుభవిస్తున్నారు. రాజ్యాంగ పరంగా ఫలాలు అందించినప్పుడే బిసిలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతారు. ●



వ్యక్తులు ఇతరుల బోధన ద్వారా కంటే తమ కష్టాల ద్వారానే ఎక్కువ నేర్చుకుంటారు.

స్వామి వివేకానంద



సంతోషాన్ని ఇచ్చేది సంపద, లేదా వైభవం కాదు. ప్రశాంతమైన మనసు, వృత్తి మాత్రమే.

థామస్ జెఫర్‌సన్

# ప్రమాణాల ఆచరణపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి

రామ కిష్టయ్య సంగన భట్ల

వస్తువులన్నింటికీ నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు ఉన్నా, సర్వం నాసిరకం అవుతున్న నేటి పరిస్థితులలో ప్రభుత్వాలు ప్రతి వస్తువు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ప్రపంచ లేదా అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 14న నిర్వహించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు తమతమ దేశాలలో ప్రమాణాలను నిర్ణయించిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఏఎస్ఎంఈ), ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ), ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఒ), ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయు), ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ), ఇంటర్నెట్ ఇంజనీరింగ్ టాస్క్‌ఫోర్స్ (ఐఈటీఎఫ్)వంటి ప్రమాణాల అభివృద్ధి సంస్థలలో వినియోగదారులు, నియంత్రకాలు పరిశ్రమలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రామాణీకరణప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం ఈ రోజు ఉద్దేశ్యం. వేలాది మంది నిపుణుల కృషిని గుర్తు చేస్తూ జరుపుకుంటారు. 1946, అక్టోబరు 14న లండన్‌లో జరిగిన సమావేశంలో 25 దేశాల ప్రతినిధులు పాల్గొని వినియోగదారులకు ప్రామాణికమైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణిక సంస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. దానికి గుర్తుగా అక్టోబరు 14న ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపబడుతుంది. ఒక సంవత్సరం తరువాత అంతర్జాతీయ ప్రమాణిక సంస్థ ఏర్పడినప్పటికీ, 1970 వరకు మొదటి ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపు కోలేదు. ప్రస్తుతం ఈసంస్థలో 125 సభ్యదేశాలున్నాయి. ప్రామాణీకరణ ప్రాముఖ్యత గురించి పరిశ్రమలు, వినియోగదారులలో అవగాహన పెంచుతారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలోని జాతీయ సంస్థలు వేరువేరు రోజుల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. 2014లో యునైటెడ్ స్టేట్స్ అక్టోబరు 23న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహించింది. కెనడా దేశపు జాతీయ అక్రెడిటేషన్ బాడీ అయిన స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా (ఎస్.సి.సి) అంతర్జాతీయ సంస్థలతో కలిసి ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 2012లో స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా అక్టోబరు 12 శుక్రవారం రోజున ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంది. 1947లో భారతదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చట్టాన్ని ఆమోదించి బ్యూరోను ఒక శాసన బద్ధమైనా సంస్థగా మార్చారు. అప్పటి నుంచే ఐ.ఎస్.ఐ ముద్ర ప్రకటితమైంది. ఈ ముద్ర గల వస్తువులు నాణ్యత కలిగినది. 1947లో భారతీయ ప్రమాణాల సంస్థ మొదటి రెండు విభాగాలను ఏర్పాటు చేసింది. ఒకటి బట్టలకు, రెండవది ఇంజనీరింగ్‌కు సబంధించినది. ఈ సంస్థ నిర్ణయించిన తొలి ప్రమాణం ఏమిటో తెలుసా, మన జాతీయ పతాకం ఎంత పొడవు, వెడల్పు ఉండాలన్నది ఈ సంస్థ నిర్ణయించింది. కాలక్రమంలో టెలి కమ్యూనికేషన్స్, టీకాలు, నూనె గింజలు, త్రాగునీరు, పాడి పరిశ్రమ వంటివి కూడా ఈ సంస్థ పరిధిలోకి చేర్చారు. ఐఎస్ఐ మార్కు సంస్థ అనుమతి లేనిదే ఎవరూ వాడ కూడదు. అన్ని సాంకేతిక పరీక్షలు, తనిఖీలు నిర్వహించిన దరిమిలా ఒక సంవత్సరానికి ఐఎస్ఐ లైసెన్స్ ఇస్తుంది. ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్రమాణాలు నిర్ణయించడానికి ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు ఈ రోజునే ప్రారంభించాయి. కనుక ఈ రోజున వరల్డ్ స్టాండర్డ్సడే గా జరుపుకుంటారు. ●

# ప్రపంచ ఆర్థిక రంగంలో భారత్ సరికొత్త అడుగు

డి జె మోహన రావు

ప్రపంచంలో అగ్ర ఆర్థికశక్తిగా ఎదగాలనే మనదేశ లక్ష్యంలో ఇప్పుడు ఒక కీలకమైన అడుగు పడింది. అదే విదేశీ ద్రవ్య పరిష్కార విధానం (ఫారిన్ కరెన్సీ సెటిల్‌మెంట్ సిస్టమ్- ఎఫ్‌సీఎస్ఎస్). దీనిని గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ అంటే గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీలో ప్రారంభించడం ఈ లక్ష్యసాధనలో భాగం. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అక్టోబర్ 7, 2025 నాడు ఎఫ్‌సీఎస్ఎస్‌ను ప్రారంభించారు. ఇది కేవలం సాంప్రదాయ పద్ధతి స్థానంలో కొత్త టెక్నాలజీ తీసుకురావడం మాత్రమే కాదు, ప్రపంచ దేశాల మధ్య కరెన్సీ మార్చుకునే పద్ధతిలో మనదేశం తెచ్చిన ఒక వ్యవస్థాగత మార్పు. ఈ విధాన ముఖ్యలక్ష్యం విదేశీ లావాదేవీల్లోని అనవసరమైన ఆలస్యాన్ని, అధిక ఖర్చును, ఆ ప్రక్రియలో ఉన్న ప్రమాదాన్ని పూర్తిగా తొలగించడమే. ఎఫ్‌సీఎస్ఎస్ విజయవంతమైతే మన గిఫ్ట్ సిటీ అంతర్జా తీయంగా పేరుగాంచిన లండన్, న్యూయార్క్, సింగపూర్ వంటి అగ్ర ఆర్థిక కేంద్రాలకు సమానంగా ఎదగగలుగుతుం ది. ముఖ్యంగా మన దేశీయ బ్యాంకులు ఇకపై విదేశీ కరెన్సీ చెల్లింపుల కోసం ఇతర దేశాల కరస్పాండెంట్ బ్యాంకుల సేవలకు, వాటి పని వేళలకు ఎక్కువగా ఎదురుచూడాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుంది. ఎఫ్‌సీఎస్ఎస్ ఆవశ్య కతను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే, దాని రాకముందు విదేశీ లావాదేవీలు ఎలా జరిగేవో పరిశీలించాలి. సాంప్రదా య పద్ధతిని ఒక చిన్న ఉదాహరణతో అర్థం చేసుకుందాం. గిఫ్ట్ సిటీలోని ఒక బ్యాంకు (దీనిని ఇంటర్నేషనల్ బ్యాం కింగ్ యూనిట్ ఐబియు అంటారు) అమెరికన్ డాలర్లలో ఒక లావాదేవీ చేస్తే, ఆ డబ్బు నేరుగా చేరేది కాదు. ఆ లావాదేవీ పూర్తి కావడానికి డబ్బు అమెరికా, యూరప్‌లోని కరస్పాండెంట్ బ్యాంకులు సహా అనేక మధ్యవర్తి బ్యాంకుల సంక్లిష్టమైన గొలుసు గుండా ప్రయాణించాల్సి వచ్చేది. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు 36 నుండి 48 గంటల సుదీర్ఘ సమయం పట్టేది. ఈ సుదీర్ఘ నిరీక్షణ కాలం అనేక తీవ్రమైన సమస్యలకు దారితీసేది. ఏదైనా ఒక బ్యాంకు దివాలా తీసినా లేదా డబ్బు చెల్లించడంలో రెండోది నిధులు వృథా అవడం. బ్యాంకులు ఎప్పుడూ విదేశీ ఖాతాలలో పెద్దమొత్తంలో డబ్బును నిల్వ చేసి ఉంచాలి. సిద్ధంగా ఉంచిన ఈ డబ్బు, తమ దేశీయ అవసరాలకోలేదా ఇతర పెట్టుబడులకో ఉపయోగపడేదికాదు. మూడవ సమస్య ఖర్చు పెరగడం. ప్రతి మధ్యవర్తి బ్యాంకు తమ సేవలకు తప్పకుండా ఫీజులు వసూలు చేయడంతో, చివరకు లావాదేవీ చేసే వారికి అయ్యేఖర్చు బాగా పెరిగిపోయేది. ఎఫ్‌సీ



ఎస్ఎస్ ఈ సమస్యలన్నింటికీ మూడు కీలకమైన పరిష్కారాలను చూపించింది. ఎఫ్‌సీఎస్ఎస్ ద్వారా విదేశీ కరెన్సీ లావాదేవీలు 'రియల్ టైమ్'లో అంటే తక్షణమే పరిష్కారం అవుతాయి. దీన్ని సాకారం చేయడానికి అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ (ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ- ఐఎఫ్ఎస్సిఎ) ఒక ప్రత్యేకమైన 'స్థానిక సెటిల్‌మెంట్ బ్యాంకు'ని ఏర్పాటు చేసింది. గిఫ్ట్ సిటీలోని అన్ని బ్యాంకులు ఈ స్థానిక బ్యాంకులో విదేశీ కరెన్సీకి సంబంధించిన ఖాతాలను తెరుస్తాయి. దీనివల్ల ఒక బ్యాంకునుంచి మరొక బ్యాంకుకు డాలర్లు పంపాల్సివస్తే, ఆ డబ్బు అంతర్జాతీయ మార్గాల గుండా ప్రయాణించకుండా, కేవలం ఈ స్థానిక ఖాతాల మధ్యే క్షణాల్లో మార్పిడి జరుగుతుంది. దీనివల్ల బ్యాంకులు తమ నిధులు ఎప్పుడు, ఎంత అందుబాటులో ఉంటాయో అనే దానిపై ఖచ్చితమైన అంచనా వేయగలుగుతాయి. ప్రస్తుతం అమెరికన్ డాలర్స్ మాత్రమే ఈ పద్ధతిలో మార్పిడి చేస్తున్నారు. త్వరలోనే ఇతర ప్రముఖ అంతర్జాతీయ కరెన్సీలను కూడా ఈ విధానంలోచేరుస్తారు. అలాగే ఈ నూతన పద్ధతిలో సెటిల్‌మెంట్ ప్రమాదం పూర్తిగా తొలగిపోతుంది. ఎందుకంటే డబ్బు పంపడం, స్వీకరించడం అనే లావాదేవీలోని రెండు భాగాలు ఒకేచోట ఒకే సమయంలో పూర్తి అవుతాయి. దీనివల్ల మధ్యలో ఆగిపోయే అవకాశమే ఉండదు. అంతేకాకుండా, బ్యాంకులు తమ లావాదేవీల కోసం విదేశీ బ్యాంకుల్లో పెద్దమొత్తంలో నిధులు వృథాగా నిల్వచేయాల్సిన అవసరం ఉండదు. విముక్తి పొందిన ఈ నిధులు దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక కార్యకలాపాలలో పెట్టుబడిగా మారడానికి అవకాశం కల్పిస్తాయి. ఇది బ్యాంకుల వద్ద డబ్బు అందుబాటును అంటే ద్రవ్య లభ్యతను బలోపేతం చేస్తుంది. అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రాలప్రాధికార సంస్థ పర్యవేక్షణలో, భారతదేశంలోని చెల్లింపుల పరిష్కార వ్యవస్థల చట్టం 2007కింద పనిచేస్తుంది. ఈ చట్టబద్ధమైన, కట్టుదిట్టమైన వ్యవస్థ విదేశీ సంస్థలకు ఒక పెద్ద భద్రత ఇస్తుంది. ఇది చట్టపరమైన స్పష్టతను, ప్రమాద నివారణను, పూర్తి పారదర్శకతను అందిస్తుంది. దీనివల్ల విదేశీ పెట్టుబడిదారులు, పెద్ద అంతర్జాతీయ బ్యాంకులుఎటువంటి సందేహం లేకుండా మన దేశంలో పెట్టుబడులు పెట్టడానికి, గిఫ్ట్ సిటీలో తమ కార్యకలాపాలను విస్తరించడానికి మరింత ఎక్కువగా ముందుకు వస్తారు. భారతదేశం తీసుకున్న చారిత్రాత్మక, వ్యూహాత్మక అడుగు. వేగవంతమైన, తక్కువఖర్చుతో కూడిన, నమ్మక మైన లావాదేవీల పరిష్కార వేదికగా గిఫ్ట్ సిటీని చూసి అంతర్జాతీయ పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థలు తమగ్లోబల్ హబ్‌గా ఎంచుకుంటారు. దీని ద్వారా మన దేశం ప్రపంచ నిధుల కేంద్రంగా మారుతుంది. అలాగే అంతర్జాతీయవాణిజ్య లావాదేవీలలో ఆలస్యం, ఖర్చులు తగ్గడం వలన భారతీయ వ్యాపారాలు ప్రపంచవ్యాప్తంగా మరింత పోటీ పడగలుగుతా యి. ఇది దేశీయ ఎగుమతులు, దిగుమతులను పెంచిమొత్తం మీద దేశ ఆర్థికవృద్ధికి బాగా సహాయపడుతుంది. ఎఫ్‌సీఎస్ఎస్ అనేది కేవలం టెక్నాలజీ వ్యవస్థ మాత్రమే కాదు. ఇది ప్రపంచ ఆర్థికరంగాన్ని నడిపించే దేశాల సరసన మన దేశం మరింత స్థిరంగా, విశ్వాసంతో నిలబడగలుగుతుందని చాటే ఒక గట్టి ప్రకటన. ●

# ప్రజావాక్కు



## పెరుగుతున్న వైద్యం ఖర్చులు

రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రతి కుటుంబం ఏటా వేల కోట్ల రూపాయలు వైద్య చికిత్సలకే ఖర్చు చేస్తున్నాయనే గణాంకాలు తీవ్రఆందోళన కలిగిస్తున్నాయి. ఈఖర్చు ఎక్కువ శాతం నేరుగా ప్రజల జేబు నుండి వెళ్లిపోతుండడం, ప్రభుత్వ ఆరోగ్య సేవల లోపాన్ని స్పష్టంగా చూపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సదుపాయాల లేమి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణుల కొరత, మందుల లభ్యత లోపం వంటి అంశాలు ప్రజలను ఖరీదైన ప్రైవేట్ ఆసుపత్రుల వైపుమళ్లిస్తున్నాయి. ఈఆర్థికభారంతో అనేక కుటుంబాలు అప్పుల ఊబిలో పడుతూ, జీవన ప్రమాణం దిగజారుతున్నది. ప్రైవేట్ వైద్య రంగంపై అధిక ఆధారపడడం, ఆరోగ్యరంగంలో అసమానతలను మరింతగా పెంచుతోంది. ప్రజారోగ్యంపై సరైన పెట్టుబడులు లేకపోవడం, పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో లేకపోవడం పరిస్థితిని మరింత విషమం చేస్తోంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## పిల్లలపై ఒత్తిడి పెంచొద్దు

పిల్లల జీవితంలో ప్రేమ, ప్రోత్సాహం, అర్థం చేసుకోవడం చాలా అవసరం. అయితే నేడు చాలా మంది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మంచి మార్కులు, ర్యాంకులు లేదా విజయాల కోసం పిల్లలపై అత్యధిక ఒత్తిడి తెస్తున్నారు. అది వారిలో భయం, ఆందోళన, నమ్మకం కోల్పోవడం వంటి ప్రతికూల భావాలను పెంచుతుంది. ప్రతి పిల్లవాడు తనదైనవేగం, తనదైన ప్రతిభతో ఎదుగుతాడు. అందుకే, వారిని ఇతరులతో పోల్చకూడదు తప్పులు చేసినా నేర్చుకునే అవకాశం ఇవ్వాలి. పిల్లల మనసులు సున్నితమైనవి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## విద్యా ప్రమాణాలు పెంచాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి. ఆధునిక పద్ధతిలో విద్యా బోధన జరపాలి. అలాగే స్మార్ట్ బోర్డులు, ప్రొజక్టర్లు ఉపయోగించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికైనా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ముఖ్యంగా టాయిలెట్‌లు, బెంచీలు, ఉపాధ్యాయులకు కుర్చీలు, లైట్లు, మంచి నీరు, ధృడమైన పాఠశాల బిల్డింగ్, తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

## ఔషధ పరిశ్రమలో భద్రత ముఖ్యం

రసాయన ఔషధ పరిశ్రమలు, కర్మాగారాలలో పకడ్బందీగా భద్రత ప్రమాణాలు పాటించాలి. రసాయన ఔషధ పరిశ్రమలలో ఇటీవల తరచూ ప్రమాదాలు సంభవిస్తుండటంతో ప్రాణ నష్టం జరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కార్మికులకు నిరంతరం భద్రతాపరమైన అంశాలపై శిక్షణకార్యక్రమాలు, మాక్‌డ్రిల్స్ నిర్వహించాలి. కార్మికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి పరిశ్రమలో భద్రత పట్ల యాజమాన్యం శిక్షణ తరగతులు నిర్వహించాలి. దాంతో చాలా వరకు ప్రమాదాలను నివారించొచ్చు. ప్రమాదాలు జరిగినప్పుడు ఇచ్చే నివేదికలు ముఖ్యం కాదని, జీరో ప్రమాదాల స్థాయికి చేరినప్పుడే పరిశ్రమ 100 శాతం అభివృద్ధి సాధించినట్టు లెక్క. నిబంధనలు ఉల్లంఘించినా, భద్రత ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## తెలంగాణ విద్యకు కొత్త దిశ

తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ 160 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను విదేశీపర్యటనకు పంపించాలనేనిర్ణయం తీసుకోవడం విశేషంగా చెప్పుకోవాలి. ఈనిర్ణయం ఉపాధ్యాయుల వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే కాకుండా, బోధనా పద్ధతుల్లో నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తుంది. విదేశీ పర్యటనలద్వారా ఉపాధ్యాయులు ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా విధానాలను, ఆధునిక బోధనా సాంకేతికతలను సమీక్షించి నేర్చుకునే అవకాశం పొందుతారు. ఆ అనుభవాలను తమ పాఠశాలల్లో అమలు చేస్తే విద్యార్థులలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నేర్చుకునే తపన పెరుగుతుంది. ఇది విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## పి.ఇ.టిలకు ఎన్‌సీసీ డ్యూటీ!

తెలంగాణ రాష్ట్రంలోని వివిధవిద్యాసంస్థలలో, జూనియర్ కళాశాలలో, యూనివర్సిటీలలో, ఎన్.సీ.సీ. జాబ్‌చార్ట్, ఆటలు, పాటలు, క్రమశిక్షణ వంటి డ్యూటీలను, సంస్కృతిక కార్యక్రమాలు ఇకమీదట నిర్వహించడానికి గాను ఆ విధులను పని విధానం టీచింగ్ చేసేటీచర్స్, లెక్చరర్స్ నుండి బాధ్యతలు తీసివేసి పీఈటీలకు, ఫిజికల్ డైరెక్టర్‌లకు అప్పగించాలి. అందుకోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక జీవో విడుదల చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారత్‌లో తిష్టకు ఆఫ్రికన్ల కొత్త ఎత్తుగడలు

- నేరాలకు పాల్పడి, కాంట్రాక్టు పెళ్లిళ్లు చేసుకుని జైళ్లకు వెళుతున్న వైనం
- కేసులను కొలిక్కితెచ్చి బలవంతంగా వెనక్కి పంపేందుకు పోలీసుల ప్రయత్నాలు




**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** భారత్‌లో తిష్టవేసేందుకు ఆఫ్రికాదేశాలకు చెందినకొందరునేరగాళ్లు కొత్తఎత్తుగడలు వేస్తున్న తీరు పోలీసులను సైతం షాక్‌కు గురిచేస్తోంది. ఇక్కడ అక్రమంగా ఏళ్లతరబడి వుంటున్న అనేక మంది ఆఫ్రికన్ నేరగాళ్లు ఇందుకోసం చిన్నాచితక నేరాలతో పాటు, ఇతరులతో అనవసరంగా గొడవలు పడి పోలీసు కేసుల్లో అరెస్టయి జైళ్లకు వెళుతుండడంతో పాటు కాంట్రాక్ట్ వివాహాలు చేసుకుని అమ్మాయిలను మోసం చేస్తున్నారు. ఈ కారణాలవల్ల వీసా గడువుముగిసినా కోర్టులో కేసులుండడంవల్ల వీరిని పోలీసులు వెనక్కు పంపలేక పోతున్నారు. ఆఫ్రికా దేశాలలో బతుకు పోరాటం నరకంగా వుండడం వివిధ కారణాల చేత భారత్‌కు వస్తున్న ఆఫ్రికన్లలో అనేక మంది తిరిగి వెళ్లేందుకు మనస్సు అంగీకరించక ఇక్కడే తిష్ట వేస్తున్నట్లు పోలీసులుచెబుతున్నారు.

ఆఫ్రికా దేశాలకు చెందిన వందలాది మంది భారత్‌లో అక్రమంగా వుండడం, వీరిలో 90 శాతంమంది నేరచరిత్ర కలిగి వుండడం పోలీసులకు తలనొప్పి వ్యవహారంగా మారింది. ఒకప్పుడు నైజీరియాకు చెందిన కొందరు నేరగాళ్లు మాత్రమే భారత్‌లో అక్రమంగా వుండగా ఇప్పుడు ఈ జాబితాలో ఉగాండ, జాంబియా, కెన్యా సహా మరికొన్ని దేశాలకు చెందిన వారు కూడా చేరారు. ఆఫ్రికా దేశాలలో అంతర్గత సంక్షోభ సమస్య అధికంగా వుండగా, తీవ్రమైన కరువు కాటకాలు మరింత కుంగదీస్తోంది. దీంతో పాటు ఉగ్రవాద సమస్య అక్కడి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీనికి తోడు జాతుల సమస్యలతో సాగుతున్న మారణకాండ అక్కడి ప్రజల బతుకులను మరింత దుర్భరంగా మారుస్తోంది. ఈ క్రమంలో భారత్ సహా అనేక దేశాలకు వలస వెళుతున్న ఆఫ్రికన్లు ఆతరువాత అక్కడే వుండేందుకు మక్కువ చూపుతున్నారు. ఇందులో భారత్ వుండేందుకు మరింత ఎక్కువ మంది ఇష్టపడుతున్నారని పోలీసుల గణాంకాలు చెబుతున్నాయి. ఇదంతా ఇలావుంటే ఆఫ్రికన్ల వల్ల భారత్‌లోని అనేక నగరాలలో డ్రగ్స్ కల్చర్ బాగా పెరిగిందని నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. ఆఫ్రికా దేశాల నుంచి తక్కువ ధరకు నాణ్యమైన కొకైన్ సహా హెరాయిన్, ఎల్ఎస్‌టి వంటి డ్రగ్స్‌ను భారత్‌కు తెస్తూ ఇక్కడ అధిక ధరలకు అమ్ముతూ అనేక మంది ఆఫ్రికన్లు జల్సా జీవితం గడుపుతు న్నారు. వీరంతా దక్షిణాదినగరాలైన హైదరా బాద్, బెంగళూరు, చెన్నైతో పాటు పశ్చిమాది నగరాలు ముంబాయి. గోవాలలో ఎక్కువగా తిష్ట వేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్, బెంగళూరు, గోవా పోలీసులకు పట్టుబడ్డ డ్రగ్స్ స్మగ్లర్ల వద్ద కోట్లాది రూపాయల ఆస్తులు వున్నట్లు తేలింది. ఇదంతా డ్రగ్స్ స్మగ్లింగ్ వల్లే వీరు సంపాదించి నట్లు వెల్లడయ్యింది. డ్రగ్స్ కేసుల్లో అరెస్టయిన వారిలో 90శాతం నేరగాళ్లు వీసా గడువు ముగి సినా ఇక్కడే వుండడంతో పాటు మరికొందరు తప్పుడు పత్రాలతో వుంటున్నట్లు తేలింది.

**కేసులను కొలిక్కితెచ్చి బలవంతంగా వెనక్కు పంపేందుకు పోలీసుల ప్రయత్నాలు**

ఇదిలావుండగా నిందితులుగావుంటూ ఏళ్లతరబడి భారత్‌లో అక్రమంగా వుంటున్న ఆఫ్రికన్లను బలవంతంగా వారిదేశాలకు పంపేందుకు కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. వీరిపై వున్న కేసులను వీలైనంత త్వరగా కొలిక్కి తెచ్చేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచించినట్లుగా తెలిసింది. చిన్నాచితక కేసులను కోర్టులో వీలైనంత త్వరగా పరిష్కరించి ఇందులో నేరగాళ్లుగా వున్న ఆఫ్రికన్లను వారి దేశాలకు బలవంతంగా పంపేందుకు కేంద్రం చేబట్టిన చర్యలు కొంతమేర ఫలితాలు ఇస్తున్నాయి. హైదరాబాద్ సహా పలునగరాలలో అక్రమంగా వుంటున్న వంద మంది వరకు ఆఫ్రికన్ల కేసులను మూడు నెలల క్రితం ఆయా రాష్ట్రాల పోలీసులు ఓ కొలిక్కితెచ్చి వారిని వారి దేశాలకు పంపడం కొసమెరుపు.




# గూగుల్‌కు పోటీగా మ్యాపుల్స్

## యాప్ అద్భుతంగా ఉందన్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ప్రపంచవ్యాప్తంగా నావిగేషన్ కోసం విరివిగా ఉపయోగించే గూగుల్ మ్యాప్స్‌కు గట్టి పోటీనిచ్చేలా ఓ స్వదేశీ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలిచింది. గూగుల్ కన్నా మెరుగైన ఫీచర్లతో భారతదేశంలో తయారైన మ్యాపుల్స్ నావిగేషన్ యాప్ అద్భుతంగా పనిచేస్తోందని కేంద్ర ఐటి శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కొనియాడారు. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ తప్పకుండా వాడాలని ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. తాను స్వయంగా మ్యాపుల్స్ యాప్‌ను ఉపయోగిస్తున్న వీడియోను పంచుకున్నారు. ఈ యాప్‌లో ఫ్లైఓవర్లు, ఓవర్‌బ్రిడ్జిలను సులభంగా గుర్తించవచ్చని, అపార్ట్‌మెంట్‌లలో ఉండే దుకాణాల వివరాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయని ఆయన వివరించారు. ఇందులో 13 రకాల ప్రత్యేక ఫీచర్లు ఉన్నాయని, ఇవి ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తాయని తెలిపారు. మంత్రి చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గామారింది. స్వదేశీ యాప్‌కు కేంద్రమంత్రి ప్రచారం కల్పించడంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మ్యాపుల్స్ యాప్‌ను మ్యాప్‌మైఇండియా సంస్థ అభివృద్ధి చేసింది. ఈ యాప్‌లో 3డి జంక్షన్ వ్యూ, లైవ్ ట్రాఫిక్ సిగ్నల్ టైమర్లు, భద్రతా హెచ్చరికలు, ప్రాంతీయ భాషల సపోర్ట్‌వంటి అనేక ఆధునిక సదుపాయాలు ఉన్నాయి. ముఖ్యంగా భారతీయ రోడ్లు, జంక్షన్ల పరిస్థితులకు అనుగుణంగా దీన్ని తీర్చిదిద్దినట్లు సంస్థతెలిపింది. మంత్రి ట్వీట్‌కు స్పందించిన మ్యాప్ మై ఇండయా సంస్థ ఆయనకు కృతజ్ఞత తెలిపింది. భారత్‌లో డ్రైవింగ్‌ను మరింత సురక్షితంగా, సులభంగా మార్చడమే తమ లక్ష్యమనిపేర్కొంది. దేశ ప్రజలందరూ స్వదేశీ సాంకేతిక విప్లవంలో భాగస్వాములు కావాలని కోరింది. ఇప్పటి వరకు ఈ యాప్‌ను 3.5 కోట్ల మందికి పైగా డౌన్‌లోడ్ చేసుకున్నట్లు సంస్థ వెల్లడించింది.

# శ్రేసన్ ఫార్మాకు లైసెన్స్ రద్దు

### కోల్డ్‌రిఫ్ దగ్గుమందుతో పలు మరణాలు

### కంపెనీ మూసివేతకు తమిళనాడు సర్కారు ఆదేశాలు

**చెన్నై, అక్టోబరు 13:** 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో 20 మందికిపైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ సంస్థ శ్రేసన్ ఫార్మా అనుమతులు రద్దు చేసినట్లు సోమవారం తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. అలాగే కంపెనీ మూసివేతకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపింది. రాష్ట్రంలోని ఇతర ఔషధ తయారీ సంస్థల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించినట్లు పేర్కొంది. ఈ దగ్గు మందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం అత్యంత విషపూరితమైన డైఇథైలిన్ గ్లైకాల్ ఉందని తేలినట్లు అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. సరైన తయారీ పద్ధతులు అవలంబించడంలేదని, 300కు పైగా ఉల్లంఘనలను రికార్డు చేసినట్లు చెప్పారు. ప్రత్యేక దర్యాప్తు బృందం ఇప్పటికే కంపెనీ యజమాని జి.రంగనాథన్‌ను అరెస్టు చేసింది. అలాగే సోమవారం ఉదయం ఫార్మా సంస్థకు చెందిన పలు ప్రాంగణాల్లో ఇడి తనిఖీలు నిర్వహించింది. దగ్గు మందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని దర్యాప్తులో భాగంగా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ (సిడిఎస్‌సిఒ) గుర్తించినట్లు జాతీయమీడియా కథనాలు పేర్కొన్న సంగతితెలిసిందే. రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను విస్మరించిందని, కేంద్రం చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని పేర్కొన్నాయి. దగ్గుమందు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్‌లోకి ప్రవేశించిందని, ఆ నిర్లక్ష్యం పిల్లల మరణాలకు దారితీసిందని తెలిపాయి.

# ట్రేడ్ డీల్‌పై మలివిడత చర్చలు

## నేడో రేపో అమెరికాకు భారత్ బృందం

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి సంబంధించి మలివిడత చర్చల కోసం భారత్ బృందం త్వరలో వాషింగ్టన్ వెళ్లనుంది. అధికార వర్గాల కథనం ప్రకారం పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడం, ఒప్పందం తొలి దశను ఖరారు చేయడం లక్ష్యంగా మలి విడత చర్చల కోసం భారత ఉన్నతస్థాయి వాణిజ్య ప్రతినిధి బృందం అమెరికా వెళ్లనుంది. అమెరికాతో చర్చలు సానుకూల మార్గంలో సాగుతున్నాయి. ద్వైపాక్షిక ఒప్పందం మొదటి దశ ఈ నెలాఖరు లోపు ముగుస్తుందని రెండు పక్షాలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నాయి. ట్రంప్ సుంకాల విధింపుతో వాణిజ్య ఒప్పందానికి బ్రేకులుపడ్డాయి. అయితే, పరస్పర సుంకాల వల్ల ఇరుదేశాలకు నష్టం వాటిల్లుతున్నందున సాధ్యమైనంత త్వరగా ట్రేడ్ డీల్‌కు రావాలని నిర్ణయించాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉభయదేశాలు ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించాయి. దీనికి సంబంధించి తొలి దశ చర్చలను అక్టోబర్, నవంబర్‌లో పూర్తి చేయాలని షెడ్యూల్ కూడా చేశారు. ఇప్పటి వరకు ఐదు దశల్లో వాణిజ్య చర్చలు సాగాయి. ఇటీవల కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ వాణిజ్య చర్చల కోసం అధికార ప్రతినిధి బృందంతోకలిసి న్యూయార్క్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఇరుదేశాలమధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన వివిధ అంశాలపై నిర్మాణాత్మక చర్చలు జరిపారు. గోయెల్ అమెరికా పర్యటన అంతా సానుకూలంగాసాగింది. ఈ పర్యటనలో పీయూష్ గోయెల్ అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్, భారత్‌లో అమెరికా రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్‌తోనూ సమావేశమై సమాలోచనలు జరిపిన విషయం తెలిసిందే.

# రాజకీయ అంశాలు కోర్టులకెందుకు?

## రాహుల్ వ్యాఖ్యలపై దాఖలైన పిల్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** 'ఓట్ చోర్ గద్దీ ఛోడ్'అనే నినాదంతో 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బిజెపి, ఎన్నికల సంఘంపైన 'ఓటు చోరీ' వ్యాఖ్యలు చేశారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పిటిషనర్ అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై కోర్టు స్పందిస్తూ రాజకీయ అంశాలకు కోర్టులోను వేదిక చేసుకోవద్దు. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని తేల్చి చెప్పింది. బిజెపి, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధాన మంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదేవిధంగా ఓట్లు దొంగలించడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలలో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని, బీహార్‌లో మాత్రం బిజెపి, ఇసిని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని వ్యాఖ్యానించారు. కాగా రాహుల్ చేసిన ఆరోపణలు బిజెపి నేతలు, ఎన్నికల కమిషన్ అధికారులు ఖండించారు.

# బీహార్ ఎన్నికలు సమీపిస్తున్నవేళ.. లాలూ కుటుంబంపై ఢిల్లీ కోర్టు అభియోగాలు



**పాట్నా, అక్టోబర్ 13:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న తరుణంలో మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి షాక్ తగిలింది. అవినీతి కేసులో లాలూతో పాటు ఆయన సతీమణి రబ్రీదేవి, కుమారుతు తేజస్వీ యాదవ్‌పై సోమవారం ఢిల్లీ కోర్టు అభియోగాలు మోపింది. ఈ కేసులో వారు విచారణను ఎదుర్కోనున్నారు. లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఐఆర్‌సిటిసి హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టులు కేటాయించడంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. మోసం, కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద రౌజ్ అవెన్యూ కోర్టు లాలూ కుటుంబంపై అభియోగాలు నమోదుచేసింది. రైల్వే మంత్రిగా తన పదవిని దుర్వినియోగం చేశారని ఈ సందర్భంగా న్యాయస్థానం వ్యాఖ్యానించింది. తాము ఏ తప్పూ చేయలేదని లాలూ, తేజస్వి కోర్టుకు వెల్లడించగా అసలు ఇది తప్పుడు కేసు అని రబ్రీదేవి పేర్కొన్నారు. 2004-2009లో లాలూ రైల్వే మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఐఆర్‌సిటిసి హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టుల కేటాయింపులో అవినీతి జరిగిందనేది ఆరోపణ. ఆ కాంట్రాక్టులను సుజాత హోటల్‌కు అప్పగించారు. ఆ ఒప్పందానికి బదులుగా లాలూయాదవ్ ఒక బినామీ కంపెనీ ద్వారా ఖరీదైన ప్రాంతంలో మూడు ఎకరాల భూమిని పొందారని సిబిఐ పేర్కొంది. ఈ వ్యవహారంలో 2017లో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

నిందితులపై అభియోగాలు మోపేందుకు తగిన సమాచారం ఉందని కోర్టులకు వెల్లడించింది. ఆ వాదనను లాలూ న్యాయవాది తోసిపుచ్చారు. ఇదిలా ఉంటే వచ్చే నెల బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్డీయే, లాలూ పార్టీ ఆర్జెడి నేతృత్వంలోని మహాగర్‌బంధన్‌అధికారం కోసం హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. ప్రత్యర్థులు తమ ప్రచారంలో ఈ కేసును ఎత్తి చూపే అవకాశం ఏర్పడింది. బీహార్‌లో అసెంబ్లీ స్థానాలకు నవంబరు 6,11 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

# సంక్షిప్తంగా..

## కరూర్ తొక్కిసలాటపై సిబిఐ దర్యాప్తు: సుప్రీం

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** కరూర్ తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై సిబిఐ విచారణకు ఆదేశించింది. సిబిఐ దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసింది. గత నెల 27న టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 60 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాసు హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టివికె పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సిట్ దర్యాప్తును దేశ అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. తమ పార్టీ పట్ల సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించింది. ఈ మేరకు తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. 41 మంది మృతి చెందిన తొక్కిసలాట ఘటన దేశాన్ని కదిలించిందని పేర్కొంది. ఈ మేరకు సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. నిస్సందేహంగా.. న్యాయసమ్మతమైన, పక్షపాతరహిత విచారణ అనేది పౌరుల హక్కు అని వ్యాఖ్యానించింది.

## పదవి నుంచి తప్పుకుంటా: కేంద్రమంత్రి సురేష్ గోపి



**తిరువనంతపురం, అక్టోబరు 13:** మళ్లీ యాక్టింగ్ వైపు మళ్లే యోచనలో ఉన్నట్లు కేంద్రమంత్రి, బిజెపి ఎంపి సురేశ్ గోపి తెలిపారు. కేరళలోని కన్నూర్‌లో రాజ్యసభ ఎంపి సదానందన్ మాస్టర్ అధికారిక కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన ఆదాయం బాగా తగ్గిపోయిందని అన్నారు. దాదాపుగా నిలిచిపోయిందని అన్నారు. ఆదాయంకోసం మళ్లీ నటనపై దృష్టి పెట్టాలని అనుకుంటున్నట్లు తెలిపారు. తన స్థానంలో రాజ్యసభ ఎంపి సదానందన్‌ను నియమించాలని కూడా ప్రతిపాదించానని ఆయన అన్నారు. పార్టీలోతానే అత్యంత పిన్నవయస్కుడినని తెలిపారు. 2008లో పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు ఎన్నుకున్నతనను కేంద్రమంత్రిని చేయాలని పార్టీ భావించినట్లు తెలిపారు. మలయాళం సినీ పరిశ్రమలో ప్రముఖ నటుడైన సురేశ్ గోపి త్రిసూర్ నియోజకవర్గం నుంచి బిజెపితరఫున పోటీచేసి ఎంపిగాఎన్నికయ్యారు. రాష్ట్రంలో తొలి బిజెపిఎంపిగా రికార్డు సృష్టించారు.

## పుణేలో చిరుత దాడి: చిన్నారి మృతి

**ముంబయి, అక్టోబరు13:** పొలంలో పనిచేస్తున్న అయిదేళ్ల చిన్నారిపై చిరుత పులి దాడి చేసిన ఘటన మహారాష్ట్రలోని పుణెలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పింపార్ఖేడ్ గ్రామంలో తమ ఇంటి సమీంపలోని పొలంలో పనిచేస్తున్న తాతకు మంచినీళ్లు ఇవ్వడానికి శివన్యశైలేష్ బొంబే అనే అయిదేళ్ల చిన్నారి వెళ్లింది. ఆ సమయంలో అక్కడే నక్కి ఉన్న చిరుతపులి ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేసి పొలాల్లోకి ఈడ్చుకుపోయింది. అక్కడే పనిచేస్తున్న వ్యక్తుల అది గమనించి కర్రలతో చిరుతను తరమడంతో కొద్ది దూరంలో చిన్నారిని వదిలి వెళ్లిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చిన్నారి మెడకు తీవ్ర గాయాలవడంతో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. చిరుతపులిని గుర్తించేందుకు కెమెరా ట్రాప్‌లను, థర్మల్ డ్రోన్‌లను ఉపయోగించామని, 10 బోన్లు ఏర్పాటు చేశామని ఫారెస్ట్ డివిజన్ అధికారి పేర్కొన్నారు. సోమవారం చిరుత బోనుకు చిక్కిందని అటవీశాఖ అధికారులుపేర్కొన్నారు.

## పాకిస్థాన్‌లో ఆందోళనల అగ్గి

**ఇస్లామాబాద్, అక్టోబరు 13:** గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తెహ్రీక్-ఇ-లబైక్ పాకిస్థాన్ (టిఎల్‌పి) కార్యకర్తలు చేస్తోన్న ఆందోళనలతో పాకిస్థాన్ భగ్గుమంటోంది. గత వారం మొదలైన ఉద్రిక్తతలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. దాంతో ఒక అధికారి సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో లాహోర్‌లో రోజువారీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. గాజా యుద్ధం ముగింపుపై పాలస్తీనా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుంటే.. పాక్ హింసాత్మకంగా మారడం గమనార్హం. ట్రంప్ శాంతి ప్రణాళిక ప్రకటించిన తర్వాత ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీ ముట్టడికి ప్లాన్ చేసింది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు చేస్తోన్న ప్రయత్నాలు హింసాత్మకంగా మారుతున్నాయి.

# ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు గని ఎక్కడో తెలుసా?



**వాషింగ్టన్, అక్టోబరు 13:** బంగారం.. ఈపేరు వింటేనే చాలా మందిలో వైబ్రేషన్లు వస్తాయి. కారణమేమంటే దానిపై వారికి ఉంటే మక్కువ. ముఖ్యంగా మహిళలు బంగారం పేరు వినగానే అటెన్షన్ అవుతుంటారు. పసిడి కొనేందుకు ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం బంగారం ధర సామాన్యులకు అందనంత దూరంలో ఉంది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1.25 లక్షలు దాటింది. కేవలం ఈ ఒక్క సంవత్సరంలోనే దాదాపు 50 శాతం ధర పెరిగింది. ఇదే సమయంలో కొందరికి విచిత్రమైన ప్రశ్నలు వస్తున్నాయి. అలాంటి వాటిల్లో ప్రపంచంలో అత్యధిక బంగారం ఎక్కడ ఉంది? ఏ దేశంలో ఎక్కువ ఉత్పత్తి అవుతుంది? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆ దేశం ఏమిటి? అక్కడ యేడానికి ఎంత బంగారాన్ని వెలికితీస్తారో తెలిస్తే నిజంగా ఆశ్చర్యపోతారు. మరి ఆ వివరాలిలా ఉన్నాయి.

ప్రపంచంలో అతిపెద్ద బంగారు గని పేరు నెవాడా గోల్డ్‌మైన్. ఇది అమెరికాలోని నెవాడా రాష్ట్రంలో ఉంది. ఈ గనిలో యేటా టన్నుల కొద్దీ గోల్డ్‌ను వెలికితీస్తుంటారు. భూమిపైనే అతిపెద్ద బంగారు గనిగా ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. ఈ బంగారు గనిని బారిక్ గోల్డ్, న్యూమెంట్ కార్పొరేషన్ అనే సంస్థలు కలిపి నడుపుతున్నాయి. ఈ గనిలో యేటా సుమారు వంద టన్నులు అంటే లక్షకిలోల గోల్డ్‌ను బయటకు తీస్తున్నారు. ప్రస్తుతం భూమిపై వినియోగంలో ఉన్న అతిపెద్ద బంగారు గని ఇదేనని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అగ్రరాజ్యమైన అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఈ బంగారు గని ఒక అక్షయపాత్రలా ఉపయోగపడుతుంది. ప్రస్తుతానికి ప్రపంచంలో ఎక్కువ బంగారం నిల్వలు ఉన్న దేశం కూడా యుఎస్ కావడం గమనార్హం. అంతలా అమెరికా బంగారాన్ని రిజర్వ్ చేయడానికి ఈ గని కూడా ఒక కారణమని అక్కడి మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇకపోతే మన దేశంలో కూడా బంగారు గనులు ఉన్నాయి. అయితే వాటి నుంచి లభించే బంగారం చాలా తక్కువ. ఇక్కడ బంగారు ఉత్పత్తికి అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి బంగారం ఇతర దేశాల నుంచే ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నాం.

# ఆట గెలిపించి.. అసువులు బాసి!

### క్రికెట్ మైదానంలో ఆడుతూనే ప్రాణాలు వదిలిన బౌలర్

**లక్నో, అక్టోబరు 13:** ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లాలో ఓ క్రికెట్ ఆటగాడు మైదానంలోనే మృతి చెందాడు. స్థానికంగా జరిగిన ఓ టోర్నమెంట్‌లో అద్భుతంగా బౌలింగ్‌చేసి తన జట్టును గెలిపించాడు కానీ.. జీవిత పోరాటంలో మాత్రం ఓడిపోయాడు. చివరి బంతి వేసిన తర్వాత ఆ బౌలర్ అకస్మాత్తుగా మరణించాడు. ఈ ఘటనతో అందరూ షాక్‌అయ్యారు. ఇందుకు సంబంధించిన విడియోఒకటి వైరల్‌అయింది. మొరాదాబాద్‌లోని బిలారి బ్లాక్‌లో ఉత్తరప్రదేశ్ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఓ టోర్నమెంట్‌ను నిర్వహించింది. బిలారిలోని చక్కె మిల్లు మైదానంలో ఆదివారం మొరాదాబాద్, సంభాల్ జట్లు తలపడ్డాయి. మొరాబాద్ మొదటబ్యాటింగ్ చేసింది. ఛేదనలో సంభాల్ విజయానికి చివరి నాలుగు బంతుల్లో 14 పరుగులు అవసరం అయ్యాయి. మొరాదాబాద్ ఫాస్ట్ బౌలర్ అహ్మద్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో.. సంభాల్ జట్టు 11 పరుగుల తేడాతో ఓడిపోయింది. చివరి బంతి పడగానే మొరాదాబాద్ ప్లేయర్లు సంబరాల్లో మునిగిపోయారు అహ్మద్ మాత్రం తీవ్ర అస్వస్థతతో మైదానంలో కుప్పకూలాడు.

అహ్మద్‌ఖాన్ శ్వాసతీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడ్డాడు. భయాందోళనకు గురైన మొరాదాబాద్ ఆటగాళ్లు వెంటనే చికిత్స అందించారు. అక్కడే ఉన్న వైద్యుడు మైదానంలో అతడికి సిపిఆర్ చేశాడు. దాంతో అహ్మద్ కాస్త కుదుటపడ్డాడు. ఆ తర్వాత అతన్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రిలో వైద్యుడు పరిశీలించగా.. అహ్మద్ అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనలో మ్యాచ్ గెలిచిన ఆనందం శోకసంద్రంగా మారింది. అహ్మద్ స్థానిక మొరాదాబాద్ జట్టుకు సీనియర్ బౌలర్ అని, చాలా యేళ్లుగా క్రికెట్‌లో చురుగ్గా పాల్గొంటున్నాడని టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు.

# సరిహద్దుల్లో భద్రత మరింత పెంపు

## కీలక మార్గాల మూసివేత



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ఉగ్ర చొరబాట్ల కట్టడికి భారత సైన్యం కీలక చర్యలు తీసుకొనేందుకు సిద్ధమైంది. శీతాకాలం రాబోతున్న నేపథ్యంలో పాకిస్తాన్ సరిహద్దుల్లోని నియంత్రణ రేఖ వెంబడి భద్రతను మరింత పెంచుతోంది. ఇందులో భాగంగా కీలక మార్గాలు మూసివేసింది. అదనపు బలగాలను మొహరించినట్లు తెలుస్తోంది. పహల్గాం దాడిని దృష్టిలో పెట్టుకుని సరిహద్దుల్లోని భద్రతను పునరుద్ధరిస్తోంది. ఈ మేరకు విశ్వసనీన వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనం వెల్లడించింది. సాధారణంగా కశ్మీర్ లోయలో శీతాకాల సమయంలో మంచు దట్టంగా కురుస్తుంది. ఆ సమయంలో కీలక మార్గాల్లో భద్రత పర్యవేక్షణ కష్టంగా మారుతుంది. ఎత్తైన ప్రాంతాల్లో నిఘాకు సవాళ్లు ఎదురవుతాయి. దీన్ని అవకాశంగా తీసుకుని చలికాలానికి ముందు ఉగ్ర చొరబాట్ల ఘటనలు పెరుగుతాయి. వీటిని నియంత్రించేందుకే సరిహద్దుల్లో ఆర్మీ భద్రతను కట్టుదిట్టం చేస్తోంది. నియంత్రణ రేఖ వెంబడి కంచెను కట్టుదిట్టం చేయడంతో పాటు ఈ ప్రాంతంలో అదనపు దళాలను మోహరిస్తోంది. ఇక సరిహద్దులను ఆనుకుని ఉండే కొన్ని కీలక మార్గాలను మూసివేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక, థర్మల్ ఇమేజర్లు, అధునాతన కెమెరాలు, చిన్న చిన్న డ్రోన్లతో చొరబాటు యత్నాలను తిప్పికొడుతున్నట్లు ఆర్మీ విశ్వసీన వర్గాలు వెల్లడించాయి. గతంలో ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి రద్దీ ప్రాంతాలకు దూరంగా ఒక రహస్యప్రాంతంలో దాక్కొన్న సందర్భాలున్నాయి. కానీ, ఇటీవల ఉగ్రవాదులు తమ పంథా మారుస్తున్నారు. రద్దీ ప్రదేశాలకు దగ్గరగా రెండు,మూడు రహస్య ప్రాంతాల్లో నక్కి తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఇక, భద్రతా సిబ్బంది నిఘా నుంచి తప్పించుకునేందుకు సామాన్య పౌరులవలే స్థానిక మొబైల్ నెట్‌వర్క్‌నువాడి కమ్యూనికేషన్ చేసుకుంటున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. దీంతో దేశంలోకి చొరబడిన తర్వాత వారిని పట్టుకోవడం సమస్యగా మారుతోంది. అందుకే వీరు దేశంలోకి రాకుండా చొరబాట్లను అడ్డుకుని సరిహద్దుల వద్దే పట్టుకోవాలని ఆర్మీ భావిస్తోంది.

# మద్యం కుంభకోణానికి పాల్పడింది వైసీపీ నేతలు

## తణుకు ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ విమర్శలు



**తణుకు, అక్టోబర్ 13(ప్రభాత వార్త):** మద్యం కుంభకోణానికి పాల్పడింది గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి అనుచరులు కాదా అని తణుకు ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ ప్రశ్నించారు. సోమవారం తణుకు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైసీపీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ మేరకు సోమవారం కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నకిలీ మద్యం తయారు చేసి ప్రజలకు సరఫరా చేశారని గుర్తు చేశారు. కోవిడ్ సమయంలో నకిలీ మద్యాన్ని విక్రయించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడారని విమర్శించారు. అప్పట్లో ఎంతో మంది కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధులతో ఎంతో మంది మృత్యువాత పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 27 మంది మృతి చెందితే ఆనాడు మంత్రి హోదాలో ఉండి కారుమూరి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజల గురించి మాట్లాడే హక్కు కారుమూరికి లేదన్నారు. మద్యం కుంభకోణంలో కారుమూరి కుమారుడి పేరు కూడా తెరపైకి వచ్చిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నకిలీ మద్యం తయారు చేసేవారి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ప్రభుత్వ చర్యలు తీసుకుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాములకు వంట సామాగ్రి అందజేత



**చాట్రాయి, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** మండలంలోని పోలవరం గ్రామంలోని అయ్యప్ప స్వాములకు వంట సామాగ్రి ని చాగంటి పాపయ్య మెమోరియల్ ట్రస్ట్ తరఫున సోమవారం అందజేశారు. పోలవరం శివాలయంలో నేటి నుండి జరిగే అయ్యప్ప స్వాముల అన్న సమారాధనికి చాగంటి పాపయ్య మెమోరియల్ సొసైటీ తరఫున వారి మనవళ్ళు సుమారు 40 వేల రూపాయల విలువగల వంట సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో చాగంటి నరసింహారావు చాగంటి శ్రీనివాసరావు, చాగంటి వాసుదేవరావు తదితర కుటుంబ సభ్యులు మరియు ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు అయ్యప్ప గురు స్వామి శ్రీను స్వామి పాల్గొన్నారు.

# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# ఆ రాష్ట్రానికే పోలీస్ బాస్.. ఆయనే రావాడ ఆజాద్ చంద్రశేఖర్





భీమవరం అక్టోబర్ 13 ప్రభాతవార్త :ఒకనాడు వీరవాసరం హైస్కూల్లో ఆయనో విద్యార్థి.. ఇప్పుడు భారతదేశంలోనే సంపూర్ణ అక్షరాస్యతతో ఎంతో జ్ఞాన, మేధోసంపత్తి కలిగిన కేరళ రాష్ట్రానికి పోలీస్ బాస్. ఆయన స్ఫూర్తితో ఉన్నతశిఖరాలను అధిరోహించి మంచి స్థాయికి ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థ "పార్డ్ ఇండియా" ముందుకొచ్చింది. ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమ వివరాలను సంస్థ కోఆర్డినేటర్ వి.వి.వి.ప్రసాద్ సోమవారం పత్రికా విలేకరులకు తెలియజేశారు. వీరవాసరమైన వీరవాసరానికి చెందిన రావాడ ఆజాద్ చంద్రశేఖర్ కేరళ రాష్ట్ర డీ జీ పీ గా అత్యున్నత స్థాయికి చేరిన సందర్భంగా బుధవారం వీరవాసరంలో పౌర సన్మానం జరుగనుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని చంద్రశేఖర్ ఐపీఎస్ చదువుకున్న హైస్కూల్లోని విద్యార్థులకు "నేటి సమాజంలో విద్య ఆవశ్యకత, ప్రాముఖ్యత" గురించి పార్డ్ ఇండియా జాతీయ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు తెలియజేస్తారు. పట్టుదలతో కష్టపడి కాకుండా ఇష్టపడి అవిశ్రాంత కృషితో చదివిన వారు ఏ విధంగా ఉన్నతస్థాయికి వెళతారో చంద్రశేఖర్ ఐపీఎస్ ఓ ప్రత్యేక ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. ఇదే విషయంపై విద్యార్థుల్లో ప్రేరణ కలిగేలా అత్యుత్తమ ప్రతిభ కలిగిన ముగ్గురు విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు చంద్రశేఖర్ ఐపీఎస్ వారి చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్డ్ ఇండియా ముఖ్యప్రతినిధులు మహ్మద్ ఇలియాస్ షరీఫ్, సోమశెట్టి వెంకట్రావు, వీరవాసరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాస్, ఇంచార్జి ఎస్.వి.ఎస్.కె.ప్రసాద్, బోను అప్పాజీ, బాజంకి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ ఫలాలు ప్రజలకు మరింత చేరువ కావాలి

## - పండుగ వాతావరణంలో హేలాపురి ఉత్సవాలు...గ్రాండ్ షాపింగ్ ఫెస్టివల్

## - కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ



**ఏలూరు, ప్రభాతవార్త :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కలిగినప్పుడే సదరు కార్యక్రమం ఉద్దేశ్యం నెరవేరుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక గిరిజన భవన్ లో సోమవారం సాయంత్రం పండుగ వాతావరణంలో జరిగిన హేలాపురి ఉత్సవాలు...గ్రాండ్ షాపింగ్ ఫెస్టివల్ ను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జీఎస్టీ ఫలాలను ప్రజలకు మరింత చేరువ చేసేలా ప్రతీ ఒక్కరికీ అవగాహన కలిగించాలన్నారు. హేలాపురి ఉత్సవాలు...షాపింగ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ముందుగా సర్. సి.ఆర్. రెడ్డి డిగ్రీ కళాశాల గ్రౌండ్స్ లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, సోమవారం వచ్చిన భారీ వర్షాల కారణంగా తాత్కాలికంగా గిరిజన భవన్ లో నిర్వహిస్తున్నామని, వాతావరణంలో మార్పు వచ్చిన తరవాత తిరిగి సర్. సి.ఆర్. రెడ్డి డిగ్రీ కళాశాల గ్రౌండ్స్ లో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ పై గత మూడు వారాలుగా జిల్లాలో అన్ని శాఖలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. షాపింగ్ ఉత్సవంలో పెద్ద ఎత్తున స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, వీటిలో ప్రజలకు అవసరమైన వస్తువుల స్టాల్స్ ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ప్రజలను మరింత ఉత్సాహపరిచేందుకు హేలాపురి ఉత్సవం సమయంలో అధిక మొత్తంలో షాపింగ్ చేసిన వారి పేర్లను ఉత్సవం చివరి రోజున డ్రా తీసి ముగ్గురికి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ తాము కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం 8వేల కోట్ల రూపాయలకు పైగా ఆదాయం కోల్పోతున్నప్పటికీ ప్రజల కొనుగోలు శక్తిని మరింత పెంచేలా జీఎస్టీ రేట్లను తగ్గించిందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జీఎస్టీ సంస్కరణలపై ఏలూరు జిల్లా ప్రజలలో



పూర్తిస్థాయిలో అవగాహన కలిగిందన్నారు. తాను ఈ కార్యక్రమ ప్రాంగణంలో కొంతమంది ప్రజలను జీఎస్టీ సంస్కరణలపై అడిగానని, వారు చక్కగా జవాబు చెప్పారన్నారు. కార్యక్రమంలో వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమీషనర్ నాగార్జునరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, ఉప రవాణా కమీషనర్ షేక్ కరీం, ఏలూరు నగరపాలక కమీషనర్ ఏ . భానుప్రతాప్,





కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ జి. నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రభృతులు పాల్గొన్నారు.



# “ప్రజలే ప్రాధాన్యం” పితాని గారి పల్లె పర్యటనలో స్పష్టమైన సందేశం



పెనుగొండ అక్టోబర్ 13 ప్రభాతవార్త :పెనుగొండ మండలం సోమరాజు చెరువు, కొఠాలపర్రు గ్రామాల్లో సోమవారం “పల్లె పల్లెకు మన పితాని” కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు వివరించిన సమస్యలపై వెంటనే స్పందించిన పితాని , సంబంధిత శాఖల అధికారులకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా: స్మశానవాటిక సమస్య పరిష్కారానికి గ్రామంలోని ప్రభుత్వ భూములపై తక్షణ సర్వే చేయాలని తహసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చారు. 100% అంగవైకల్యం కలిగిన వారికి రూ. 15,000 ఆర్థిక సహాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు ద్వారా రైతులకు భరోసా కల్పించామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలవుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెనుగొండ మండల క్రీడా పోటీలలో భాష్యం విద్యార్థుల ప్రతిభ:

పెనుగొండ, అక్టోబర్ 13 ప్రభాత వార్త: పెనుగొండ మండల స్థాయి క్రీడా పోటీలలో భాష్యం విద్యా సంస్థకు చెందిన 35 మంది విద్యార్థులు వివిధ క్రీడా విభాగాలలో అద్భుత ప్రతిభ కనబరిచి జోనల్ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎన్.వి. అప్పారావు మాట్లాడుతూ, “విద్యార్థుల క్రీడా నైపుణ్యం, పట్టుదల, శిక్షణ ఫలితంగా ఈ ఘనత సాధ్యమైంది. జోనల్ స్థాయిలో కూడా వారు మెరిసేలా ప్రోత్సహించబడతారు” అని తెలిపారు. మండల స్థాయిలో భాష్యం విద్యార్థుల ప్రదర్శన స్థానికంగా ప్రశంసలు పొందుతోంది. సంస్థ తరపున విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబర్చేలా ప్రోత్సహించనున్నట్లు స్కూల్ యాజమాన్యం పేర్కొంది.



# మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

## నవంబర్ 3 నుండి సమ్మెకు సిద్ధం

**తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త:** సుదీర్ఘకాలంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాపిత పిలుపుమేరకు నవంబరు 3వ తేదీ నుంచి సమ్మెకు సమాయత్తమవు తున్నట్టు ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్షులు ఓ వి రాజు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ వాసు చెప్పారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తాడేపల్లిగూడెం శాఖ ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిగూడెం మున్సిపల్ కమీషనర్ ఎం ఏసుబాబు కు సమ్మె నోటీసు సమర్పించారు. ఈసందర్భంగా ఓ వి రాజు తాడికొండ వాసు మాట్లాడుతూ 12వ పీఆర్సీ ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరణించిన, రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులను అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని,మున్సిపల్ కార్పోరేషన్ నగర పంచాయతీల్లో పెరుగుతున్న విస్తీర్ణంకు అనుగుణంగా కార్మికుల నిష్పత్తి పెంచాలని,డైలీ వేజ్ కార్మికులను అవుట్ సోర్సింగ్ లోకి



తీసుకోవాలని, పర్మినెంట్ కార్మికుల పెడింగ్ బకాయిలు విడుదల చేయాలని,మున్సిపల్ కార్మికుల బ్యాంకు ఖాతాలు బలవంతంగా యాక్సిస్ బ్యాంకుకు మార్చరాదని, కార్మికుల పదవీవిరమణ వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, కార్మికులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చి మున్సిపల్ కాలనీలు నిర్మించాలని తదితర డిమాండ్స్ పరిష్కారం కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చినట్టు చెప్పారు. ఏఐటియుసి తాడేపల్లిగూడెం ఏరియా వర్కింగ్ ప్రెసిడెంట్ కలింగ లక్ష్మణరావు కొడమంచిలి ముత్యం మార్లపూడి కాటమరాజు అల్లం కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# బాణసంచా వ్యాపారులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

## తనిఖీ చేసిన జాయింట్ యాక్షన్ కమిటీ

**కైకలూరు అక్టోబర్ 13 (ప్రభాతవార్త) :**దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు భద్రతా ప్రమాణాలు పాటించాలని కైకలూరు జాయింట్ యాక్షన్ కమిటీ తెలిపింది. కైకలూరు మార్కెట్ యార్డ్ నందు ఏర్పాటుచేసే బాణసంచా దుకాణాల మైదానాన్ని సోమవారం జాయింట్ యాక్షన్ కమిటీ కైకలూరు రూరల్ సీఐ వి రవికుమార్, తాసిల్దార్ లతీఫ్ భాష, అగ్నిమాపక ఎస్సై కే క్రాంతి కుమార్, టౌన్ ఎస్సై ఆర్ శ్రీను లు పరిశీలించారు. ముందుగా షాప్ యజమానులకు భద్రతా ప్రమాణాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.లైసెన్సు కు అనుగుణంగా పరిమితులు, మరియు నిల్వ ప్రాంతం యొక్క భద్రతను పరిశీలించారు.అగ్నిమాపక మార్గదర్శకాలు క్రాకర్ దుకాణాలకు అగ్నిమాపక శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా దుకాణ యజమానులకు జాయింట్ యాక్షన్ కమిటీ పలు సూచనలు చేశారు.భద్రతా నియమాలను ఉల్లంఘించిన దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనుమతి లేని లేదా ప్రమాదకరమైన బాణసంచా అమ్మకాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు.ఎటువంటి అగ్ని ప్రమాదం



సంభవించినా తక్షణమే పోలీసులకు మరియు అగ్నిమాపక విభాగానికి సమాచారం అందించాలని సూచించారు.

# రాష్ట్రంలో కుటీర పరిశ్రమగా కల్తీ మద్యం తయారీ

## - మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆరోపణ

## - తణుకు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా



**తణుకు, అక్టోబర్ 13(ప్రభాత వార్త):** చంద్రబాబు కూటమి ప్రభుత్వం మద్యాన్ని కుటీర ఈపరిశ్రమగా మార్చి పేద ప్రజల జీవితాలతో ఆటలాడుతోందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు కనుసన్నల్లో అన్నీ కూడా నకిలీలే నడుస్తున్నాయని, కల్తీ మద్యం వలన కిడ్నీలు, లివర్లు పాడైపోయి ఆస్పత్రుల పాలైపోతున్నారని అన్నారు. కల్తీ మద్యం విక్రయాలను అరికట్టాలంటూ తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సోమవారం ్యనిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యం తాగడం వలన అధికశాతం లివరు పాడైపోయి వస్తున్నారని వైద్యులే చెబుతున్నారని విమర్శించారు.ే ల్టు వుంటే తాట తీస్తానన్న చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా బెల్టు దుకాణాలను ప్రోత్సహిస్తూ అధికసంఖ్యలో మద్యం విక్రయాలు జరిగేలా సహకరిస్తున్నారని విమర్శించారు. ఒక్క తణుకు నియోజకవర్గంలోనే 156 బెల్టు దుకాణాల వరకు నిర్వహణ చేస్తున్నారంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని బెల్టు దుకాణాలు ఉన్నాయి, ఎన్ని కల్తీ మద్యం కుటీర పరిశ్రమలు ఉన్నాయో తెలియాల్సి ఉ ందన్నారు. మద్యం దుకాణాల ఆవరణల్లోనే రూంలు ఏర్పాటుచేసి బలవంతంగా తాగించేస్తున్నారని, తణుకులో ఒక మద్యం దుకాణం ఆవరణలో ఒక వ్యక్తి తాగిపడి చనిపోతే అయినప్పటికీ అక్కడ తాగించేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం లిక్కరు స్కాం

7వ పేజీలో

# కాల్వలో పడి గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

**తణుకు, అక్టోబర్ 13(ప్రభాత వార్త):** తణుకు మండలం పైడిపర్రు కాలువలో పడి గల్లంతైన బాలుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. తణుకు పట్టణానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి బొమ్మబోయిన జోగేంద్ర నందు (13) కాలువలో పడి గల్లంతు అయిన విషయం తెలిసిందే. అత్తిలి మండలం గుమ్మంపాడు లాకుల వద్ద నందు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తణుకు పట్టణంలోని బ్యాంకు కాలనీలో నివాసం ఉంటున్న బొమ్మనబోయిన జోగేంద్ర నందు ఆదివారం తన స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు తణుకు మండలం పైడిపర్రు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో కాలువ రేవులోకి దిగి స్నానం చేసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తూ కాల్వలో పడి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి తణుకు రూరల్ పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. తణుకు రూరల్ ఎస్సై కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సోలార్ ఇన్ స్ట లేషన్ ప్రోగ్రాం ప్రారంభించిన, ఎమ్మెల్యే నాయకర్

**మొగల్తూరు అక్టోబర్ 13 (ప్రభాత వార్త)** :శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీ వారిచే ఏర్పాటు చేయబడిన సోలార్ ఇన్స్టాలేషన్ ప్రోగ్రాం యొక్క నూతన వ్యాపార ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమం ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, మరియు టిడిపి ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు హాజరయ్యారు, సోలార్ రంగంలో సరికొత్త వ్యాపారానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా, ఈ కార్యక్రమానికి జనసేన టిడిపి బిజెపి కార్యకర్తలు ప్రజాప్రతినిధులు స్థానికులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# పెనుగొండలో కుండపోత వర్షం: జనజీవనం స్తంభించింది

**పెనుగొండ అక్టోబర్ 13 ప్రభాత వార్త :** పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షం ప్రజల జీవనాన్ని పూర్తిగా స్తంభింపజేసింది. తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యార్థులు, ప్రయాణికులు, చిరు వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లే వారు వర్షం కారణంగా ఇళ్లకే పరిమితమయ్యారు. గ్రామాల నుంచి పట్టణాలకు వచ్చేవారు కూడా రవాణా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. స్థానికులు వర్షం తగ్గే వరకు బయటకు రావడానికి వెనుకాడుతున్నారు. ప్రభుత్వం మరియు స్థానిక అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ, అత్యవసర సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వర్షం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని



సూచిస్తున్నారు.

# సూపర్ సేవింగ్స్, సూపర్ జి ఎస్ టి

భీమవరం అక్టోబర్ 13 ప్రభాతవార్త :సూపర్ సేవింగ్ సూపర్ జిఎస్టి కార్యక్రమం సోమవారం డోర్ టు డోర్ మూడవ వార్డులో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, భీమవరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము చల్లబోయిన గోవిందరావు వార్డ్ ప్రెసిడెంట్ సెక్రటరీ లో యాతం రాఘవులు అమర్ బాబు, ఎన్ గంగాధర తిలక్ యలమంచిలి శ్రీను, తిరుపతిరావు నక్క గోవింద్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ధన్వంతరి జయంతోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

భీమవరం అక్టోబర్ 13 ప్రభాతవార్త : ఈనెల 17 నుంచి భీమవరంలో నాయి బ్రాహ్మణ జెఏసి ఆధ్వర్యంలో శ్రీధన్వంతరి జయంతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా నాయి బ్రాహ్మణ జేఏసి ప్రెసిడెంట్ పట్నాల గణపతి (తాడేపల్లిగూడెం), జెఏసి భీమవరం అధ్యక్షులు కోడూరి రామకృష్ణ తెలిపారు. సోమవారం భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ధన్వంతరి జయంతోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. మొదటి ఆయుర్వేద వైద్యుడు ధన్వంతరి అని, వ్యాధుల నివారణకు ధన్వంతరి ఎంతగానో కృషి చేశారని, ఆయుర్వేద వైద్యరంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఉచిత హెూమియో,



ఆయుర్వేదం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెఏసి గౌరవాధ్యక్షులు డా పిప్పళ్ల ప్రసాద్, మల్లువలస సత్యనారాయణ (ఉండి), గౌరవ సలహాదారులు మల్లువలస రాము, ఆర్గనైజింగ్ కార్యదర్శి పొట్నూరి శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తపాలా శాఖలో అందుబాటులోకి కొత్త కొత్త సేవలు

### - ఈనెల 14న పోస్టల్ కార్యాలయంలో స్టాంపులు, నాణాల ప్రదర్శన

భీమవరం అక్టోబర్ 13 ప్రభాతవార్త :ఉత్తరానికి నాటి తరానికి ఎంతో అవినాభావ సంబంధం ఉండేదని, మానవ సంబంధాలను బలోపేతం చేయడానికి ఉత్తరం ఎంతో ఉపయోగపడేదని, నాటి తరంలో తమ బంధువుల యోగక్షేమాలు తెలుసుకునేందుకు ఉత్తరం కోసం ఎదురుచూసిన క్షణాలు మాధురానుభూతిని పంచేవని భీమవరం పోస్టల్ యూనియన్ లీడర్ లెనిన్ బాబు అన్నారు. భీమవరం సర్ సివి రామన్ స్కూల్లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోస్టల్ సంక్షేమ పథకాలపై అవగాహన, కరపత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. లెనిన్ బాబు మాట్లాడుతూ తపాలా శాఖ ప్రస్తుతం నూతన సాంకేతికత వినియోగించుకుంటూ కొత్త కొత్త సేవల ద్వారా ప్రజలకు సేవలందిస్తుందని, పోస్టల్ శాఖలో అందించే సేవలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. స్కూల్ ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ కె పార్వతి మాట్లాడుతూ తపాల శాఖ ద్వారా అందిస్తున్న



సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పోస్టల్ శాఖలో వివిధ రకాల పాలసీలున్నాయని, ఐపీఎల్, ఐపీఈఎల్ , సుకన్య సమృద్ధి యోజన, పోస్ట్ ఆఫీస్ సేవలు ఎన్నో ఉన్నాయని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం భీమవరం హెడ్ పోస్ట్ కార్యాలయంలో దేశ విదేశాల స్టాంపులు నాణాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం శైలజ, ఎన్ రాధా, మాజీ కౌన్సిలర్ విజ్జురోతి రాఘవులు విద్యార్థులు పాల్గొన్నారు.

## శివరావుపేట శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు ఊరేగింపు

పెనుమంట్ర- ప్రభాతవార్త :మండలంలోని మార్టేరు శివరావుపేట శ్రీ కనకదుర్గమ్మను శరన్నవరాత్రులు అనంతరం సోమవారం భారీగా ఊరేగించారు. తీన్మార్ డాన్స్ లు బుట్ట బొమ్మల గరగలతో ఉదయం నుండి సాయంత్రం వరకు అమ్మవారిని పురవీధులను ఊరేగించారు. కమిటీ ప్రెసిడెంట్ తేతలి రాజారెడ్డి కమిటీ సభ్యులు ఊరేగింపులో అన్ని ఏర్పాట్లును పర్యవేక్షించారు. ఊరేగింపులో బుట్ట బొమ్మలు, కాంతార వేష దారణాలు ఆకట్టుకున్నాయి. త్వరలో అన్నదానం నిర్వహిస్తామని రాజారెడ్డి తెలిపారు.



## 17న ఇరగవరం మండల పరిషత్ సమావేశం

అత్తిలి/ ఇరగవరం- అక్టోబర్ 13 (ప్రభాతవార్త ):ఇరగవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఏ. శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు సర్పంచులు అధికారులు ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు.

## పడమటిపాలెంలో రైతు శిక్షణా కార్యక్రమము,

పెనుమంట్ర-ప్రభాతవార్త : ఆచంట మండలం ఆచంట వేమవరం శివారు గ్రామం పడమటిపాలెంలో మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమము సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పరిశోధనా స్థానం సీనియర్ ప్రొఫెసర్ డా. ఎస్. దయాకర్ మాట్లాడుతూ సార్వా వరిలో ఆశించే దోమ పోటు ఎక్కువగా రావడానికి అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడటం, పంట తొలి దశలో విచక్షణారహితంగా సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు వాడటం ప్రధాన కారణమని తెలిపారు. పురుగుల నియంత్రణ కొరకు వివిధ రకాల పురుగు మందులు కలిపి పిచికారీచేయడం వల్ల సాగు ఖర్చు పెరిగిపోవడం తో పాటూ పురుగు నివారణ సరిగా జరగదని తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త డా.సి. హెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కంబైండ్ హార్వెస్టర్ తో కోత కోసిన పొలాలలో గడ్డి తగులబెత్తకుండా, నేలలో కలియదున్నడం వల్ల సుమారు 25% రసాయన ఎరువుల అవసరత తగ్గుతుందని తెలిపారు. అంతేకాక 3, 5 సంవత్సరముల పాటు వరి గడ్డిని నేలలో కలయదున్నడం వల్ల భూమిలో సేంద్రీయ కర్బనం గణనీయం



పెరగుతుందన్నారు. డా.ఎం, గిరిజారాణి, ప్రధాన శాస్త్రవేత్త (వరి) మాట్లాడుతూ దాళ్వా రకాలైన ఎం.టి.యు 1293, ఎం.టి.యు 1282 రకాలు నవంబర్ నెలాఖరుకల్లా రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరో చిరు సంచి రకం ఎం.టి.యు 1426 కూడా కొద్ది మొత్తంలో రైతులకు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.వి.భువనేశ్వరి, డా.ఎన్.శ్రీనివాస్, డా.పి, వి, రమేష్ బాబు, డా,సి,హెచ్ అప్పారావు,గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు శ్రీ నెక్కంటి రామకృష్ణ, శ్రీ చిలుకూరి లక్ష్మీనారాయణ, దొమ్మేటి జనార్ధన రావు పాల్గొన్నారు.

## మొగల్తూరు లయన్స్ క్లబ్ సభ్యులు ప్రమాణ స్వీకారం

మొగల్తూరు అక్టోబర్ 13 (ప్రభాతవార్త) స్థానిక వివేకా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు సోమవారం మొగల్తూరు లయన్స్ క్లబ్ సభ్యులు ప్రమాణ స్వీకారం జరిగింది, లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు, యు రాంబాబు, ఏపీపీ ఎస్సీ, స్టేట్ సెక్రటరీగా, మరియు ప్రస్తుత కార్యదర్శి, ఎల్ ఎన్, టి రామకృష్ణ ను, పశ్చిమ గోదావరి జిల్లా హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేశారు, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గా ఎల్ ఎన్, యు గీత షారోన్ పుష్ప, ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులకు మొగల్తూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన



సన్మానం చేశారు, ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## వన మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు

మొగల్తూరు అక్టోబర్ 13 ( ప్రభాతవార్త) మొగల్తూరు గ్రామం లో శ్రీ వన మల్లికార్జున స్వామి వారి ఆలయం నందు ఉదయం శివుని జన్మ నక్షత్రం ఆరుద్ర నక్షత్రం కావడంతో సోమవారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారు. మొగల్తూరు గ్రామం నలుమూలల నుండి భక్తులు ఆలయానికి పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.

## కావల నాగేశ్వరరావు కు సొలెట్ ఇంటర్నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డ్

భీమవరం అక్టోబర్ 13 ప్రభాతవార్త: భీమవరం లోని కేజీఆర్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ డైరెక్టర్ డా. కావల నాగేశ్వరరావు , సొలెట్ ఇంటర్నేషనల్ అవార్డ్స్- 2025 లో భాగంగా ప్రదానం చేసిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ టీచర్ అవార్డ్ %-% 2025ను అందుకున్నారు. ఈ అవార్డును సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్, విజయవాడ, ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా డా. బుద్ధ చంద్రశేఖర్, సీఈఓ అనువాదిని ఎ ఐ, చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్, ఎ ఐ సి టి ఇ,విద్యామంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం హాజరై పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రత్యేక అతిథ్యంగా ప్రొఫెసర్ ఎస్. విజయభాస్కర్, ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ పాల్గొన్నారు.డా. కావల నాగేశ్వరరావు గారు ఫార్మసీ విద్యా రంగంలో 25 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన ప్రముఖ విద్యావేత్త. విద్యా నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచడంలో, పరిశోధనాభివృద్ధి, విద్యార్థులలో నైతిక విలువలు మరియు సామాజిక బాధ్యతా చైతన్యం




పెంపొందించడంలో ఆయన విశేష కృషి చేశారు. ఆయన మార్గదర్శకత్వంలో కేజీఆర్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, పశ్చిమ గోదావరి జిల్లాలో మాత్రమే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా అత్యుత్తమ విద్యాసంస్థగా గుర్తింపు పొందింది. ఈ సందర్భంలో డా. కావల నాగేశ్వరరావు గారు మాట్లాడుతూ, "ఈ అవార్డు నా వ్యక్తిగత విజయమేమీ కాదుబీ ఇది మా కళాశాల బృందం, అధ్యాపకులు, విద్యార్థులు, మరియు నిర్వాహకుల సమిష్టి కృషికి దక్కిన గౌరవం" అని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్, బోధక ,బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు డైరెక్టర్ గారిని అభినందిస్తూ ఆయన సాధనపై గర్వం వ్యక్తం చేశారు.

## కార్తీక మాసంలో దేవాలయాలు శోభాయమానంగా సిద్ధం చేయాలి.

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

భీమవరం అక్టోబర్ 13 ప్రభాతవార్త :సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం అనంతరం దేవాదయ శాఖ, మున్సిపల్, మెడికల్, పంచాయతీ, మత్స్య శాఖ అధికారులతో కార్తీక మాసం ఏర్పాట్లపై సమీక్షిస్తూ, అక్టోబర్ 22 నుండి ప్రారంభం కానున్నదన్నారు. హిందువులు పరమ పవిత్రమైన మాసంగా భావించే కార్తీక మాసంలో భక్తులకు ఏ విధమైన ఇబ్బంది లేని విధంగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. రంగులు వేయడం, చిన్న చిన్న మరమ్మత్తులు చేయించడం, రంగురంగు దీపాలతో అలంకరించడం, క్యూ లైన్ లు ఏర్పాటు వంటివి చేయాలని సూచించారు. గునుపూడి సోమేశ్వర స్వామి దేవాలయానికి వెళ్లే రహదారి మరమత్తులను వెంటనే చేపట్టాలని భీమవరం మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే కార్తీక మాసంలో సముద్ర స్నానాలను ఆచరించడం కూడా జరుగుతుందని, పేరుపాలెం బీచ్ లో ఇందుకు తగిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. బారికేటింగ్ ఏర్పాటు,



సీసీటీవీలు, తాత్కాలిక మరుగుదొడ్లు, స్త్రీలు బట్టలు మార్చుకునే గదులు, స్విమ్మర్స్, మెడికల్ క్యాంపులు, పారిశుద్ధ్యం ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బీచ్ లో స్నానం ఆచరించే వారికి ప్రమాదాలు జరగకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, హెచ్చరిక బోర్డులను కూడా పెట్టాలని సూచించారు.సమావేశంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి, డిపిఓ, డిఎంహెచ్వో, భీమవరం మున్సిపాలిటీ మేనేజర్, మత్స్య శాఖ ఏడి, తదితరులు పాల్గొన్నారు.

## పెనుమంట్ర నూతన ఎంపీడీవో గా కృష్ణమూర్తి బాధ్యతలు స్వీకరణ,

పెనుమంట్ర ప్రభాతవార్త :పెనుమంట్ర మండల నూతన మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (పూర్తి అదనపు బాధ్యతలు) పంచాయతీ రాజ్ సబ్ డివిజన్, పెనుమంట్ర - డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ ఎన్ వి ఎల్ జె కృష్ణ మూర్తి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో గా ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ మండల అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. నూతన ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## సస్పెండ్ అయిన జయ చంద్రారెడ్డి వైకాపా నుండే వచ్చారు!

### రాధాదేవి భూపతి రాజు



పెనుమంట్ర ప్రభాతవార్త :నకిలీ మద్యం విషయంలో టిడిపి నుండి సస్పెండ్ అయిన జయచంద్రా రెడ్డి ఎన్నికల ముందు వైకాపా నుండి టిడిపికి వచ్చారని, నకిలీ మద్యంలో ఆయన ప్రమేయం ఉండడం వల్లే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జయ చంద్రారెడ్డిని సస్పెండ్ చేశారనే విషయాన్ని జడ్పిటిసి కర్రి గౌరీ సుభాషిణి గుర్తించాలని మండల టిడిపి మహిళ అధ్యక్షురాలు భూపతిరాజు రాధాదేవి తెలిపారు. సోమవారం పెనుమంట్రలో రాధాదేవి మాట్లాడుతూ నకిలీ మద్యం సూత్రధారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటూ మండల జడ్పిటిసి కర్రి గౌరీ సుభాషిణి చేసిన వ్యాఖ్యలను రాధ దేవి తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో సిట్ ఎంక్వయిరీ కూడా వేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో నకిలీ మద్యం షాపుల్లోకి రాకుండా ఉండడానికి ఒక కొత్త ఆలోచనతో నకిలీ మద్యం గుర్తింపునకు 'ఏపీ ఎక్సైజ్ సురక్ష 'పేరుతో ప్రత్యేక యాప్ ను కూడా విడుదల చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ప్రభుత్వంలో జరిగిన నకిలీ బ్రాండ్ల మద్యం అమ్మకాలపై సిట్ విచారణ వెయ్యడం కూడా జరిగిందన్నారు. ఇప్పటికే చాలామంది నిందితులను అరెస్టులను కూడా చేయడం జరిగింది. త్వరలోనే వేల కోట్ల అవినీతికి పాల్పడిన మద్యం దొంగలు జైలుకెళ్లడం ఖాయమని తెలిపారు.

## కొలువుతీరిన కొత్త ఉపాధ్యాయులు ౦నాణ్యమైన విద్యను అందించండి

### - ఎంఈఓ శ్రీనివాస్

చాట్రాయి, అక్టోబర్ 13, ప్రభాతవార్త ఇటీవల డీఎస్సీలో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు చాట్రాయి మండలంలో కొలువు తీరారు. ఈ మేరకు చాట్రాయి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ నియామక ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు వివిధ పాఠశాలల్లో పర్యటించి నూతన ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. చాట్రాయి మండలం లో ఎప్పటినుండో పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు మెగా డీఎస్సీ ద్వారా భర్తీ అయ్యాయని మండల విద్యాశాఖాధికారులు మాసగిరి శ్రీనివాస్, బ్రహ్మాచారి పేర్కొన్నారు. చాట్రాయి మండలం లో 37 ఎస్ జి టి పోస్టు ఖాళీ గా ఉన్నాయి అని అవి భర్తీ అయ్యాయని,22 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు హైస్కూల్, అప్పర్ ప్రైమరీ పాఠశాలలో భర్తీ అయినట్లు వారు వివరించారు. దీనితో పాఠశాల లకు టీచర్స్ కొరత లేదని తెలిపారు. చాట్రాయి మండలం లో అన్ని పాఠశాల లకు కొత్త గురువులు వచ్చారన్నారు. నూతనంగా విధులు చేపట్టిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు



తెలియచేసారు. అదే విదంగా విద్యా వ్యవస్థ ను పటిష్టంగా నిర్వహించడం, పాఠాలు సక్రమంగా బోధించడం గురించి వారికి తెలియచేసారు. సమయపాలన ముఖ్యం గా పాటించాలి అని, పాఠశాల పరిరక్షణ ముఖ్యం గా పనిచేయడం మీ ధర్మం అని చెప్పారు. పోలవరం యువకుడికి కోటపాడు లో పోస్ట్ :

చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన లింగోజు భార్గవ మణికంఠ చారికి మండలంలోని కోటపాడు మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పోస్ట్ సాధించారు. చాట్రాయి మండలానికి చెందిన వ్యక్తి చాట్రాయి మండలంలోనే పోస్ట్ సాధించడంపై పోలవరం గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## మంగళగిరి ఎయిమ్స్ బస్సు ప్రారంభం ౦ మంత్రి పార్థసారధి చిత్రపటానికి పాలాభిషేకం

### - అభినందనలు తెలిపిన మండల ప్రజలు

**చాట్రాయి, అక్టోబర్ 13, ప్రభాతవార్త :** మండలంలోని కృష్ణారావు పాలెం గ్రామం నుండి మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్ కు మంజూరైన బస్సును సోమవారం చనుబండ సహకార సంఘం అధ్యక్షులు మోరంపూడి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నక్కా రాము సోమవారం ప్రారంభించారు. చనుబండ,కృష్ణారావు పాలెం గ్రామాల ప్రజలు, మహిళలు విరివిగా పాల్గొని మంత్రి పార్థసారథి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కృష్ణారావు పాలెం నుండి అమరావతి, ఎయిమ్స్ వరకు బస్సు సర్వీసు ను ఏర్పాటు చేయించిన మంత్రి వర్యులు కొలుసు పార్థ సారధి కి అభినందనలు తెలియజేశారు.చనుబండ, కృష్ణారావు పాలెం నుండి విజయవాడ వెళ్ళడానికి ఏ పీ బస్సుసర్వీసులు లేనందున మహిళలు స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఉపయోగించుకోలేకపోతున్న విషయాన్ని ఇటీవల మంత్రి దృష్టికి తీసుకువెళ్ళగా వెంటనే నూజివీడు డీ ఎం తో ఫోన్ లో



మాట్లాడి కృష్ణారావు పాలెం నుండి అమరావతి, ఎయిమ్స్ వరకు బస్సు సర్వీసు ను ఏర్పాటు చేయించిన విషయం విధితమే. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల మంత్రి కి ఉన్న చిత్త శుద్ధికి ఇదే నిదర్శనం అని మోరంపూడి, నక్కారాము కొనియాడారు. ఈ కార్యక్రమంలో పరసా శ్రీను, గవర వెంకటేశ్వర రావు, బన్నే వీరయ్య, బన్నే వీరాస్వామి, బీజేపీ నాయకుడు నెక్కళపు వెంకటేశ్వర రావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరైన పనులు మొదలు పెట్టారేమి?

ప్రభాతవార్త చాట్రాయి : చాట్రాయి మండలంలోని చిత్తపూరు బూరుగుగుడెం రోడ్డు నిర్మాణానికి మూడు కోట్లు నిధులు మంజరై మూడు మాసాలు అయినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే మొదటి మంజూరు ఈ రోడ్డునే ఎంపిక చేశారు. అధికారులు పూర్తిస్థాయిలో ఈ రోడ్డును సర్వే చేసి ఎక్కడ సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలో మరికొన్ని చోట్ల బీటీ రోడ్డు ఏర్పాటుకు ఆర్ అండ్ బి అధికారులు అంచనాలు తయారు చేయగా మూడు కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఆర్ అండ్ బి అధికారులు టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేయగా పనులు ప్రారంభించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మొత్తం సుమారు పది కిలోమీటర్లు ఉండగా అడుగడుగునా గోతులు మయంగా మారింది. నూతనంగా రోడ్డు నిర్మాణం పనులు మంజూరు కావడంతో తాత్కాలిక మరమ్మతులు సైతం అధికారులు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కాంట్రాక్టర్ నెలలోపులోనే రోడ్డును పూర్తి చేయాల్సి ఉండగా మూడు మాసాలు దాటిన నేటికీ ప్రారంభం చేయకపోవడంపై ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిత్తపూరు నుండి బూరుగు గూడెం వెళ్లే రోడ్డులో అడుగడుగునా ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అయినా అధికారులు మాత్రం పనులు ప్రారంభించని కాంట్రాక్టర్ పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ధ్వజమెత్తుతున్నారు. కాంట్రాక్టర్ పట్ల అధికారులు ఎందుకు ఉదాశీనా వైఖరి వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు ఉన్నతాధికారులు స్పందించి ఈ రోడ్డుకు మోక్షం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**డి ఈ వివరణ**

ఈ విషయంపై ఆర్ అండ్ బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాబురావు వివరణ కోరగా నిధులు మూడు కోట్లు మంజూరైన మాట వాస్తవమేనని టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయిందని కాంట్రాక్టర్ త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారని దీనిపై తక్షణమే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.



వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా... జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్, ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, పెదవేగి, పోలవరం, కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా... ఆకివీడు, గణపవరం, పెనుమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు సంప్రదించవలెను.
ఫోన్ : 9704502377

## నరసాపురం డిపో నుండి

### పంచారామాలకు ప్రత్యేక క బస్సులు, డిపో మేనేజర్ సుబ్బన్న రెడ్డి,



పెనుమంట్ర ప్రభాతవార్త : నరసాపురం ఆర్ టీ సి డిపో నుండి కార్తీక మాసం సందర్భంగా పంచారామాలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్న రెడ్డి సోమవారం తెలిపారు. ఈ బస్సులు ఈనెల 26, తేదీన, మరియు, నవంబర్ 2 ,9, 16 ,తేదీలలో ఆదివారం రాత్రి 7 గంటలకు బయలుదేరి సోమవారం అమరావతి, ద్రాక్షారామం, సామర్లకోట,భీమవరం, పాలకొల్లు, ఈ ఐదు పుణ్యక్షేత్రాలు ఒకేరోజులో దర్శించుకొని తిరిగి సోమవారం రాత్రికి డిపోకు చేరునని తెలిపారు. పంచారామాలకు ఈ క్రింది విధముగా టికెట్ ధరలు పల్లె వెలుగు రూ. 720/-, ఆల్ట్రా పల్లె వెలుగు రూ.800/-, ఎక్స్ ప్రెస్ రూ.-900/-, సూపర్ లగ్జరీ రూ.1200/-,చార్జీలు నిర్వహించినట్లు తెలిపారు నరసాపురం డిపో నుండి శబరిమలై పుణ్యక్షేత్రాలకు, వెళ్లే భక్తులకు మీ ప్రదేశాల్లో నుండి 30 మంది భక్తులు ఉన్నాయెడల బస్సు మీ వద్దకే వచ్చునని తెలిపారు. ద్వారకాతిరుమల ,శ్రీశైలం , మహానంది, కాణిపాకం, సిరిపురం ,అరుణాచలం, పళని, గురువాయర్, ఎరుమేలి, పంబ, రామేశ్వరం, తిరుపతి, విజయవాడ, మీదుగా నరసాపురం చేరును, ఈ అవకాశాన్ని యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీశైలం పుణ్యక్షేత్రం వెళ్ళు భక్తులకు మీ ప్రదేశం నుండి వెళ్ళుటకు,30 మంది భక్తులు ఉన్నాయెడల మీ వద్దకే బస్సు వచ్చి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి తీసుకెళ్లి తీసుకొచ్చానని తెలిపారు. టికెట్ ధర. ఒక్కొక్కరికి రూ. 2000/ ఈ దైవ దర్శనం చేయుటకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్ డిపో మేనేజర్:-99592 25486 అసిస్టెంట్ మేనేజర్:-. 73829 08122

## 14 మంది ఉపాధ్యాయులు విధులలో చేరిక.

అత్తిలి- అక్టోబర్ 13( ప్రభాతవార్త): అత్తిలి మండలంలో కొత్తగా తొమ్మిది మంది స్కూల్ అసిస్టెంట్లు, ఐదుగురు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు విధులలో చేరినట్లు మండల విద్యాధికారులు ఎన్. రమేష్,ఎం వి ఎల్ కె ప్రసాద్ తెలిపారు. మండలంలో 14 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా 9 మందిని నియమించారని తెలిపారు. 8 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా ఐదుగురుని నియమించినట్లు తెలిపారు. మెగా డీఎస్సీలో ఈ నియామకాలు జరిగినట్లు వారు తెలిపారు.

## రాష్ట్రంలో కుటీర పరిశ్రమగా కల్తీ మద్యం తయారీ

అంటూ కుట్రలు చేస్తుందని, కానీ నేటి కూటమి ప్రభుత్వం నిర్వాకమైన కల్తీ మద్యంలో చాలామంది మంత్రులు, ఎమ్మెల్యేలు భవిష్యత్తులో జైలుకు పోతారని అన్నారు. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు మట్టి, మద్యం, ఇసుక, పేకాట, బెట్టింగ్‌లలోనే దోచుకుంటున్నారని తెలుసు కానీ నేడు కొత్తగా కల్తీ మద్యం అమ్మకాలు చేయిస్తూ రాష్ట్రంలో పేదప్రజల గుండెలను పిండేస్తున్నారని మండిపడ్డారు. పాదయాత్రగా ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి.. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వైసీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన కల్తీ మద్యానికి వ్యతిరేకంగా ఎక్సైజ్ శాఖ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్రగా బయలుదేరారు. ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి చేరుకుని మద్యం సీసాలతో నిరసన తెలిపారు. మద్యం సీసాల్లోని మద్యాన్ని రోడ్డుపై పారపోశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డికి కల్తీ మద్యం అరికట్టాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పంచాయితీరాజ్‌వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండీ హబీబుద్దీన్, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, తణుకు, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు పెనుమర్తి వెంకటరామన్న, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఝాన్సీ లారెన్స్, షేక్ ఫహీమా, మనుబర్తి లలిత, పైడి సాయిసూర్య, బొల్లా దుర్గాప్రసాద్, రామిశెట్టి రాము, చింతలపూడి సూర్యనారాయణ, వై.రామకృష్ణ, కొత్తపల్లి చరణ్, బిరుదుకోట చింతన్న, కోట స్వామీజీ, సరెళ్ల వీరతాత పాల్గొన్నారు.

# ఎమోషనల్ లేయర్స్ ఉన్న చిత్రం

## హీరో సిద్ధు జొన్నలగడ్డ



టెక్నికల్ డిపార్ట్‌మెంట్ అద్భుతంగా మెరిసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ వాల్యూస్ టాప్ క్వాలిటీలో వున్నాయి.తెలుసు కదా కేవలం యువతకే కాదు, కుటుంబ ప్రేక్షకుల మనసునూ తాకే ఎమోషనల్ లేయర్స్ ఉన్న చిత్రం. ప్రేమ, ఈగో, ఆత్మపరిశీలన, మోడరన్ రిలేషన్షిప్స్ మేళవించిన ఈ సినిమా సోల్, స్టైల్, సబ్‌స్టెన్స్ కలిగిన మోడర్న్ లవ్ స్టోరీగా గుర్తుండిపోతుంది. ఈ దీపావళికి సిద్ధు జొన్నలగడ్డ నుంచి ఒక ఎమోషనల్, మ్యూజికల్, రొమాంటిక్ రైడ్‌కి గెట్ రెడీ. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఆడియన్స్ ఎక్సైట్మెంట్, రెస్పాన్స్‌కి థాంక్యూ. మీ అందరికీ ట్రైలర్ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ట్రైలర్‌తో ఒక్కసారిగా ఆడియన్స్‌కి బ్యాంగ్ లాంటిది ఇవ్వాలని ముందే డిసైడ్ అయ్యాం. ట్రైలర్లో ఏం చూసారో సినిమాలో కూడా అదే క్యారెక్టర్, టోన్ కనిపిస్తుంది. టిల్లు లాంటి క్యారెక్టర్ నుంచి బయటికి రావాలంటే ఇలాంటి సినిమాలు చేయాలి. టిల్లు ఇన్నోసెంట్. బట్ తెలుసు కదా అలా కాదు. ఇంటెలిజెంట్ క్యారెక్టర్. వరుణ్ క్యారెక్టర్ చాలా ఎంటర్టైనింగ్ గా ఉంటుంది. ఇది యూత్‌కి ఫ్యామిలీస్ కి నచ్చే సినిమా హీరోయిన్ రాశిఖన్నా మాట్లాడుతూ, మీ అందరి రెస్పాన్స్ చాలా హ్యాపీనెస్ ఇచ్చింది. ఇది ఒక రాడికల్ సినిమా అవుతుంది. ట్రైలర్ చూసి చాలా సర్ప్రైజింగ్‌గా అనిపించింది. ఈ సినిమా చూసిన తర్వాత టిల్లుని మరిచిపోతారు. అంత నమ్మకం ఉంది. డైరెక్టర్ నీరజకి, హీరో సిద్ధుకి మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సినిమా చూసి సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను. హీరోయిన్ శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ,. ట్రైలర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ట్రైలర్ చూసిన తర్వాత చాలా రాడికల్‌గా అనిపించింది. సినిమా కోసం నేను చాలా ఎక్సయిటెడ్‌గా ఎదురు చూస్తున్నాను. మా టీమ్ అందరికీ థాంక్యూ.డైరెక్టర్ నీరజ కోన మాట్లాడుతూ . మీ అందరికీ ట్రైలర్ నచ్చిందని భావిస్తున్నాను. ఇది నా ఫస్ట్ ఫిలిం. చాలా స్పెషల్. మీ అందరితో షేర్ చేసుకోవడం ఇంకా స్పెషల్. ట్రైలర్లో మీరు చూసిన దానికి పది రెట్లు సినిమాలో ఉంది. గెట్ రెడీ ఫర్ ఫన్ రైడ్. మీ అందరి ప్రేమకు ధన్యవాదాలు. వైవా హర్ష మాట్లాడుతూ, అందరికి నమస్కారం. ట్రైలర్లో కొంచెమే చూపించాము. సినిమాలో చాలా ఉంది. అక్టోబర్ 17 అందరూ ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను. ప్రొడ్యూసర్ కృతి ప్రసాద్ మాట్లాడుతూ, తెలుసు కదా చాలా స్పెషల్ ఫిలిమ్. ఈ కథ వినగానే నచ్చింది. యూత్ ఆడియన్స్ కనెక్ట్ అవుతారు. ఈ సినిమాని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తున్న టీం విషయంలో ప్రౌడ్‌గా వుంది. బిగ్ స్క్రీన్ మీద మీ అందరికీ సినిమా చూపించడానికి చాలా ఎక్సైటెడ్‌గా ఎదురు చూస్తున్నాము. అక్టోబర్ 17న సినిమా చూడాలని కోరుకుంటున్నాను.మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. మాకు ఈ అవకాశం ఇచ్చిన విశ్వప్రసాద్‌కి కృతి ప్రసాద్‌కి ధన్యవాదాలు. ట్రైలర్ అదిరిపోయింది. ట్రైలర్ చూసిన తర్వాత సినిమా మీద అంచనాలు అద్భుతంగా పెరిగాయి. తప్పకుండా ఈ సినిమా థియేటర్స్‌లో మిమ్మల్ని అందరిని అలరిస్తుందని నమ్ముతున్నాను.



# దీపావళి పార్టీలో బాలీ వుడ్ ప్రముఖులు

## ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అంబానీ ఫ్యామిలీ

సాంప్రదాయ దుస్తుల్లో తారల సందడి, హంగామా

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పార్టీ ఫొటోలు, వీడియోలు

దేశవ్యాప్తంగా దీపావళి సంబరాలకు సమయం ఆసన్నమవుతున్న వేళ, బాలీవుడ్‌లో పండగ సందడి వారం ముందే మొదలైంది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీశ్ మల్హోత్రా తన నివాసంలో సినీ ప్రముఖుల కోసం గ్రాండ్‌గా దీపావళి పార్టీని నిర్వహించారు. ఈ వేడుకకు బాలీవుడ్ తారాలోకమంతా కదిలి రావడంతో ఆయన ఇల్లు తారలతో కళకళలాడింది.

ఈ పార్టీకి కరీనా కపూర్, కాజోల్, కృతి సనన్, సీనియర్ నటీమణులు రేఖ, హేమమాలిని వంటి స్టార్లతో పాటు నేటితరం తారలు అనన్య పాండే, సారాఅలీఖాన్, జాన్వీకపూర్ సోదరి ఖుషీకపూర్, షారుఖ్‌ఖాన్ కుమార్తె సుహానాఖాన్ వంటి వారు హాజరై సందడి చేశారు. వీరితో పాటు కరణ్ జోహార్, ప్రీతి జింటా, జెనీలియా, మలైకా అరోరా, సోనాక్షి సిన్హా, అదితి రావు హైదరి వంటి ఎందరో ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. తారలంతా సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోయి, పార్టీకి కొత్త శోభను తీసుకొచ్చారు.

పార్టీలో అంబానీ కుటుంబం.. ప్రత్యేక ఆకర్షణగా నీతా అంబానీ!

అయితే, ఈ పార్టీలో రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ కుటుంబం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముకేశ్ అంబానీ అర్ధాంగి నీతా అంబానీ, కోడలు రాధిక మర్చంట్ ఈ వేడుకకు హాజరయ్యారు. ప్రత్యేక వస్త్రధారణలో వారు అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం ఈ దీపావళి పార్టీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పండుగకు ముందే బీటౌన్‌లో మొదలైన ఈ వేడుకలు అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

# ఎంటర్‌టైన్‌మెంట్‌కు లోటుండదు




సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కె- ర్యాంప్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'కె- ర్యాంప్' సినిమాకు జైన్స్‌ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో ఈ సినిమాలోని హైలైట్స్ తెలిపారు దర్శకుడు జైన్స్ నాని. 'కె- ర్యాంప్' అనే టైటిల్ ఈ కథకు సరిపోతుందనే పెట్టాం. బూతు పదం అని ఆలోచించలేదు. ఈ చిత్రంలో హీరో క్యారెక్టర్ పేరు కుమార్. కథానుసారం అతని క్యారెక్టర్ ఇబ్బందుల్లో పడుతుంది. ర్యాంప్ అనే మాట మనందరికీ తెలుసు. అలా కథకు, హీరో క్యారెక్టరైజేషన్‌కు సరిపోయేలా 'కె- ర్యాంప్' అని పెట్టాం. ముందు వేరే టైటిల్స్ అనుకున్నా, ఇదే క్యాచీగా ఉంది, త్వరగా ప్రేక్షకుల్లోకి వెళ్తుందని అనిపించింది.'కె- ర్యాంప్' సినిమా ట్రైలర్ చూసి ఒకట్రెండు మాటలు ఇబ్బందిగా ఉన్నాయని అనుకోవద్దు. ఇది పక్కాగా ఫ్యామిలీస్ చూడాల్సిన సినిమా. ఏ సినిమాకైనా ముందు యూత్ ఆడియెన్స్ ను అట్రాక్ట్ చేయాలని ప్రయత్నిస్తాం. ఆ ప్రయత్నంలో భాగంగానే ట్రైలర్ కట్ చేశాం. యూత్ ఆడియెన్స్‌కు నచ్చితే వాళ్లే ఫ్యామిలీ ఆడియెన్స్‌ను తీసుకొస్తారు. 'కె- ర్యాంప్'లో మంచి కథ ఉంది. దాంతో పాటే మూవ్ మెంట్స్ డిజైన్ చేశాం. ఇంటర్వెల్ బ్లాక్ సర్ ప్రైజ్ చేస్తుంది.కేరళలోని ఓ మంచి కాలేజ్ లొకేషన్‌లో ఎక్కువ భాగం షూటింగ్ చేశాం. లక్కీగా మంచి కాలేజ్ దొరికింది. అలాగే కేరళలోని బ్యూటిఫుల్ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపాం.మా చిత్రంలో మూడు సాంగ్స్ ఉంటాయి. కథ ఫ్లోను డిస్ట్రబ్ చేయొద్దనే ఎక్కువ పాటలు పెట్టలేదు. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ హైలైట్ అవుతుంది. థియేటర్‌లో బీజీఎంను ఎంజాయ్ చేస్తారు. దీపావళికి మన బాక్సాఫీస్ వద్ద కాంపిటేషన్ ఉంది. అయితే మా టీజర్, ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. అన్ని సినిమాలు హిట్ కావాలి. మాది ఇంకొంచెం పెద్ద హిట్ కావాలి. మేము ఫన్ కోసం మా సినిమాకు రమ్మని చెబుతున్నాం. ఆ ఫన్ మాత్రం ఎక్కడా మిస్ కాదు. ఎందుకంటే పోస్ట్ ప్రొడక్షన్ టైమ్ లో ఎన్నోసార్లు మూవీ చూసుకున్నాం కాబట్టి మంచి ఫన్, ఎంటర్ టైన్ మెంట్ గ్యారెంటీ అనే నమ్మకంతో ఉన్నాం. ఫుల్‌గా ఎంజాయ్ చేస్తారు. కామ్నా జెఠ్మలానీ చిన్నగెస్ట్ రోల్ చేశారు. నరేష్‌తో ఆమెకు కాంబినేషన్ సీన్స్ ఉంటాయి. ఈసీన్స్ హిలేరియస్‌గా వచ్చాయి. నాకు ఎనర్జీతో ఉండే ఫన్ మూవీస్ అంటే ఇష్టం. కొన్ని ప్రాజెక్ట్స్‌కు డిస్కషన్స్ జరుగుతున్నాయి. 'కె- ర్యాంప్' రిలీజ్ తర్వాత వాటి వివరాలు వెల్లడిస్తా.

## వేటగాడి చరిత్రలో

# జింకపిల్లలే నేరస్థులు



ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన తాజా చిత్రం 'తక్షకుడు'. ఇందులో లాపతా లేడీస్ ఫేమ్ నితాన్షి గోయెల్ హీరోయిన్ గా నటించింది. ..మిడిల్ క్లాస్ మెలోడీస్‌డైరెక్టర్ వినోద్‌అనంతోజు దర్శకత్వంలో ఈసినిమారూపొందుతోంది. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్ఛ్యూన్ ఫర్ సినిమాస్ బ్యానర్స్ పై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. అయితే ఇప్పుడీసినిమానిడైరెక్టర్ ఓటీటీలో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ప్రముఖ డిజిటల్ ఫ్లాట్ ఫామ్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా త్వరలోనే స్ట్రీమింగ్ కానుందని తెలిపారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో రిలీజ్ చేసిన అనౌన్స్ మెంట్ పోస్టర్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. త్వరలో నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కు రాబోతున్న ఆనంద్ దేవరకొండ ఇంటెన్స్ యాక్షన్ మూవీ 'తక్షకుడు'.యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రముఖ ఓటీటీ నెట్ ఫ్లిక్స్ కోసం చేసిన సినిమా "తక్షకుడు". ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో దర్శకుడు వినోద్ అనంతోజు ఈ చిత్రాన్ని రూపొందించారు. ఆనంద్ దేవరకొండ, వినోద్ అనంతోజు కాంబోలో వచ్చిన "మిడిల్ క్లాస్ మెలోడీస్ సినిమా ఘనవిజయం సాధించింది. ఈ నేపథ్యంలో "తక్షకుడు" సినిమా మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రాన్ని నాగవంశీ.ఎస్, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. "తక్షకుడు' సినిమాలోని తాన్షిగోయెల్ నాయికగానటిస్తోంది. త్వరలోనే ఈ చిత్రాన్ని స్ట్రీమింగ్ చేస్తున్నట్లు ఈరోజు నెట్ ఫ్లిక్స్ అనౌన్స్‌చేసింది.ఈసందర్భంగారిలీజ్ చేసిన పోస్టర్‌లో వేటగాడి చరిత్రలో జింక పిల్లలే నేరస్థులు.అనే ట్యాగ్ లైన్ ఆకట్టుకుంటోంది. హీరో ఆనంద్ దేవరకొండ చేతిలో తుపాకీ పట్టుకుని ఉండటం, ఒక ఊరు అగ్నికి ఆహుతి అవుతున్నట్లు డిజైన్ చేసిన పోస్టర్ ఆసక్తి కలిగిస్తోంది. ఆనంద్ దేవరకొండ కెరీర్ లో ఇదొక డిఫరెంట్ అటెంప్ట్ కానుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి .

# 6 ఫిలిమ్స్‌కు అత్యధిక వ్యూస్



2024లో విజయ్ సేతుపతి మహారాజా నెట్‌ఫ్లిక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వ్యూస్ సాధించిన భారతీయ చిత్రంగా నిలిచింది. దుల్కర్ సల్మాన్ లక్కీ బాస్కర్ 14 వారాల పాటు ఇండియన్ టాప్ 10లో కొనసాగింది. పుష్ప 2, అమరన్, లియో, దేవర వంటి దక్షిణాది సినిమాలు గ్లోబల్ టాప్ 10 నాన్‌ఇంగ్లీష్ లిస్ట్‌లో చోటు దక్కించుకోవడంతో, ఈ ప్రాంతం నుండి వచ్చే ఒరిజినల్ కథలకు ఉన్న డిమాండ్ మరింత పెరిగింది .విజయాల తర్వాత, నెట్‌ఫ్లిక్స్ ఇప్పుడు ఆరు కొత్త తమిళ, తెలుగు ఒరిజినల్ సినిమాలు, సిరీస్‌లతో కొత్త మైలు రాయిని చేరుతోంది. నెట్‌ఫ్లిక్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మోనికా శెర్గిల్ మాట్లాడుతూ.,దక్షిణ భారత భాషలలోని కథలను ప్రోత్సహించడానికి మేము చాలా ఉత్సాహంగా ఉన్నాము. మా మొదటి ఒరిజినల్స్ నుండి ఈరోజు వరకూ, ఈ ప్రాంత కథల సమృద్ధి మా ఎదుగుదలకు బలమైంది. ఇప్పుడు, తమిళ, తెలుగు చిత్రసీమల నుండి వస్తున్న కొత్త క్రియేటర్స్ తో కలిసి థ్రిల్లర్లు, కామెడీలు, ఎమోషనల్ డ్రామాలు, క్రాస్‌కల్చరల్ రొమాన్స్‌లతో కొత్త ఫేజ్ ను ప్రారంభిస్తున్నాము. స్టీఫెన్(తమిళం)దర్శకుడు మిథున్ తెరకెక్కించిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్‌లో గోమతి శంకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఒక సైకియాట్రిస్ట్, తన ముందుకు వచ్చిన ఒక నేరస్థుడిని పరీక్షిస్తుంటుంది. అయితే ఆ కేసు వెనుక ఉన్న రహస్యం ఆమెనే మాయజాలంలోకి లాక్కుంటుంది.సూపర్ సుబ్బు (తెలుగు) దర్శకుడు మల్లిక్ రామ్ దర్శకత్వంలో సందీప్ కిషన్ నటించిన ఈ కామెడీ సిరీస్ లాఫ్ రైడ్ గా వుతుంది. సెక్స్ ఎడ్యుకేషన్ నేర్పమని ఒక గ్రామానికి పంపిన వ్యక్తి, ఆ విషయంలో పూర్తిగా అనర్హుడే అయినా ఎలా హిలేరియస్ పరిస్థితుల్లో పడతాడో చూపిస్తుంది.

# బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కి

## శ్రవణమిశ్రా, అతులు మిశ్రా



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను అఖండ 2: తాండవం బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం పండిట్ శ్రవణ్ మిశ్రా, పండిట్ అతుల్ మిశ్రా బ్రదర్స్ ని పరిచయం చేస్తున్న సెన్సేషనల్ కంపోజర్ తమన్'గాడ్ ఆఫ్ ది మాసెస్' నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను డైనమిక్ అండ్ పవర్ ఫుల్ ఫోర్త్ కొలాబరేషన్ లో మోస్ట్ అవైటెడ్ హైఆక్టేన్ సీక్వెల్ అఖండ 2: తాండవం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది.14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంటప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను ఎం తేజస్విని నందమూరి సగర్వంగా సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన అఖండ 2 టీజర్ భారీ బజ్ క్రియేట్ చేసి అభిమానులను ఉర్రూతలూగించింది.

సెన్సేషనల్ కంపోజర్ తమన్ తాజాగా అఖండ 2 బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రారంభించారు. పండిట్ శ్రవణ్ మిశ్రా, పండిట్ అతుల్ మిశ్రా సోదరులు సంస్కృత శ్లోకాలను అద్భుతంగా పఠించే నైపుణ్యంతో ప్రసిద్ధి చెందారు. ఇప్పుడు ఈ ప్రతిభావంతులైన సోదరులు అఖండ 2తో సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు.

# క్యారెక్టర్ ఛాలెంజింగ్‌గా ఉంది




డ్యూడ్ లో చేసిన కురల్ క్యారెక్టర్ చాలెజింగ్ గా అనిపించింది. డ్యూడ్ ఎంటర్‌టైన్‌మెంట్ చాలా కొత్తగా ఉంటుంది. అందరికీ నచ్చే సినిమా ఇది: లవ్ టుడే, డ్రాగన్‌లతో రెండు వరుస హిట్‌లను అందించిన యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్‌తో దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. ప్రేమలుఖి అద్భుతమైన విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ట్రైలర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. అక్టోబర్ 17న తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మమిత బైజు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. ప్రేమలు రిలీజ్ తర్వాత మేకర్స్ నన్ను సంప్రదించారు. ఆ తర్వాత డైరెక్టర్ తో మీటింగ్ జరిగింది. కీర్తి తొలిసారిగా నన్ను సంప్రదించినప్పుడు, కథను చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. కాన్సెప్ట్ కూడా చాలా ఆసక్తికరంగా అనిపించింది.

ఆ కథలో నా పాత్రకు చాలా ప్రాధాన్యం వుంది. కురల్ పాత్రలో చాలా డిఫరెంట్ గా వుంటుంది. ఇప్పటివరకూ అలాంటి పాత్ర చేయలేదు.

కురల్" చాలా హానెస్ట్ క్యారెక్టర్. ఆమె తన భావోద్వేగాల పట్ల నిబద్ధతగా ఉంటుంది, చుట్టూ ఉన్న వారందరితో స్నేహంగా వుంటుంది. ఆమె చాలా సూటిగా మాట్లాడుతుంది. ఆ పాత్ర చేయడం చాలా మంచి ఎక్స్ పీరియన్స్.

ఈ సినిమాలో కొన్ని ఎమోషనల్ సీన్స్ నాకు సవాలు గా అనిపించాయి. ఆ సీన్స్ కోసం నేను రాత్రంతా డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను. షూట్ సమయంలో వాటి గురించి ఆందోళన లేకుండా సీన్ మీద ఫోకస్ చేశా. నేను ఎప్పుడూ షూట్‌కు ముందు బాగా ప్రిపేర్ అయి ఉండాలని చూసుకుంటాను. అందుకే ఇది నాకు ఒకేసారి సవాలుగా, ఉత్సాహంగా అనిపించింది.

ప్రదీప్ రంగనాథ్ తో నటించడం మంచి ఎక్స్ పీరియన్స్. ఆయన మల్టీ ట్యాలెంటెడ్. సెట్స్ లో చాలా హెల్ప్ ఫుల్ గా వుంటారు. శరత్‌కుమార్ లాంటి సినియర్ యాక్టర్స్ తో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. డైరెక్టర్ కీర్తి ఈ సినిమాని చాలా అద్భుతంగా తీశారు. ఇందులో వుండే ఎమోషన్స్ ఫన్ చాలా యూనిక్ గా వుంటాయి. సాయి అభ్యంకర్ మ్యూజిక్ ఈ సినిమాకి బిగ్ ఎసెట్. పాటలు మనసుని ఆకట్టుకుంటాయి. నేపధ్య సంగీతం కూడా అద్భుతంగా వుంటుంది.కర్స్ తో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్ పీరియన్స్. చాలా పాషనేట్ ప్రొడ్యూసర్స్. సినిమాని చాలా గ్రాండ్ గా తీశారు. తప్పకుండా ఈ సినిమా అందరినీ అలరిస్తుంది .

# వచ్చే యేడాదికి 'సూపర్ సుబ్బు'



సందీప్ కిషన్ హీరోగా రూపొందిన కొత్త ప్రాజెక్ట్ సూపర్ సుబ్బు. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ 2026లో స్ట్రీమింగ్ కానుందిదర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ.. ..సూపర్ సుబ్బు" ఆలోచన ఒక అబ్జర్వేషన్ నుంచి పుట్టింది. ఈ రోజుకీ సెక్స్ ఎడ్యుకేషన్ గురించి మనం ఇంకా గుసగుసలలోనే మాట్లాడుతున్నాం. తల్లిదండ్రులు దాన్ని దాటవేస్తారు, పాఠశాలలు విస్మరిస్తాయి, పిల్లలు అపోహలతో పెరుగుతారు. ఆ మోనాన్ని ఒక కథగా మార్చాలని అనిపించింది. సుబ్రహ్మణ్యం అనే పాత్ర ద్వారా అవగాహనను ఎలా కలుస్తుందో చూపించాలనుకున్నాం. మాఖీపూర్ ప్రజల, అపోహలు, ఆప్యాయత.. ఇవన్నీ మనందరికీ తెలిసిన గ్రామజీవనాన్ని గుర్తు చేస్తాయి.

నటి మిథిలా పాల్కర్ మాట్లాడుతూ,సూపర్ సుబ్బు కామెడీ, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు అన్నీ కలగలసిన కథ. సుబ్బు అనే దురదృష్టపు యువకుడు చిన్న పట్టణ వాస్తవాలతో, కఠినమైన తండ్రితో ఎలా పోరాడతాడో ఈ సిరీస్ చెబుతుంది. అతని ప్రయాణం ఒక గ్రామీణ నేపథ్యానికి చేరుతుంది, అక్కడ అతను అరుదుగా మాట్లాడే ఒక విషయాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. ప్రేమ, ఆకాంక్షతో కూడిన ఈ కథ కొత్తదనం, హాస్యంతో నిండినదిగా ఉంటుంది. పాత్రలు చాలా దగ్గరగా అనిపిస్తాయి, కథ కూడా ఎంతో వైవిధ్యంగా ఉంటుంది. ఇది నేను ఇప్పటివరకు చేసిన ప్రాజెక్టుల కంటే పూర్తిగా భిన్నమైనది.హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ,ఇప్పుడు మనం ఒక అందమైన కథా

# సాహస భవాని

**చోరీకి వచ్చిన దొంగను అడ్డుకోవడమే కాకుండా అతన్ని పట్టుకునేందు వెంబడిచి తెగువ చూపిందో కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లో భవాని.**



భవాని (13) ఆరో తరగతి చదువుతోంది. తన ఇంట్లోనే మొదటి అంతస్తులో నివాసముంటుంది. క్రిందిపోర్శన్‌లో అద్దెకు ఉండేవారు తాళం వేసి బయటకు వెళ్లారు. అయితే ఇదే అదనుగా గుర్తు తెలియని దొంగ ఇంట్లో దొంగతనానికి యత్నిస్తున్నాడు. ఇది గమనించిన భవాని పైనుండే ఎవరు అని అడిగింది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండటంతో అనుమానం వచ్చింది. గట్టిగా అడగడంతో తడబడిన దొంగ తప్పించు కునేందుకు యత్నించాడు. ఇది గమనించిన భవాని వెంటనే దొంగను వెంబడించింది. దొంగ దొంగ అని అరుస్తూ దొంగతనానికి యత్నించిన దొంగను పట్టుకునేందుకు యత్నించింది. దీనితో ఒక అమ్మాయి తనను వెంబడిస్తుందని గుర్తించి దొంగ పెద్ద అడుగులతో పరుగుతీశాడు. వాడివెంటనే భవాని కూడా పరుగెత్తుతూ దొంగను పట్టుకునేందుకు యత్నించి విఫలమమైంది. అయితే దొంగ తన నైపుణ్యాన్ని ప్రదర్శించి పరుగెత్తడంతో దొంగను పట్టుకునేందుకు చేసిన ప్రయత్నాలను అభినందించారు. భవాని దొంగను పట్టుకునేందుకు చేసిన సాహసం స్థానికంగా ప్రజల్ని అబ్బుర పరిచింది. ఈ విషయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సిసి కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించి దొంగను గుర్తించేందుకు యత్నిస్తున్నారు. బాలిక చేసిన సాహసాన్ని అటు స్థానికులతోపాటు ఇటు పోలీసులు కూడా అభినందించారు. సుమారు 300 వందల నుండి 400మీటర్ల వరకు పరుగెత్తించిన తీరు స్థానికులను అబ్బురపరిచింది. దొంగను పట్టుకునేందుకు బాలికచేసిన సాహసన్ని అందరు అభినందిస్తున్నారు. □

# ఆమె వృత్తి నిబద్ధతకు నిదర్శనం !

**అసలే పురుషాధిపత్య రంగం.. దీనికి తోడు వేళాపాళా లేకుండా ఎప్పుడంటే అప్పుడు ఉద్యోగంలోకి వెళ్లాల్సి ఉంటుంది.. ఇలాంటి ఉద్యోగం చేయడం నీ వల్ల కాదు.. నిన్ను పంపించడం మాకూ కష్టమే! లోకోపైలట్‌గా ఉద్యోగమొచ్చినప్పుడు సురేఖ యాదవ్ అల్లిదండ్రులు ఆమెతో అన్న మాటలివి. వాటికి కట్టుబడి ఉంటే ఈ రోజు తాను ఒక సాధారణ గృహిణిలా మిగిలిపోయేదేమో! ఆమె గురించి మనం మాట్లాడుకునే వాళ్లమే కాదేమో! కానీ సురేఖ అలా చేయలేదు.. తన మనసు మాటే విన్నది. అందుకే సరిగ్గా 36 ఏళ్ల క్రితం 'ఆసియాలోనే తొలి మహిళా లోకోపైలట్'గా చరిత్రకెక్కింది. ఎంతోమంది మహిళలు ఈ రంగంలోకి అడుగుపెట్టేందుకు స్ఫూర్తి నిచ్చింది. ఎన్నో ఘనతలకు కేరాఫ్ అడ్రస్‌గానిలిచింది. ఇప్పుడు ఓ అధ్యాయం ముగిసిందన్నట్లు తన సుదీర్ఘ రైల్వే కెరీర్‌కు వీడ్కోలు పలికారు. ఈ నేపథ్యంలో ఈ మహిళా లోకోపైలట్ స్ఫూర్తిదాయక జర్నీ తెలుసుకుందాం..**

టీచర్ కావాలనుకున్నా.. కానీ! మహిళా లోకో పైలట్ల గురించి ఎప్పుడు టాపిక్ వచ్చినా ముందుగా గుర్తొచ్చేది సురేఖ యాదవ్ పేరే. ఈ ఉద్యోగం కేవలం పురుషులకు మాత్రమే! అన్న మూసధోరణిని బద్దలుకొట్టి మరీ ఈ రంగంలోకి అడుగుపెట్టారామె. అయితే తానీ వృత్తిలోకి రావడం మాత్రం యాదృచ్ఛికంగానే జరిగిందంటారు. మాది మహారాష్ట్రలోని సతారా జిల్లా. అమ్మానాన్నలిద్దరూ వ్యవసాయం చేసేవారు. ఐదుగురు తోబుట్టువుల్లో నేనే పెద్ద. అలాగని కుటుంబ బాధ్యతలన్నీ నామీదే వేయడం, నాతో చదువు మాన్పించడం.. వంటివేవీ చేయలేదు మా పేరెంట్స్. చదువుపై నాకున్న మక్కువను గుర్తించి ప్రోత్సహించారు. స్కూల్లో చదువుతో పాటు ఆటల్లోనూ ముందుండేదాన్ని. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పూర్తిచేశాక టీచింగ్ వృత్తిలోకి రావాలనుకున్నా. కానీ అంతలోనే భారతీయ రైల్వేలో అసిస్టెంట్ లోకోపైలట్ ఉద్యోగ నోటిఫికేషన్ నా కంట పడింది. అందులోనూ డిప్లొమా చేసిన వారికి తొలి ప్రాధాన్యత అన్న విషయం తెలుసుకున్నా. దీంతో క్యాజువల్‌గానే దరఖాస్తు చేసుకున్నా.. అంతే సరదాగా పరీక్ష కూడా రాశాను. అయితే ఈ ఉద్యోగానికి ఎంపికవుతున్నానని కలలో కూడా అనుకోలేదు. కానీ దక్షిణ మధ్య రైల్వేలో అసిస్టెంట్ లోకోపైలట్‌గా ఉద్యోగమొచ్చింది.. ఆరు నెలల శిక్షణ అనంతరం 1989లో ఎల్50 అనే గూడ్స్ రైలుకి అసిస్టెంట్ లోకో పైలట్‌గా తొలి పోస్టింగ్ అందుకున్నా... అంటున్నారు సురేఖ.

**నాన్న వద్దంటే వద్దన్నారు! ...** రోజుకి కొన్ని వేల దూరం ప్రయాణించే రైళ్లు నడపాలంటే.. కొన్ని వేల మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలంటే అంత సులభమైన విషయం కాదు. అధికారికంగా పనివేళలు ఉన్నా.. అదనపు సమయం డ్యూటీ చేయాల్సి వస్తుంది. కొన్నిసార్లు అత్యవసరంగానూ పనిలోకి వెళ్లాల్సి రావచ్చు. దీంతో ఇంటిని, కుటుంబ సభ్యులను మిస్సవ్వాల్సి వస్తుంది. అందుకే తనకు కాల్ లెటర్ వచ్చి ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకున్నప్పుడు తన తండ్రి వద్దంటే వద్దన్నారంటున్నారు సురేఖ. అప్పటిదాకా భారతీయ రైల్వేలో మహిళా లోకో పైలట్లు లేరన్న విషయం నాకు తెలియదు. అందుకే చాలామంది.. 'ఈ పురుషాధిపత్యం ఉన్న వృత్తిలో నువ్వు ఇమడలేవు' నిరుత్సాహపరిచారు. సవాళ్లు, త్యాగాలతో కూడిన ఈ ఉద్యోగంలో చేరి నువ్వు కష్టపడడం మేం చూడలేం.. అంటూ నాన్న కూడా నన్ను వారించారు. కానీ అందుకు నేను ససేమిరా అన్నా. ఎలాంటి సవాళ్లైనా ఎదుర్కోవడానికి నేను సిద్ధమంటూ తనను ఒప్పించా. ఆ ధైర్యం, ఆత్మ విశ్వాసమే ఇప్పుడు నన్ను నిలబెట్టాయి.. సాధారణంగా లోకోపైలట్ శిక్షణ అంటే బైక్‌లు, కార్లు నడపడంలో ప్రత్యేకంగా ట్రైనింగ్ తీసుకున్నట్లు కాదు.. డ్యూటీ చేస్తూనే రైలు నేర్చుకోవలసి ఉంటుంది.. నేనూ ఇందులో పూర్తి మెలకువలు నేర్చుకున్నా.. అంటున్నారీ మహిళా లోకో పైలట్.





పరిమితమైన రెండు ఇంజిన్లతో కూడిన ప్యాసింజర్ రైళ్లను నడిపే ప్రత్యేక శిక్షణ. అలాగే షంటర్ (ఇంజిన్లను రైలుకు జత

**ఏదైనా నడపగలను !** అసిస్టెంట్ లోకో పైలట్‌గా విధుల్లో చేరిన సురేఖ.. తన ప్రతిభతో తక్కువ సమయంలోనే ఘాట్ డ్రైవర్ (ప్రమాదకరమైన కొండ రైలు నడపడం)గా ప్రమోషన్ పొందారు. ఆపై అప్పటిదాకా పురుషులకు మాత్రమే చేయడం, విడదీయడం)గానూ గుర్తింపు పొందారు సురేఖ. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగానే రైల్వే ఇంజిన్‌లో వచ్చే మార్పుల్ని అందిపుచ్చుకున్న ఆమె.. సిఎన్‌జి, డీజిల్, విద్యుత్.. ఇలా అన్ని రకాల ఇంజిన్లతో కూడిన రైళ్లు నడపడంలో పూర్తి నైపుణ్యాలు సాధించారు. 2000లో మోటార్ ఉమన్ (అన్ని రకాల ఎలక్ట్రిక్ రైళ్లు నడపడంలో దిట్టగా నాకు ప్రమోషన్ వచ్చింది. ఈ సమయంలో నేను అభిమానించే వారే నా ఆటోగ్రాఫ్ తీసుకోవడానికి ఆసక్తి చూపడం సంతోషంగా ఉంది. నా మూడు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో మైలురాళ్లున్నాయి. మోటారుగెమంగా.. నా పేరు వార్తల్లో మార్మోగింది. అయితే అన్నింటికంటే నాకు బాగా గుర్తుండిపోయిన సందర్భాలేంటంటే.. రాజధా ఎక్స్‌ప్రెస్‌కు లోకో పైలట్‌గా వ్యవహరించడం, రెండేళ్ల క్రితం వందేభారత్ రైలు నడిపిన తొలి మహిళా డ్రైవర్.. ఈ రెండు సార్లు నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతాయి.. అంటారు సురేఖ.. అంతేకాదు.. ఇప్పటివరకు ప్రమాదాలకు సంబంధించిన ఒక్క ఫిర్యాదూ ఆమెపై లేకపోవడం ఆమె వృత్తి నిబద్ధతకు నిదర్శనం! □

# ఒత్తిడి కనిపెట్టొచ్చు..



ఒత్తిడి... ఇది పెద్దలను మాత్రమే కాదు, పిల్లలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అందులోనూ, శారీరక అనారోగ్యాలతో బాధపడే చిన్నారుల్లో ఇది మరీ ఎక్కువ. దీన్ని ఎంత త్వరగా గుర్తించగలిగితే అంత తొందరగా వాళ్లు మానసిక సమస్యల బారిన పడకుండా చూడొచ్చు. అందుకు పరిష్కారంగా జుట్టు శాంపిళ్ల ద్వారా పిల్లల్లోని దీర్ఘకాల ఒత్తిడిని గుర్తించొచ్చని చెబుతున్నాయి యూనివర్సిటీ ఆఫ్ వాటర్లూ తాజా పరిశోధనలు. మిగిలిన విద్యార్థులతో దీర్ఘకాల శారీరక వ్యాధులతో బాధపడే పిల్లలు... మానసిక సమస్యల బారిన పడే ప్రమాదం అధికం. తరచూ స్కూల్ మానేయాల్సి రావటం, మందులు వాడటం, ఆత్మహత్య ఆలోచనలు... ఇలాంటివన్నీ వారి జీవన నాణ్యతను తగ్గిస్తాయి. వారి భావోద్వేగాల మీద తీవ్ర ప్రభావం చూపిస్తాయి. కాబట్టి, తాజా పరిశోధనల ద్వారా అలాంటి పిల్లలను ముందే గుర్తించేందుకు వీలుంటుంది. తగిన విధానాలు అందించే అవకాశం ఉందంటున్నారు పరిశోధకులు. □

# ఫోన్ సరైన దారిలో నియంత్రణ..



ఉదయాన్నే స్నేహితురాలు ఫోన్.. నిన్న ఆఫీసులోని తమ విభాగంలో జరిగిన విషయాలన్నీ పూస గుచ్చినట్లు చెబుతోంది. ఆసక్తితో వింటూ పనిచేస్తుంటే ఎంతకీ తెమలదే! పనంతా పూర్తయ్యింది ఇక, రెడీ అవ్వడమే మిగిలింది. కాసేపు విశ్రాంతి పేరుతో ఫోన్ పట్టుకుంటే చాలు.. రీల్స్, షార్ట్స్ అంటూ సమయం గడిచిపోయింది. తీరా ఆఫీసుకు బయలుదేరేటప్పుడు హడావుడి. ఈ రెండు సందర్భాలే కాదు.. ఫోన్ మితిమీరి వాడటం వల్ల వచ్చే ఇబ్బందులు చాలానే ఉంటాయి. ఈ రోజుల్లో మొబైల్ అరచేతిలో ప్రపంచాన్ని చూపించేస్తుంది. కానీ, దాన్ని సరైన దారిలో వాడకపోయినా, నియంత్రించుకునే మార్గం తెలియకపోయినా విలువైన సమయమెంతో వృథా అవుతుంది. అలాకాకూడదంటే ఇతర పనులకు టైమ్ కేటాయించినట్లే ఫోన్ మాట్లాడేందుకు నిర్దేశించుకోమంటున్నారు నిపుణులు. డెస్క్‌టాప్ మీద తప్ప మొబైల్‌లో సామాజిక మాధ్యమాలను లాగిన్ అవ్వొద్దని చెబుతున్నారు. అలానే భోజనం చేసేటప్పుడు, నిద్రపోయేటప్పుడు డిజిటల్ తెరలకు దూరంగా ఉండటం తప్పనిసరి. ఇక, ఆలారం కోసమనో, టైమ్ చూసుకునేందుకనో ఫోన్ మీద ఆధారపడుతుంటే నెమ్మదిగా ఆ పని మానేయండి. గడియారంలోనో, స్మార్ట్ ఫోన్‌లోనో రిమైండర్ పెట్టుకోండి. ఇవన్నీ మీ పనుల వేగం పెంచుతాయి. ప్రయత్నించి చూడండి. □

# శరణు శరణు

ఆధ్యాత్మికం

వేదశాస్త్రనిపుణుకు
అరుదైన రామకార్యధు
రంధరా హనుమంతరాయ
అంజనాతనయా ఘనవాయుసుత
దివ్యకామరూప అనుపమ లంకాదహ
వార్ధిలంఘన జనసురనుత కలశాపురనివా
రవితనయసచిన రావణవనాపహార
పవనవేగబలాఢ్య భక్తసులభ భువనపూర్ణదేహా
బుద్ధివిశారద జవసత్వవేగ కలశాపురనివా
సీతాశోకనాశన సంజీవశైలాకర్షణ అతతప్రతాపశౌర్య



అసురాంతక కౌతుక శ్రీవేంకటేశుకరుణాసమేత శ్రీ శాతకుంభవర్ణ కలశాపురనివా అన్నమయ్య ఆలపించిన హనుమ సంకీర్తనల్లో దర్శనమిచ్చేది కలశాపుర క్షేత్రాన కొలువైన హనుమంతుడు. కలశాపురం అంటే గుంతకల్లు సమీపంలోని కసాపురమే అనేది సాహితీవేత్తల అభిప్రాయం. ఈ సంకీర్తన పల్లవిలో శరణు శరణు వేదశాస్త్ర నిపుణ అని ఆరంభించాడు. సకల వేదాలను ఆపోశన పట్టినవాడు హనుమ. సూర్యుని వద్ద వేదాలను, వ్యాకరణాన్ని అభ్యసించాడు. దాన్నే స్తుతిస్తున్నాడు అన్నమయ్య. మొదటి చరణంలో హనుమంతుడు అంజనాదేవికి పుత్రుడని, వర ప్రభావంతో వాయుదేవునికి సుతుడు అయ్యాడని చెబుతున్నాడు. కామరూపధరుడన్న సంగతినీ, అనుపమాన రీతిలో లంకానగరాన్ని దహించి వేశాడన్న విషయాన్నీ వర్ణించి మురిసిపోయాడు. సముద్రాన్ని దాటే ముందు చూపిన వినయాన్ని, లంఘించే సమయాన ప్రదర్శించిన సామర్థ్యాన్ని గుర్తు చేసుకున్నాడు. ఆపైన సుగ్రీవునికి మంత్రివంటూ కీర్తించాడు. రావణునికి ఎంతో ఇష్టమైన వనాన్ని నాశనం మ్ము చేసినవాడని, వాయు వేగాన్ని కలిగిన అమిత బలవంతుడని, భక్త సులభుడని కొనియాడాడు. ఈ 3 భూమి అంతటా నిండిన విశాలమైన దేహాన్ని కలిగినవాడంటూ కీర్తించాడు. 'బుద్ధి విశారదుడు హనుమ' అన్న మరో చక్కని విశేషాన్ని ఇక్కడ చూడొచ్చు. సీతాదేవి శోకాన్ని హరింపజేశాడన్న నివేదన తెలుపుతూనే.. అరుదైన సంజీవనీ పర్వతాన్ని పెకలించుకు వచ్చాడని పొగుడుతున్నాడు. శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో వెలిగే బంగారువర్ణపు వేలుపు నీవంటూ హనుమను కీర్తించి, ఈ సంకీర్తనను సుసంపన్నం చేశాడు అన్నమయ్య. □

# అవసరానికే వాడదాం..

మహిళలు ఇంట్లో ఉంటే.. ఎక్కువసేపు గడిపే స్థలం ఏదంటే వంటగదనే విషయం ఠక్కున చెప్పేయొచ్చు మరి అంతటి ప్రాధాన్యం ఉన్న చోటు ఆహ్లాదకరంగా మార్చు కోగలి గితే పని ఒత్తిడి దరి చేరదు.

- చాలా మంది కనిపించిదల్లా ఫ్రిజ్‌ల్లో కుక్కేస్తారు. అయితే దీన్ని అందంగా సర్దుకోవడమూ ఓ కళ. మార్కెట్‌లో దొరికే ఫ్రిజ్ మ్యాట్స్‌ని అరల్లో వేసి వస్తువులు పెడితే మరకలు పడకుండా ఉంటాయి. అలానేస్టోర్ బ్యాగ్‌లు, బాక్సుల్లో ఆహారపదార్థాలు సర్దితే సులువుగా తీసుకోవచ్చు. పాడవకుండానూ ఉంటాయి.



- వంటింటి నిత్యావసరాలు..పప్పులు, మసాలా దినుసులు, సాస్‌లూ, పాస్తాలూ, నూనెలూ, నట్స్ వంటివాటిని పారదర్శకంగా ఉండే సీసాల్లో వేసుకోండి. ఒకవేళ స్టీలు బాక్సుల్లో వేసుకున్నా లేబులింగ్ చేసుకుంటే..వెతక్కుండా అవసరానికి సులువుగా దొరుకుతాయి.
- నిత్యం వాడే పాత్రల్ని ఓ చోట, ఏదైనా సందర్భమో, కార్యక్రమమో ఉన్నప్పుడు వినియోగించేవి మరో చోట పెట్టండి లేదంటే.. కనిపించిందల్లా తీసి వాడేస్తుంటే అనవసరంగా ఎక్కువ గిన్నెలు శుభ్రం చేయాలి. పైగా కడిగాక వాటిని సర్దడమూ ఇబ్బందే.
- వంటగదిలో ఓ చిన్న బ్లాక్ బోర్డ్ లేదంటే వైట్ నోట్‌బుక్ వేలాడదీయండి. ఎప్పుడైనా సరకులు నిండుకుంటే వెంటనే అందులో నమోదు చేయండి. లేదా అక్కడి అసవరాలను తరవాత గుర్తు చేసుకోవాలనుకున్నా రాసుకోండి. ఇక్కడే గ్యాస్ తెచ్చిన తేదీ, వాటర్ ఫిల్టర్ మార్చిన డేట్.. ఇలా చాలా విషయాలను జ్ఞాపకం. తెచ్చుకోవచ్చు. □

# ఎన్ని క్రీములు మార్చినా..

**ఎన్ని క్రీములు మార్చినా, ఎంత ఖరీదైనవి రాసినా.. ఫలితం ఉండట్లేదు అని ఎప్పుడైనా అనిపించిందా? అలాంటప్పుడు ఉత్పత్తి మార్చడం కాదట.. ఏం తింటున్నామో గమనించుకోమంటున్నారు నిపుణులు ఎందుకంటే..**

జీర్ణవ్యవస్థ, చర్మ ఆరోగ్యాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయని తెలుసా? మన పేగుల్లో మేలు చేసే బ్యాక్టీరియా అంటే సూక్ష్మజీవుల కమ్యూనిటీ ఉంటుంది. ఇవి ఆహారం జీర్ణమవడంలోనే కాదు రోగనిరోధకత పెరగడం సహ ఇంకా ఎన్నో విధాలుగా సాయపడతాయి. వాటిల్లో చర్మ ఆరోగ్యం కూడా ఒకటి. ఈ సూక్ష్మజీవుల సంఖ్యలో తేడాలొస్తే అది ఇన్‌ఫ్లమేషన్‌కీ తద్వారా చర్మసమస్యలకీ దారి తీస్తాయి. నిజానికి జీర్ణవ్యవస్థ ఇబ్బందులే మన ముఖంపై ప్రతిఫలిస్తాయంటారు నిపుణులు. సరిగా తినకపోయినా, ఆరోగ్యమైన వాటికి చోటివ్వకపోయినా చర్మం కళ తప్పడం దగ్గర్నుంచి, ఇన్‌ఫెక్షన్ల వరకూ ఎన్నో సమస్యలకు దారితీస్తాయి. యాక్నే, ఎగ్జిమా, చిన్నవయసు లోనే వృద్ధాప్యఛాయలు వంటివి ఆహారం విష యంలో మనం చేసే నిర్లక్ష్యానికి సూచికలే. కాబట్టి, ఏదో ఒకదానితో కడుపు నింపుకోవడం, వేళలు పాటించక పోవడం వంటివి చేయొద్దు. రోజువారీ ఆహారం ద్వారా ఎ,సి,డి,ఇ విటమిన్లు, మినరల్స్ అందుతున్నాయా అనేది గమనించుకోండి.ప్రాసెస్ చేసిన, నూనెలో వేయించిన, చక్కెరలు, చెకడు కొవ్వులు ఉన్నవాటికి వీలైనంతవరకూ దూరంగా ఉండండి. బదులుగా తాజా కూరగాయలు, పండ్లు, పెరుగు, నట్స్ వంటివాటికి చోటివ్వండి. అతిగా టీ, కాఫీ, కూల్‌డ్రింక్‌లను తాగుతోంటే తగ్గించుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగాలి. వారంలో కనీసం అయిదురోజులు వ్యాయామానికి కేటాయించాలి. రోజు ఏడు గంటలైనా నిద్ర ఉండేలా చూసుకోండి. అప్పుడు పొట్ట తద్వారా చర్మం బాగుపడుతుంది.క్రీములపైనే ఆధారపడక పొట్ట సంగతీ పట్టించుకోండి. టమ్మీ ఖుష్ అయనతేనే స్కిన్ ఖుష్ అవుతుంది మరి. □



# పాల బూరెలు



**కావలసినవి :** బియ్యప్పిండి: 3 కప్పులు, బెల్లం తురుము: 2 కప్పులు, పాలు: ఒకటిన్నర కప్పులు, ఉప్పు: చిటికెడు, యాలకులు: రెండు, మైదాపిండి: కప్పు, నూనె: వేయించడానికి సరిపడా.

**తయారు చేసే విధానం :** వెడల్పాటి బేసిన్‌లో బియ్యప్పిండి, యాలకులపొడి, కరిగించిన బెల్లం, మైదాపిండి, పాలు, చిటికెడు ఉప్పు వేసి కాస్త జారుగా కెలపాలి. తరవాత మిశ్రమాన్ని గరిటెతో తీసుకుని కాగిన నూనెలో బూరెల్లా వేసి వేయించి తీస్తే రుచికరమైన పాల బూరెలు రెడీ. □

# డిన్నర్‌కి అల్పాహారం మంచిదేనా?

**బరువు తగ్గాలనో, ఆరోగ్య సమస్యల్ని దూరం చేసుకోవడానికో.. వివిధ ఆహార నియమాలను పాటిస్తుంటారు కొంతమంది.** ఈ క్రమంలోనే రాత్రుళ్లు తేలికపాటి ఆహారం తీసుకుంటుంటారు. కొంతమందైతే ఉదయం తీసుకునే అల్పాహారాన్నే రాత్రి భోజన సమయంలోనూ తీసుకుంటుంటారు. నిజానికి ఈ ఆలోచన మంచిదే అయినా.. అన్ని రకాల అల్పాహారాలు డిన్నర్‌కి సరిపడవంటున్నారు నిపుణులు. ఇది విస్మరిస్తే జీర్ణ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు. మరి, రాత్రి భోజన సమయంలో ఎలాంటి అల్పాహారాలు మంచివి? తెలుసుకోవాలంటే ఇది చదివేయండి!



**ఎంపిక ముఖ్యం...** అల్పాహారం అనగానే బోలెడన్ని వంటకాలు గుర్తొస్తాయి. పోహా, ఇడ్లీ, వడ, పూరీ, దోసె.. ఇలా రోజుకో బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటుంటాం. అయితే రాత్రి భోజనానికీ అల్పామారం తీసుకునే వారు వీటిలో కొన్నింటిని మాత్రమే మెనూలో చేర్చుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో పోషకాలన్నీ అందేలా, ప్రొటీన్లు అధికంగా ఉండేలా, తేలిగ్గా జీర్ణమయ్యే ఆహార పదార్థాల్ని తీసు కోవాలని చెబు తున్నారు.

- ◆. పోహా, ఉప్మా, ఆమ్లెట్,కిచిడీ, ఇడ్లీ.. వంటి పదార్థాల్లో ప్రొటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి.కాబట్టి ఇవి బ్రేక్‌ఫాస్ట్‌కి ఎంత మంచివో, డిన్నర్‌కీ అంతే శ్రేయస్కరం అంటున్నారు నిపుణులు.
- ◆ కొంతమందికి పెరుగులో పండ్ల ముక్కలు, నట్స్, వంటి కలుపుకొని బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవడం అలవాటు! అయితే దీన్నిరాత్రి పూట భోజన సమయంలోనూ నిరభ్యంతరంగా తీసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఇవి త్వరగా కడుపు నిండిన భావననుకలిగించి బరువును అదుపులో ఉంచుతాయని చెబుతున్నారు.
- ◆ అలాగే తక్కువ క్యాలరీలుండే శెనగపిండి దోసె.. పర్‌ఫెక్ట్ డిన్నర్ బ్రేక్‌ఫాస్ట్‌గా చెబుతున్నారు నిపుణులు. ఇందులో అధిక మొత్తంలో ఉండే ఫైబర్ జీర్ణశక్తిని పెంచి.. జీర్ణ సంబంధిత సమస్యలు రాకుండా కాపాడుతుందంటున్నారు.
- ◆. పూరీ, వడ, పకోడీ, సమోసా, పరాఠా, ప్యాన్‌కేక్స్.. వంటి నూనె పదార్థాలు రాత్రి భోజనంలో తీసుకుంటే అరగవు. అందుకే ఇవి అల్పాహారాలే అయినా డిన్నర్‌కు బదులు తీసుకోవద్దంటున్నారు నిపుణులు.

**ఉపయోగాలెన్నో...** రాత్రి కడుపు నిండుగా తినే భోజనం కంటేతేలిగ్గా జీర్ణమయ్యే అల్పాహారం తీసుకోవడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. ఈ అలవాటు వల్ల పలు ప్రయోజనాలూ కలుగుతాయంటున్నారు.

- ◆. రాత్రుళ్లు తేలికపాటి ఆహారం తీసుకోవడం వల్ల సులభంగా జీర్ణమవుతుంది. ఇది సుఖనిద్రకు ప్రేరేపిస్తుంది. నిద్రలేమి సమస్యనెదుర్కొనే వారికి ఇదీ ఓ పరిష్కారమేనట!
- ◆. చాలామంది మలబద్ధకం సమస్యతో బాధపడుతుంటారు. ఇందుకు జీర్ణవ్యవస్థ పనితీరు సరిగ్గా లేకపోవడమూ ఓ కారణమే! అయితే రాత్రుళ్లు తేలిగ్గా జీర్ణమయ్యే ఫైబర్ ఎక్కువగా ఉండే అల్పాహారాన్ని తీసుకోవడం వల్ల ఈ సమస్య తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.
- ◆. చాలామందికి ఉద్యోగాలు, బిజీ లైఫ్‌స్టైల్ వల్ల రాత్రి భోజనం తయారుచేసుకునే సమయం ఉండట్లేదు. దాంతో బయటి నుంచి ఆర్డర్ చేసుకుంటున్నారు. ఇలా రోజూ బయటి ఆహారం తీసుకుంటే ఆరోగ్యానికి నష్టం. అదే సింపుల్‌గా తయారుచేసుకొనే బ్రేక్‌ఫాస్ట్ వంటకాన్ని భోజన సమయంలో తీసుకుంటే పనీ సులువుగా పూర్తవు తుంది. ఆరోగ్యకరం కూడా! అంతేకాదు.. ఖర్చూ తగ్గుతుంది.



- ◆. కొంతమంది కొన్ని రకాల అనారోగ్యాలతో బాధపడు తుంటారు. అలాంటి వారికి ఇంటి ఆహారమే తినమని వైద్యులు సూచిస్తారు. ఈ క్రమంలో ఇలాంటి సింపుల్ బ్రేక్‌ఫాస్ట్ రెసిపీలను ప్రయత్నిస్తే.. ఆయా అనారోగ్యాల్నీ దూదరం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.
- ◆ బరువు తగ్గాలనుకునే వారు పాటించే సూత్రాల్లో తేలికపాటి ఆహారం తీసుకోవడం కూడా ఒకటి. రాత్రి భోజన సమయంలో ఈ సూత్రం పాటిస్తే.. వాళ్లు తమ ఫిట్‌నెస్ లక్ష్యాల్ని మరింత సులభంగా చేరుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే రాత్రి ఎలాగూ అల్పాహారమే తీసుకుంటున్నాం కదా అనిఎక్కువ మొత్తంలో లాగించేయడం, ఆలస్యంగా తినడం..వంటివి సరికాదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో వైద్యుల సలహా మేరకు తీసుకునే ఆహారం మోతాదు నిర్ణయించుకోవడం, పడుకోవడానికి రెండు గంటల ముందే భోజనం ముగించడం ఆరోగ్యకరం! □

### టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్:

# క్వార్టర్స్‌లోనే భారత్ నిష్క్రమణ

### 0-3 తేడాతో హాంకాంగ్ విజయం




**న్యూఢిల్లీ:** ఆసియా టీమ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్-2025లో భారత పురుషుల విభాగం క్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది. భువనేశ్వర్‌లో జరిగిన ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల టేబుల్ టెన్నిస్ జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో హాంకాంగ్ చేతిలో 0-3 తేడాతో ఓడిపోయింది. క్వార్టర్స్‌లోకి బై లభించిన తర్వాత, ఇద్దరు అరంగేట్ర ఆటగాళ్లతో కూడిన భారత జట్టు బలమైన ప్రత్యర్థులతో పోటీ పడలేకపోయింది. టైలోని మొదటి మ్యాచ్ ఆడుతున్న మనుష్ షా, వాంగ్ చున్ టింగ్ చేతిలో 0-3 తేడాతో ఓడిపోయాడు. ప్రస్తుత భారత జాతీయ ఛాంపియన్, అనుభవజ్ఞుడైన ప్యాడ్లర్ చేతిలో వరుస గేమ్‌లలో 5-11, 9-11, 11-13 తేడాతో ఓడిపోయాడు. భారత పురుషుల సింగిల్స్ ప్యాడ్లర్‌లో అత్యున్నత ర్యాంక్ పొందిన మానవ్ ఠక్కర్ తర్వాతి స్థానంలో నిలిచాడు. అతను చాన్ బాల్డ్విన్ చేతిలో 2-3 తేడాతో ఓడిపోయాడు. ఠక్కర్ మొదటి రెండు గేమ్‌లను 8-11 తేడాతో ఓడిపోయినా, తరువాతి రెండు గేమ్‌లను 12-10, 11-9 తేడాతో గెలిచి నిర్ణయాత్మక జట్టుకు చెక్ పెట్టాడు. అయితే భారత్ కెప్టెన్ బాల్డ్విన్ టాప్ స్పిన్‌ను ఎదుర్కోవడంలో విఫలమై 0-2 తేడాతో వెనుకబడి ఉండటంతో చివరి ఆటను 8-11తో వదులుకున్నాడు. భట్టాచార్జీ తీవ్రంగా పోరాడిన మూడో గేమ్‌ను 14-12 తేడాతో గెలుచుకున్నా తరువాతి రెండు గేమ్‌లను వరుసగా 6-11, 7-11 తేడాతో ఓడిపోయాడు. దీంతో భారత్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయింది.

### తొలి ఆర్చరీ ప్రీమియర్ లీగ్

# ఛాంపియన్‌గా రాజ్‌పుతానా




**న్యూఢిల్లీ:** తొలి ఆర్చరీ ప్రీమియర్ లీగ్ ఛాంపియన్‌గా రాజ్‌పుతానా రాయల్స్ నిలిచింది. న్యూఢిల్లీలో జరిగిన ఈ ఆర్చరీ లీగ్‌లో రాజ్‌పుతానా ఉత్కంఠభరితమైన షూటాఫ్‌లో యోధాస్‌ను ఓడించింది. చివరికి రాయల్స్ టైటిల్ పోరులోకి తిరిగి దూసుకుపోవడమే కాకుండా షూటాఫ్‌లో గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. టై బ్రేకింగ్ షూటాఫ్‌లో ఇది హిట్ అండ్ మిస్ మ్యాచ్‌గా మారింది. యోధాస్ జట్టు రాయల్స్ కు గట్టి పోటీ ఇచ్చినందుకు మాత్రమే కాకుండా మొత్తం 10 బాణాలతో 80 పాయింట్లు సాధించిన మొదటి జట్టుగా అవతరించింది. తొలి సెట్‌లో ఖడకే వేసిన బాణంతో యోధాస్‌కు తొలి సెట్‌లో 78-77 తేడాతో విజయం లభించింది. అయితే, రాయల్స్ తదుపరి సెట్‌లో 78-75 తేడాతో తిరిగి విజయం సాధించి ఫైనల్‌ను 2-2తో సమం చేసింది. మూడో సెట్‌లో యోధాస్ ఆర్చర్లు చరిత్ర సృష్టించి 80-77తో అపూర్వమైన స్కోరుతో విజయం సాధించారు. నాల్గవ సెట్ ముగిసే సమయానికి మ్యాచ్ కత్తిమీద సాములా సాగింది, యోధాస్‌కు ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడానికి గ్రాండేకు 9 పాయింట్లు అవసరం అయినా అతను 8 చేయడంతో రాయల్స్ 78-77తో సెట్‌ను గెలుచుకుని 4-4తో నిలిచింది. దీంతో షూటాఫ్ నిర్వహించగా, గిబ్సన్, డియోటేల్ ఆ లక్ష్యాన్ని రెండుసార్లు ఛేధించడంతో రాజ్‌పుతానా రాయల్స్ విజేతగా నిలిచింది.

# విజయానికి చేరువలో టీమిండియా

### 58 రన్స్ దూరంలో వెస్టిండీస్ ఓటమి!

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌లో భారత్ విజయం దిశగా దూసుకువెళుతోంది. 121 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ నాలుగో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 63 పరుగులు చేసింది. క్రీజులో కేఎల్ రాహుల్ (25), సాయి సుదర్శన్ (30)లు ఉన్నారు. భారత్ విజయానికి ఇంకా 58 పరుగులు అవసరం కాగా చేతిలో 9 వికెట్లు ఉన్నాయి. 121 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. విండీస్ ఎడమ చేతి వాటం స్పిన్నర్ జోమెల్ వారికన్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడేందుకు యత్నించి ఆండర్సన్ ఫిలిప్ క్యాచ్ అందుకోవడంతో యశస్వి జైస్వాల్ (8) పెవిలియన్‌కు చేరుకున్నాడు. దీంతో 9 పరుగుల వద్ద భారత్ తొలి వికెట్‌ను కోల్పోయింది. ఆ తరువాత వన్‌డౌన్‌లో వచ్చిన సాయి సుదర్శన్‌తో కలిసి కేఎల్





రాహుల్ విండీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. వీలు చిక్కినప్పుడల్లా ఈ జోడి బంతిని బౌండరీకి తరలించింది. నాలుగో రోజు మరో వికెట్ పడకుండా రోజును ముగించింది. కాగా ఓవర్‌నైట్ 173/2 స్కోరుతో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విండీస్ అద్భుతంగా పోరాడింది. మరో 217 పరుగులు జోడించి మిగిలిన 8 వికెట్లను కోల్పోయింది. కాంప్‌బెల్ (115), షై హోప్ (103) శతకాలు చేశారు. జస్టిన్ గ్రీవ్స్ (50), రోస్టన్ ఛేజ్ (40), జైడెన్ సీల్స్ (32) లు రాణించారు.
గ్రీవ్స్, సీల్స్ పదో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్, బుమ్రాలు చెరో 3 వికెట్లు, సిరాజ్ 2 వికెట్లు, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ చెరో 1 వికెట్ సాధించారు. అంతకముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 518/5 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఆ తరువాత విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్‌కు 270 పరుగుల కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఫాలో ఆన్ ఆడిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులు చేయగా, భారత్ ముందు 121 పరుగుల లక్ష్యం నిలిచింది.



# హరిహరన్‌కు డబుల్ స్వర్ణం

**న్యూఢిల్లీ:** టర్కియే ఇంటర్నేషనల్ ఛాలెంజ్‌లో హరిహరన్ అంశకరుణన్ ఆధిపత్యం చెలాయించి డబుల్ స్వర్ణం సాధించాడు. ట్రీసా జాలీ, ఎమ్మార్ అర్జున్‌లతో కలిసి మిశ్రమ, పురుషుల డబుల్స్ టైటిళ్లను గెలుచుకున్నాడు. భారత బ్యాడ్మింటన్ ఏస్ హరిహరన్ ఈ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి ఒకే రోజులో ట్రీసా జాలీతో మిక్స్‌డ్ డబుల్స్, అర్జున్‌తో పురుషుల డబుల్స్ టైటిళ్లను సాధించాడు. ఉత్కంఠభరితంగా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో హరిహరన్-ట్రీసా జాలీ 52 నిమిషాల పోరాటం తర్వాత ఇండోనేషియాకు చెందిన ఎం నవాఫ్ ఖోయిరియాన్సా-నహ్యా ముహిఫాను 21-14, 18-21, 21-11 తేడాతో ఓడించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత వెంటనే, హరిహరన్ అర్జున్‌తో కలిసి కోర్టుకు తిరిగి వచ్చి పురుషుల డబుల్స్ ఫైనల్‌లో జపాన్‌కు చెందిన యుటో నోడా-షున్యా ఓటాను 21-13, 21-6 తేడాతో ఓడించి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఈ నెల ప్రారంభంలో అల్ ఐన్ మాస్టర్స్ 2025లో విజయం సాధించిన తర్వాత, ఈ విజయం హరిహరన్, అర్జున్ లకు వరుసగా రెండవ టైటిల్‌ను అందించింది. భారత జంటకు మొదటి రౌండ్‌లో బై లభించినప్పటికీ, రెండో రౌండ్‌లో జపాన్‌కు చెందిన యోషిఫుమి ఫుజిసావా-షుంటారో మెజాకిల నుంచి గట్టి పోటీ ఎదురైంది. అక్కడి నుంచి, వారు ఒక్క గేమ్ కూడా ఓడిపోకుండా టోర్నమెంట్‌లో ముందుకు సాగారు. అలాగే మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో హరిహరన్-ట్రీసా పోటీ మొత్తంలో ఒకే ఒక గేమ్‌ను కోల్పోయారు. ఇతర భారత్ ప్లేయర్లలో లక్ష్య శర్మ పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, ఆకర్షి కశ్యప్, అదితి భట్ మహిళల సింగిల్స్ రెండవ రౌండ్‌లోనే నిష్క్రమించారు. మహిళల డబుల్స్‌లో హృషా దుబే-రిధి కౌర్ టూర్, అశ్విని భట్-శిఖా గౌతమ్ కూడా రెండో రౌండ్‌లోనే నిష్క్రమించారు.

### మహిళల వరల్డ్ కప్..

# సెమీఫైనల్స్ సంక్లిష్టం

### 2 విజయాలు, 2 ఓటములతో భారత్

**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల ప్రపంచ కప్-2025లో టీమిండియా సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఆస్ట్రేలియాపై 330 పరుగులు చేసినప్పటికీ, భారత మహిళా క్రికెట్ జట్టు మూడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. దీంతో నాలుగు మ్యాచ్‌ల్లో నాలుగు పాయింట్లతో భారత్ మూడో స్థానంలో నిలిచింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన తర్వాత టీం ఇండియా సెమీఫైనల్‌కు ఎలా చేరుకుంటుందనేది ఇప్పుడు ప్రశ్న. భారత్ ఆడిన 4 మ్యాచ్‌ల్లో రెండింటిలో విజయం సాధించగా, మరో రెండింటిలో ఓటమి పాలైంది. దక్షిణాఫ్రికా కూడా 4 పాయింట్లతో ఉన్నా కానీ నెట్ రన్ రేట్ పరంగా వెనుకబడి ఉంది. దానికి ఇంకో మ్యాచ్ మిగిలి ఉంది. ఇంగ్లాండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌లతో మిగిలిన




మ్యాచ్‌లు ఉన్నందున టీమిండియా ముందుకు సాగే మార్గం దాని చేతుల్లోనే ఉంది. ఈ రెండు మ్యాచ్‌లలో భారత్ గెలిస్తే, దాని నెట్ రన్ రేట్ ఈ జట్ల కంటే మెరుగ్గా ఉంటే, అది నాల్గవ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి ఎనిమిది పాయింట్లను కలిగి ఉంటుంది. భారత్ మిగిలిన మూడు మ్యాచ్‌లలో గెలిస్తే, అది నెట్ రన్ రేట్‌తో సంబంధం లేకుండా మొదటి నాలుగు స్థానాల్లో స్థానం సంపాదించుకుంటుంది. ఈ విధంగా టీం ఇండియాకు ఇంకా అవకాశం ఉంది. ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయినప్పటికీ, సెమీఫైనల్‌కు చేరుకోవాలనే భారత ఆశలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. అయితే టీమిండియా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడి నుండి గెలవాలి. టీమిండియా తన 3మ్యాచ్‌లలో రెండింటిలో ఓడిపోతే, సెమీఫైనల్‌కు వెళ్లే మార్గం చాలా కష్టమవుతుంది. న్యూజిలాండ్, ఇంగ్లాండ్ వంటి బలమైన జట్లతో ఇంకా ఆడాల్సి ఉండటం టీం ఇండియాకు ఆందోళన కలిగించే అంశం. ఇక అగ్రస్థానంలో ఆస్ట్రేలియా కొనసాగుతోంది. ఈ టోర్నమెంట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోని జట్లు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మాత్రమే. ఆస్ట్రేలియా ఆడిన నాలుగు మ్యాచ్‌లలో మూడింటిలో గెలిచింది, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆస్ట్రేలియా 7 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. ఇంగ్లాండ్ తన మూడు మ్యాచ్‌లలో మూడింటిలో గెలిచి 6 పాయింట్లతో రెండవ స్థానంలో ఉంది.

### ఆల్‌టైమ్ రికార్డు దిశగా

# పసిడి పరుగు



### ప్రొద్దుటూరులో రూ.1,30,200

### హైదరాబాద్‌లో రూ.1,27,920


### అదేబాటలో వెండి ధరలు కూడా

### ఒక్కరోజే రూ.7వేలు పెరుగుదల

### వెండి కిలో రూ.1,97,000కు చేరిక

**ముంబయి, అక్టోబరు 13:** పసిడి ధరలు రోజురోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తూ సరికొత్త గరిష్టాలకు చేరుకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా 10 గ్రాముల ధర ఏకంగా లక్షా 25 వేల రూపాయల మైలురాయిని దాటి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ధన త్రయోదశి డిమాండ్‌తో ఈ వారాంతంలో పుత్తడి ధర దేశవ్యాప్తంగా రూ.1.30 లక్షలు దాటే అవకాశముందని బులియన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే ప్రొద్దుటూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,30,200 పలుకుతోంది. ఇక హైదరాబాద్‌లో సోమవారంనాడు పుత్తడి ధర రూ.320లు పెరిగి, రూ.1,27,920కు చేరుకుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.300 పెరిగి రూ.1,14,950 పలికింది. అటు కిలో వెండి ధర సోమవారంనాడు ఒక్కరోజే రూ.7 వేలు పెరిగి, రూ.1,97,000లకు చేరింది. ఈ నెల 9వ తేదీన, 10వ తేదీన వరుసగా రెండు రోజులూ రూ.7 వేలు చొప్పున పెరగ్గా, 11వ తేదీన రూ.6 వేలు పెరిగి రూ.లక్షా 90 వేలకు చేరగా, తాజాగా ఆ ధర రూ.1,97,000కు చేరింది. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితి, ట్రంప్ టారిఫ్‌లు వెరసి అంతర్జాతీయ విపణిలో బంగారంపై మదుపర్ల ఆసక్తి కనబరచడం, డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా తోడవడంతో పసిడి ధరలకు రెక్కలొచ్చాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది మరికొంతకాలం కొనసాగే అవకాశముందని చెబుతున్నారు. వీటికి తోడు ధనత్రయోదశి డిమాండ్‌తో బంగారం ధరలు పెరుగుతున్నాయి. గత పది రోజులుగా పెరుగుతూ వస్తున్న పసిడి ధర, సోమవారం కూడా అదే జోరును కొనసాగించింది. బంగారంతో పాటు వెండి ధరలు కూడా పరుగులు పెట్టడం మార్కెట్‌లో కలకలం రేపుతోంది.
మరోవైపు వెండి ధర కూడా భారీగా పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో దాని ధర రూ. 1,97,000కు చేరింది. పండుగలు, శుభకార్యాలతో సంబంధం లేకుండా ధరలు వరుసగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత మార్కెట్ సరళిని బట్టి చూస్తే, సమీప భవిష్యత్తులో బంగారం, వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.
ఇక 2026 ఆరంభం నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ.1.50లక్షలకు చేరొచ్చని ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,071.50 డాలర్లుగా ఉంది. ఈ వారాంతానికి ఔన్సు ధర 4,150 నుంచి 4,250 డాలర్లు చేరుకునే అవకాశముందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## వాణిజ్యం



# రెండు రోజుల లాభాలకు బ్రేక్

### నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, అక్టోబరు 13:** దేశీయ స్టాక్ మార్కెట్లలో రెండు రోజులుగా కొనసాగుతున్న లాభాల జోరుకు సోమవారం అడ్డుకట్ట పడింది. బలహీన అంతర్జాతీయ సంకేతాలు, ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 174 పాయింట్లు, నిఫ్టీ, 58 పాయింట్లు నష్టపోయింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 173.77 పాయింట్లు (0.21 ) క్షీణించి 82,327.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 58 పాయింట్లు (0.23 ) నష్టపోయి 25,227.35 వద్ద ముగిసింది. చైనాపై కఠినమైన సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మార్కెట్లను కలవరపెట్టాయి. మళ్లీ అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మొదలవుతుందనే భయాలు మదుపర్లలో అమ్మకాలకు దారితీశాయి. ఆదివారం నాటికి ట్రంప్ తన వైఖరిని కొంత సడలించినప్పటికీ, మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. దీనికి తోడు అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్, ఇటీవలి ర్యాలీల తర్వాత లాభాల స్వీకరణ వంటి అంశాలు కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. సెన్సెక్స్‌లో ప్రధానంగా టాటా మోటార్స్,ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్), పవర్ గ్రిడ్ షేర్లు నష్టపోయి సూచీని కిందకు లాగాయి. మరోవైపు అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడి నష్టాలను కొంతవరకు పరిమితంచేశాయి.రంగాలవారీగా చూస్తే, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 0.78 , నిఫ్టీ ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ 0.9 మేర నష్టపోయాయి. అయితే, వీటికి భిన్నంగా నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్ 0.35 లాభపడింది. బ్రాడర్ మార్కెట్‌లో మిశ్రమ స్పందన కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 స్వల్పంగా 0.11 లాభపడగా, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.17 నష్టపోయింది.
"నిఫ్టీ 25,000 కీలక మద్దతు స్థాయి పైన ఉన్నంతవరకు మార్కెట్ ట్రెండ్ సానుకూలంగానే ఉంటుంది. సూచీ 25,500 నిరోధక స్థాయికి చేరే అవకాశం ఉంది" అని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.




### హెచ్1బి వీసా ఫీజుల పెంపు ఎఫెక్ట్

# టిసిఎస్‌లో ఆ నియామకాల్లేవు

### -తేల్చిచెప్పిన సిఇఒ కృతివాసన్

**ముంబై, అక్టోబరు 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బి వీసాల ఫీజు భారీగా పెంచిన నేపథ్యంలో టిసిఎస్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ముఖ్యంగా ఈ ఏడాది హెచ్-1బి వీసా కింద కొత్త నియామకాలు చేపట్టబోమని టిసిఎస్ సిఇవో కృతివాసన్ స్పష్టం చేశారు. అమెరికాలో తమకు సరిపడా హెచ్-1బి ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. యూఎస్‌లో టిసిఎస్‌లో 32 వేల మందికి పైగా ఉండగా, అందులో దాదాపు 11 వేల మంది హెచ్-1బి వీసాపై వచ్చిన వారేనని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 500 మందిని ఈ వీసాలతో భారత్ నుంచి అమెరికాకు పంపించామని తెలిపారు. అయితే, ప్రస్తుతం ఏడాదిలో హెచ్-1బి కింద కొత్తగా ఉద్యోగ నియామకాల ప్రణాళిక లేదని టిసిఎస్ సిఇవో కృతివాసన్ తేల్చిచెప్పారు. స్థానిక ఉద్యోగుల నియామకాలే యధాతథంగా కొనసాగిస్తామన్నారు. అటు అమెరికాలో కూడా స్థానికులనే తీసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. హెచ్-1బి వీసా ఉద్యోగులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించుకోవాలని నిర్ణయించామని, ఎల్-1 వీసాల సదుపాయం కూడా ఉంది, అయితే, అవి పూర్తిగా హెచ్-1బిని భర్తీ చేయలేవు. ఈ నేపథ్యంలోనే టిసిఎస్‌లో కొత్త నియామకాలపై కొంత ప్రణాళిక ప్రకారం చేయనున్నట్లు కృతివాసన్ వివరించారు.

# రిటైల్ ద్రవ్యోల్బణం 1.54 శాతమే

### ఎనిమిదేళ్లలో ఇదే అత్యల్పం

**ముంబయి, అక్టోబర్ 13:** దేశ రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్ మాసంలో 1.54శాతానికి తగ్గింది. ఇది జూన్ 2017 తర్వాత కనిష్ట స్థాయికి చేరుకుంది. ఆగస్టులో 2.07శాతం నుండి ఈ తగ్గుదలకు కూరగాయలు, నూనెలు, పండ్లు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, గుడ్లు వంటి ఆహార ధరలు తగ్గడమే కారణమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వినియోగదారుల ఆహార ధరల సూచిక వార్షికంగా 2.28శాతం తగ్గింది. ఆహార ద్రవ్యోల్బణం వరుసగా నాలుగో నెల కూడా ప్రతికూలంగానే ఉంది. ద్రవ్యోల్బణం తగ్గుదల గ్రామీణ రంగంలో కూడా ప్రతిబింబిస్తుంది. ఆగస్టులో ప్రధాన ద్రవ్యోల్బణం 1.69శాతం నుండి 1.07శాతానికి తగ్గింది. ఆహార ద్రవ్యోల్బణం -0.70శాతం నుండి -2.17శాతానికి తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో ప్రధాన ద్రవ్యోల్బణం 2.47శాతం నుండి 2.04శాతానికి తగ్గింది. ఆహార ద్రవ్యోల్బణం -0.53శాతం నుండి -2.47శాతానికి తగ్గింది. మొత్తం మీద తగ్గుదల ఉన్నప్పటికీ, కొన్ని రంగాలు ధరలలో పెరుగుదలను చూశాయి. గృహ ద్రవ్యోల్బణం ఆగస్టులో 3.09శాతం నుండి 3.98శాతానికి పెరిగింది. విద్య ద్రవ్యోల్బణం 3.60శాతం



నుండి 3.44శాతానికి స్వలనపంగా తగ్గింది. ద్రవ్యోల్బణం తగ్గడానికి కాలానుగుణంగా ఆహార పదార్థాల ధరలు తగ్గడం, పప్పు ధాన్యాల ధరలు తగ్గడం, ప్రపంచ మార్కెట్‌లో ఇంధన ధరలు తగ్గడం కారణమని ఆర్థిక వేత్తలు వివరిస్తున్నారు. ప్రధాన ద్రవ్యోల్బణం ఇప్పుడు ఆర్‌బిఐ నిర్దేశించిన 2-6శాతం లక్ష్య బ్యాండ్ కంటే తక్కువగా ఉండటంతో కేంద్ర బ్యాంకు భవిష్యత్ రేటు చర్యలను నిర్ణయించేటప్పుడు సడలింపు ధోరణిని అంచనా వేయవచ్చు.

# ఇపిఎఫ్‌లో వందశాతం ఉపసంహరించుకోవచ్చు

### సిబిటి సమావేశంలో కీలక నిర్ణయం

### ఉద్యోగులకు భారీ ఊరట

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** ఇపిఎఫ్ పథకంలో పలు సంస్కరణలు తీసుకొచ్చారు. కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ నేతృత్వంలో సోమవారంనాడు సమావేశమైన ఇపిఎఫ్‌వో అత్యున్నత నిర్ణయాధికార సంస్థ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సిబిటి) సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇపిఎఫ్ చందాదారులను దృష్టిలో పెట్టుకొని సరళీకృత పాక్షి క ఉపసంహరణ పథకానికి ఆమోదముద్ర వేసింది. దీంతో ఈపీఎఫ్‌వో ఖాతా బ్యాలెన్స్‌లో వందశాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఉంది. అలాగే 13 సంక్లిష్ట నిబంధనలను ఒకే క్రమబద్ధీకరించిన రూల్‌లో విలీనం చేయాలని తీర్మానించారు. ఇపిఎఫ్ పథకంలో పాక్షిక ఉపసంహరణ నిబంధనలను సవరించారు. వాటిని అవసరమైన (అనారోగ్యం, విద్య, వివాహం), గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులుగా వర్గీకరించారు. దీంతో సభ్యులు ఇప్పుడు ఉద్యోగి, యజమాని సహకారంతో సహా వారి అర్హత కలిగిన




ప్రావిడెంట్ ఫండ్ బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఏర్పడింది. ఇందుకు సంబంధించి విత్‌డ్రా పరిమితులను సవరించారు. విద్య కోసం పది పాక్షిక ఉపసంహరణలు, వివాహం కోసం ఐదుసార్లు పాక్షిక ఉపసంహరణకు అనుమతి ఉంటుంది. అన్ని పాక్షిక విత్‌డ్రాలకు కనీస అవసరం కూడా కేవలం 12 నెలలకు తగ్గించారు. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సిబిటి) సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు కార్మిక మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నిర్ణయాలతో దాదాపు 70 మిలియన్లకు పైగా ఉన్న చందాదారులకు లబ్ధి చేకూరనుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.